ఆంధ్రసచిత్రవారపత్రిక



3-3-72

50 పైసలు


టిక్కెట్లు ఇచ్చు స్థలము
మూడు వారాల తర్వాతే సార్
రు.2.50 ఈరోజు ఆటకు గంట ముందుగా ఇవ్వబడును
రిజర్వేషన్
అబ్బే! రెండు వారాల తర్వాత ఐతేనే సార్
RAILWAY
మీ అదృష్టము బరువు తెలుసుకోండి
పది పైసలు
ప్రస్తుతం యంత్రంలో టిక్కెట్లు లేవు
నెంబరుంది కానీ మనది చెల్లని టిక్కెట్టు
లాటరీ ఫలితాలు
హాల్ టికెట్టొచ్చింది లేవోయ్, మరి పరీక్ష సంగతో...?
ఈ టికెట్ల బాధ నాకే కాదన్నమాట
కాంగ్రెస్ ఆఫీసు

ఉత్తరాలు

కథలు

ఈ వారం (18—2—72) పత్రికలో కొలను వెంకట దుర్గాప్రసాద్ (కార్టూనిస్ట్ బాబు(?) గారి కథ 'సినిమాలోకం' చాల బావుంది దానిలోని డైలాగ్సు జోక్స్‌లాంటి జోక్స్‌తో చదివేందుకు ఎంతో బావుంది

పి. రమణమూర్తి, (కడప)

సీరియల్

'పిల్లలతో ప్రేమయాత్ర' సీరియల్ చాలా బాగుంది ఇంతవరకు మమ్మల్నందరినీ ఊహాలోకాల్లో విహరింపజేసిన ఆ ప్రేమయాత్ర పూర్తయిందంటే ఎంతో విచారంగా ఉంది ఇంకా ఉంటే ఎంత బాగుణ్ను. రచయిత్రి చాలా చోట్ల కాస్త శృంగారాన్ని ఎక్కువగా వర్ణించినా, పేరునుబట్టి, కథను బట్టి అది ఉండవలనేమో ననిపిస్తుంది. ముగింపు చదువుతుంటే బలే సరదా వేసింది ప్రేమ యాత్రకు చిహ్నంగా ఆ దంపతులకు కొంత నష్టం కలిగినా, వారు మరువలేనిది, ప్రేమకు గుర్తుగా వారికి కళాకారుడైన అబ్బాయే జన్మిస్తాడని ఆశిస్తున్నాను

కుమారి ఓ. హేమలత, (పార్వతీపురం.)

* * *

'పిల్లలతో ప్రేమయాత్ర' సీరియల్ చాలా బాగున్నది ముగింపు కూడా నాకు చాల నచ్చింది. యాత్రలో కళ్యాణి, కాంతారావుల వినోదకలాపములు మా కుటుంబ సభ్యులందరినీ కడుపుబ్బ నవ్వించాయి.

లక్ష్మి, అమ్మాజీ, రాధ, (బూరుగపల్లి)

* * *


మీరు ప్రచురిస్తున్న 'పిల్లలతో ప్రేమయాత్ర' పరిమళాసోమేశ్వర్ గారి సీరియల్ చదువుతున్నాను సెక్స్ మోతా దెక్కువైందని కొందరు విమర్శించారు అదేమిటో కాని ఆ నవల చదివి నేనొక పెద్ద మార్పుకు గురికాబోతున్నాను. అదేమిటంటే పెళ్ళి చేసుకోవాలని నిశ్చయించుకున్నాను ఇన్నాళ్ళదాకా నాలో ఉన్న నిశ్చయం బ్రహ్మచారిగా ఉండాలని దానికి కారణం నాకు తెలిసిన చాలా జంటలు అస్తమానం పోట్లాడుతూండడం ఎన్నో బాధలు పడుతుండడం స్వయంగా మా యింట్లోనే (మాదో పెద్ద కుటుంబం) ఆలుమగల పోర్లు అస్తమానం సాగుతూనే ఉంటాయి సంసారంలో ఏమీ సుఖంలేదని ఇన్నాళ్ళు మానుకున్నాను. కాని శ్రీమతి పరిమళగారి నవల చదివాక ఆల్ప సంసారులు అంతా హాయిగా ఉండగలుగుతారు అని అబ్బురపోయి చివరికి పెళ్ళి చేసుకోవాలన్న నిశ్చయము చేసుకున్నాను ఒక బ్రహ్మచారి దృఢత్వాన్ని సడలించిన పాపం తద్వారా భారత జనాభా పెంచడం వల్ల వచ్చే పాపం పరిమళగారికున్ను, ఆంధ్రపత్రిక వారికున్ను (ఫిఫ్టీ ఫిఫ్టీ) 50 50 తగులుతుందని మా స్నేహితులు శాపాలు పెడుతున్నారు పాపం శమించుగాక!

వేముల వేణుగోపాల్ గౌడ్, (రాం..కలా)

* * *

ఇద్దరు పిల్లలున్న భార్యాభర్తలకి 'ప్రేమ' వుంటుందని చెప్పటానికి, హద్దూ పద్దూలేని శృంగారముతో వ్రాసారు రచయిత్రి కాని ఇటువంటి పత్రికలు సంఘములో ఒక తరహాకు చెందిన ఒక స్థాయి కథలను ప్రచురించుటకు పాఠకులకు ఉద్దేశించబడినవి. సాధారణముగా కథలు మెదడుకు పదును పెట్టునట్లు వుండాలి 'సెక్సు' శృతి మించిన శృంగారము మెదడుకు పదును పెట్టక పోగా, అవివాహితులయిన యువతీయువకులకు అవాంఛనీయమైన భావోద్రేకములను కలిగించి పెడ త్రోవ పట్టించాలన్న కదా!

[illegible]



చెప్పిందయ్యా నీస్టోరీ
సెకండ్‌ఫారం పిస్టలే
చలన చిత్ర సమర్పణ
మహమ్మద్
బిన్
తుగ్లక్
దర్శకత్వం
B V. ప్రసాద్
నిర్మాత
V జగన్మోహనరావు
మాటలు
సంగీతం
నైజాం: శ్రీ వెంకటేశ్వర
VIJAYA

Statement about ownership and other particulars about newspaper

ANDHRA SACHITRA VARA PATRIKA

FORM IV (SEE RULE 8)

1. Place of publication: Madras and Vijayawada
2. Periodicity of its publication: Weekly
3. Printer's Name: Sri S. Nageswara Rao
   Whether citizen of Indhia Yes
   If foreigner, state the country of origin —
   Address 16, Luz Avenue, Mylapore, Madras-4.
4. Publishers Name: Sri S. Nageswara Rao
   Whether citizen of India Yes
   If foreigner, state the country of origin —
   Address (As above)
5. Chief Editor's Name Sri S. Sambhu Prasad
   Whether citizen of Indhia Yes
   If foreigner, state the country of origin —
   Address: 16, Luz Avenue, Mylapore, Madras-4.
6. Names and addresses of individuals who own the newspaper and partners or share-holders holding more than one percent of the total capital.

NAMES	ADDRESSES
1. Mr. S. Sambhu Prasad	16, Luz Avenue, Mylapore, Madras-4
2. Mrs. S. Kamakshamma	Do
3. Mr. S. Nageswara Rao	Do
4. Mr. S. Radhakrishna	Do

I, S Nageswara Rao hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

S. NAGESWARA RAO
1-3-72 Signature of Publisher

ఉత్తరాలు

18—2—72 పత్రికలో 'పిల్లలతో ప్రేమ యాత్ర' సీరియల్ పూర్తి చేసారు. పేరుకు సరిపడ్డ కథ సమకూర్చారు. యాత్రలు చేస్తున్నప్పుడు పరిమళా సోమేశ్వర్‌గారిని ప్రేమయాత్రని మరిచిపోలేము. చాలా బాగా వ్రాసారు.

సిరా అనంతలక్ష్మి సత్యవతిదేవి (పుల్లేటికుర్రు)

* * *

మీరు ఆంధ్రవారపత్రికలో ప్రచురించిన సీరియల్స్ చాలా బాగున్నాయి. 'పిల్లలతో ప్రేమ యాత్ర' సీరియల్ వ్రాసిన పరిమళా సోమేశ్వర్ గారికి నా అభినందనములు. ముగింపు చాలాబాగుంది వారి ఊహాలోకంలోని తియ్యని కల బాగుంది. నవీన కాలములోని ఈ ప్రేమ యాత్రల ఫలితంగా కుటుంబం ఒరగటం అనాదిగా వస్తున్నట్లు తోచుచున్నది. ఎందుకనగా పిల్లలు లేనివారికి తీర్థయాత్రలు (దంపతులకు) చేయమని చెప్పడం వారు తీర్థయాత్రలు చేయడం (ఎక్కువ మందికి) తత్ఫలితముగా భార్య గర్భిణి కావడం మనము వింటూనే ఉన్నాము. అది అంతయు భగవంతుని దయ అని చెప్పుకొనుట వినుచున్నాము. ఇంటలో ఉన్నప్పుడు ఉన్న బాధ్యతలు, బరువులు, కష్టనిష్టూరాలు అశాంతి బయట ఉన్నప్పుడు ఉండవు. డబ్బు ఉంటేనే సరే!

వి. మీరాబాయి, (కర్నూలు)

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు:
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం: 3-3-72
శ్రీ విరోధికృన్నామసం॥ ఫాల్గుణమాసం॥ బ॥ తదియ

సంపుటము: 65 సంచిక: 28

స్థాపితము: 1908

ముఖ్య సంపాదకుడు:
శివలెంక శంభుప్రసాద్

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టి వీథి, మద్రాసు - 1

విడి ప్రతి వెల 50 పైసలు

పోస్టుద్వారా

సంవత్సర చందా	31.20
6 మాసముల చందా	15 60
3 మాసముల చందా	7 80

విషయానుక్రమణిక

ముఖచిత్రం: నటి భారతి
(ఫోటో: ఎం. ఎ. మోహన్‌రావు)


నిక్సన్ చైనా ప్రయాణం
అమెరికా సరుకులు అమ్ముకానికి చౌక బేరం!
రక్షించండి. మునిగిపోతున్నాను!
పేదప్రజ
పేదలకోసం అన్ని పార్టీల నాయకులూ విడిచిన కన్నీరు!
ప్రధాని గుర్తుకు వోటు వెయ్యండి
ప్రజాస్వామ్యం
కమ్యూనిస్టులతో కలయిక



సంధ్య

చెంగలువ

'వంజమ్మా! నే పోతుండా' వన్నెం డేళ్ల పని పిల్లడు తడిచేతుల్ని లాగు జేబులో పెట్టి తుడిచేసుకుంటు అప్పుడే గేటువైపు నడిచాడు.

'అయిపోయిందిరా పని?' వినిపించు కున్నట్లు నిదర్శనంగా ఏదో అడిగింది సంధ్య—కళ్లు గోడమీది కాలండర్ మీంచి తిప్పకుండనే.

'జల్దిచేయనా? జరాసేపని!' మాట అయిపోగానే గేటుచప్పుడు వినిపించింది.

అంతే. మళ్లీ అంతటా ప్రశాంతమైన నిశ్శబ్దం.

ఎక్కడో దూరాన్నుంచి అప్పుడప్పుడు గాలిలో తేలుతూ ఏదోహిందీపాట. బహుశః హేమంతకుమార్‌దేమో, వినిపిస్తోంది. మధ్యమధ్య మళ్లీ గంభీరమైన నిశ్శబ్దం. ఆ నిశ్శబ్దంలో భయంలేదు. ఆ ప్రశాంతతలో ప్రళయంలేదు

అంతమందితో కళకళలాడే ఆ యిల్లు ఇలాంటి సమయాల్లో ఎప్పుడూ ఇలాంటి నిశ్శబ్దంతోనే నిండిపోతుంది. కాని ఆదివారా లప్పుడు దీనికి అదో కళ వస్తుంది. అందు కనే ఎవరికీ తెలిసేనా తెలీదు వాళ్లెవరూ లేనప్పుడు ఈ యిల్లెలా వుంటుందో! మునుపు సంధ్యకీ తెలీదు. కాని ఉష పురిటికి వచ్చినప్పట్నుంచి ఇక్కడే ఉండి పోడంతో – అప్పుడే మూణ్ణెల్లుగా ఈ నిశ్శబ్దం ఈ ప్రశాంతతా ఆమె కలవాటై పోయాయి.

వాళ్ల నాన్నగారూ, పెద్దన్నయ్యా ఆఫీసులకి వెళ్లిపోయారు. చిన్నన్నయ్య, తమ్ముడు వేణు, పెద్దచెల్లెలు మంజుల వాళ్లవాళ్ల కాలేజీలకు పోయారు. పద్మ, రమేష్, జయ స్కూళ్లకు వెళ్లారు. అమ్మ, వదిన అవతలపేట్లో వున్న పెద్దత్త వాళ్లింటి కెళ్లారు. ఏదో బజారుపనికో లేకపోతే కూర్చుందుకో వాళ్ళు వెడుతూనే వుంటారు. వీళ్లందరూ పొద్దుట్నుంచి మొదలెట్టి పదిన్నరలోపులోనే వెళ్లి పోతారు. ఇంక పనివాడుకూడా ఏ పది కొండో పదకొండున్నరో అయేసరికి బట్ట లన్నీ ఆరేసి వెళ్లిపోతాడు. ఇప్పట్లాగే ఇంట్లో సంధ్యా, ఉషా మిగుల్తారు. ఉష కూడా ఈ రోజు ఇందాకనే పాలుతాగి నిద్రపోయింది. ఈ ప్రశాంతమైన వాతా వరణంలో కాలండర్‌లోని మనోజ్ఞమైన దృశ్యాల్లో లీనమై యేదేదో ఆలోచిస్తోంది

సంధ్య:

కాంపౌండులో చెట్ల ఆకులు ఒరుసుకున్నప్పుడూ, పిచికలు చిత్రంగా తమాషాకి పోట్లాడుకుంటూ ఎగిరిపోయేప్పుడూ వచ్చేశబ్దం ఆ ప్రశాంతతకి భంగం కలిగించట్లేదు. అదోరకమైన పరిపూర్ణత్వం వస్తోంది. ఉండుండీ ఉడతలుచేసే శబ్దం మాత్రం ఎవరో పైకివస్తున్నట్లుండే అలికిడిచేసి హడావిడి పెడుతుంటాయి. మొదట్లో సంధ్య ఏవరో అనుకునేది. తరవాత పరిశీలనగాచూస్తే హుషారుగా పరిగెత్తే ఉడతలు కనిపించాయి. 'నిశ్శబ్దాన్ని భరించడం, నిశ్శబ్దంగా ఆనందించడం తెలీదు. అమాయికపు ప్రాణులు' అనుకుంది సంధ్య. దూరాన్నుంచి అప్పుడప్పుడు అస్పష్టంగా వినిపించే కారు హారన్లూ, రికార్డులూ, కొద్దిపాటి రణగొణ ధ్వనీ మాటిమాటికీ ఇంతటి ప్రశాంతతా— పెద్దనగరంలో అనే విషయాన్ని గుర్తుతెస్తాయి ఎండా, చలీ అనే భేదం లేదు. ప్రకృతీ ఇక్కడ హాయిగానే అనిపిస్తుంది. ఏదీ భయంకరంగా ఉండదు.

నిద్రలోనే ఉష కొద్దిగా కదిలినట్లనిపిస్తే ఉలిక్కిపడి అటు పరుగెత్తింది సంధ్య. కళ్ళు విప్పకుండానే పెదాల్తో చప్పరిస్తూ నిద్దట్లోనే నవ్వుతోంది ఆమె కనుపాప. లాలనగా ఓసారి జోకొట్టి, ప్రేమగా ఉయ్యాల నోసారి కుదిపి అలవాటుగా కిటికీ దగ్గర నుంచున్న సంధ్య బయటదృశ్యంచూచి క్షణం నిశ్చేష్టురాలై, మరోక్షణం నవ్వుకుంది.

ఎదురుగా అందాలొలికే చిన్న మేడ. వేడిలేని ఆ తెల్లటి కాంతిలో రంగులు అందంగా మెరుస్తున్నాయి. పైకి పాకిన సన్నజాజితీగలు స్వచ్ఛమైన కాంతిలో మెరుస్తూ అటూ ఇటూ అందంగా ఊగుతున్నాయి. నిజానికి ఆ కాలనీలో అన్నీ ఇలాంటి మేడలే ఇంచుమించు. తెలినివాళ్ళకన్నీ ఒకేలాకూడా అనిపిస్తాయి.

ఆ యింటిగేటు యివతల గోడ పక్కగా ఏడేళ్ళ శ్రీకాంత్ చొక్కా ఎత్తి కళ్ళు తుడుచుకుంటూ మధ్య మధ్య వెక్కుతూ ఏడుస్తున్నాడు. ఉండి వుండి కోపంగా కసిగా ఆ ఇంట్లోకిచూస్తూ వాడికే శక్తి వుంటే ఆ యింట్లో వాళ్ళనే కాదు, అమాంతం ఆ యింటినే మింగేసే కసివుంది ఇప్పట్లో శ్రీకాంత్‌కి.

చిన్నపిల్లల మనసెందుకిలా కష్టపెడతారో అన్నీ తెలిసి! కనీసం లాలనగా బుజ్జగించనైనా చేతరాదా?! పసి హృదయాన్ని ఇలాగే పగులగొట్టి, ఆ తర్వాత వాపోతారు, మావాడు మాక్కాకుండా పోయాడు, ఏన్నాళ్ళు పెంచితే యేం—అని. పెంచడంలో ఏముంది! కాస్త ఖరీదైన భోజనం, ఖరీదైన బట్టలూ పడేస్తేనే ఆపేక్షలు పెరుగుతాయా!

అప్పుడే మలుపుతిరిగిన జయశ్రీ—ఆ కాలనీలోనే నాలుగిళ్ళ అవతల వాళ్ళమ్మాయి—వాళ్ళ స్నేహితురాల్తో వస్తోంది. ఆ అమ్మాయికి బహుశః ఈ వైపు రావడం ఇదే కొత్తేమో! తన ఫ్రెండ్ చెప్పేదేం వింటున్నట్టు లేదు. 'ఎంతో చిత్రంగా ఆసక్తిగా రెండువైపులా చూస్తూ యాంత్రికంగా అడుగులేస్తోంది. వాలకంచూస్తే—ఏమంత బీదవాళ్ళుకాదు. కాని అంతకంటె కలిగిన పరిస్థితుల్లో చిక్కిన మామూలు మధ్యతరగతికి చెందినట్లు అనిపిస్తోంది. ఆ యిళ్ళవైపెంతో ఆసక్తితోటీ కొంత ఈసుతోటీ రెండుకళ్ళూ పూర్తిగా విప్పిచూసే ఆ అమ్మాయి శ్రీకాంత్ ఏడుస్తూ వాళ్లింటివేపు ఉడుకుమోత్తనంగా చూడ్డం చూసి రక్కున ఒకక్షణం ఆగిపోయింది కాళ్ళకు బలవంతాన బ్రేకు వేసినట్టు. ఆ అమ్మాయి స్తిమితం తప్పిన బెదురు కళ్ళనిండా ఆశ్చర్యం అలముకుంది త్రుటిలోనే. ఆమె మనసులో భావాలన్నీ అద్దంలోలా కనిపిస్తున్నాయామె మొహంలో—ఇంతదూరాన్నుంచీ సంధ్యకు. కళ్ళలోఉన్న అందమైన, మంచులాంటి మృదువైన పొరేదో హఠాత్తుగా తొలగిపోయినట్టయి, ఆ అమ్మాయికళ్ళు శ్రీమంతుల బిడ్డలమీది జాలితో ఆర్ద్రమైయ్యాయి. శ్రీకాంత్ ముందునుంచి వాళ్ళు దాటిపోయారు. అయినా ఆ అమ్మాయి వెనుతిరిగి ఎంతో ఆత్మీయతగా, జాలిగా ఆ అబ్బాయి వైపు చూస్తూనే ముందుక్కదిలిపోయింది.

గొప్పవాళ్ల గొప్పతనమంతా పత్తిపటాటోపమనీ, ఆ డాంబికం దర్జాలవెనుక అహంకారం అజ్ఞానం తప్ప మరేంలేవనీ; నికృష్టమైన ఆదర్శం తామువేసే తప్పటడుగులను ఒకరు వేలెత్తి చూపకుండా ఉండటానికి 'ఎర'గా ప్రయోగించే సాధనమేకాని, కన్నబిడ్డలు చేసిన చిన్న పొరపాట్లను సహితం క్షమించలేనంతటి హృదయ దౌర్బల్యం లేదా దారిద్ర్యంతో నిండివుందనీ; ఆత్మవంచన స్వార్థం ఇవి వాళ్ళ ఊపిరిలో కలిసి రక్తంలో ప్రతి అణువులోనూ లయమై పోయాయనీ ఆ అమ్మాయికి తెలిస్తే ... ఆ అమ్మాయి దురభిప్రాయాలన్నీ పోయి తన జీవితంలో సుఖపడచ్చు.

ఇదంతా శ్రీకాంత్‌కి అనుభవ పూర్వకంగా తెలుసు. కాని మాటలలో 'ఇదీ' అని చెప్పటందాని లేతవయస్సతనిది.

ఈ భావాన్ని మాటలలో పెట్టగలిగే శక్తి వచ్చేసరికి అతనూ ఈ ఆత్మవంచనా, స్వార్థాల విలువ తెలుసుకుని — అప్పటికీ ఆపాదింపబడే ఆ కొంత గౌరవాన్నీ నిలుపుకోడానికీ; జీవితంలో తల్లిదండ్రుల్ని వాళ్ళ డబ్బునీ ఉపయోగించుకుని పైకి రాగలిగిన అవకాశాల్ని వదిలిపెట్టుకోలేని స్థితికీ, వచ్చేస్తాడు. మళ్లీ ఇంతే. చరిత్ర పునరావృత్తమవుతుందంటారు. సైనికులు పరిస్థితులకు ఒట్టుకునేల్లా రాటుదేలినట్లే వీళ్ళూ ఖరీదైన ఊపిరి పీల్చుకుందుకు అలవాటుపడి అందుకు అనుగుణంగా రాటుదేలుతారు. ప్చ్ ... నిట్టూరుస్తూ వెనుదిరిగింది సంధ్య.

ఆమె గమనించనే లేదు. ఆగి ఆగి వినిపించే ఆ పాట కూడా ఎప్పుడాగి పోయిందో ఆగిపోయింది.

ఇప్పటి ఈ నిశ్శబ్దంలో చిరపితవం లేదు. పెద్ద ముత్తైదువకుండే గాంభీర్యం ఉంది.

పొద్దున్నే మంజుల చెప్పింది.

'చిన్నక్కా, ఈసారి దీపావళి కథల పోటీలో మొదటి బహుమతి కథెంత బావుందనుకున్నావు!'

'ఎప్పుడొచ్చిందే, అప్పుడే ఎప్పుడు చదినావు?' ఆశ్చర్యం ప్రకటించిందామె.

'ఇప్పుడేలే కాని—నేను ఒక్కటే చదివాను. మరి వస్తానూ లేటైపోతోంది' అంటూ వెళ్లిపోయింది

బస్సులన్నీ సరిగ్గా దొరికితే వంటిగంటకి వచ్చేస్తుందది పన్నెండున్నర మంచి మొదలెట్టి సాయంత్రం అయ్యేసరికి అందరూ మళ్లీ గూటికి చేరతారు.

వెళ్ళి పుస్తకం తీసుకుని ఉష ఉయ్యా

అకు కొద్ది దూరంలో గోడ ప్రక్కగా ఉన్న మంచం మీద పడుకుని పుస్తకం తీసింది,

గాలి రయ్‌మని కిటికీ తెరల్ని దూసుకొచ్చి, రకరకాల పూల వాసనల్ని మోసుకొచ్చి ఆమెకు కానుకగా ఇచ్చి చిలిపిగా ఆమె ముంగురులను సవరించి దూరంగా వెళ్ళి వెనక్కు మళ్ళి కిలకిల నవ్విన రొద చేస్తోంది.

పత్రికలో 'అంకితం' అన్న మొదటి బహుమతి కథ వ్రాసింది 'ఎమ్. కె గాంధీ' అని చూడగానే మంజు మాటలు గుర్తొచ్చాయి సంధ్యకి. పేజీలు తిరగేసేలోపునే వేగంగా మనసు ఆలోచించేస్తోంది.

ఈ రచయిత తల్లితండ్రులు దేశభక్తులై వుంటారు. స్వాతంత్ర్య పోరాటంలో ప్రత్యక్షంగానో పరోక్షంగానో పోరాడి వుంటారు. గాంధీగారి మీద భక్తి గౌరవాల్తో తమకు అప్పట్లో పుట్టిన ఈ బిడ్డకి 'గాంధీ' పేరు పెట్టి ఉంటారు. అసలు పూర్తిపేరు ఏ 'మోదుగ కల్యాణ గాంధీ'యో అయి వుంటుంది.

పాపం, తెలుగువాళ్ళకు ఉత్తరాదివాళ్ల గురించి అప్పట్లో ఏమీ తెలిసేది కాదు. ఇప్పుడయితే మాత్రం తెలుసుకునే అవకాశాలున్నాయి కాని చాలామందికి తెలీదు. సరికదా తెలుసుకో-

సంధ్య

కుండానే వాళ్ళ ఇంటిపేర్లు తీసుకొచ్చి వీళ్ళకు పేర్లుగా పెట్టెయ్యడం! కాస్త నిదానంగా దేనిగురించి ఆలోచించడానికీ విచారించడానికీ టైము మిగలటంలేదు.

యంత్రయుగంలో మనుషుల బ్రతుకులే యాంత్రికంగా జరిగిపోతున్నాయి.

కథ మొదలుపెడుతూనే కళ్ళుచురుగ్గా కదిలిస్తూ పేజీలు జరిపేస్తోంది సంధ్య. పడుకున్నది కొంచెం ఒత్తిగిలనైనా ఒత్తిగిలకుండా కాళ్ళూచేతుల్ని కొద్దిగానైనా కదపకుండా మొహంలో రంగులు మార్చుకుంటూ ఏకబిగిని ఇరవై నిముషాల్లో కథని ముగించి 'హుఁ' అని ఒక మూలుగులాంటి నిట్టూర్పు విడిచి, పుస్తకం తలగడ మీద పడేసి లేచినుంచుని ఆవలిస్తూనే వెళ్ళి కాసిని మంచినీళ్ళుతాగి బాల్కనీలోకి కిటికీ తెరల్ని విసురుగా తప్పించి చూసే సంధ్య కళ్ళు కోపంతో ఎర్రబడి — ఏ అపరిచితవ్యక్తి మీదో పీకలవరకూ కసితో అసహనంగా బయటికిచూస్తూ పచార్లు చేస్తోంటే, సర్కసు బోనులో చిరుతపులిలా కదుల్తోందనిపిస్తుంది

కథ మామూలుదే... నిరంజన్ నిర్మలా ప్రేమించుకుంటారు. అలా ఇలా కాదు. ఎంతో గాఢంగా. ఒకక్షణం ఒకళ్ళనుంచొ కళ్ళు కనుమరుగైనా భరించలేనంత తీవ్రంగా.

ప్రేమించినవాళ్ళకు కావలసినట్టు ప్రవర్తించడంలోనే ప్రేమ వ్యక్తీకరించబడుతుంది.

ప్రేమించేవాళ్ళు ఎంత అమూల్యమైనదైనా అర్పించి తమ ప్రేమను తెలియబరుచుకో జూస్తారు.

అలాగే ఆమెకున్న సర్వస్వాన్నీ ఆమె ఆనందంగా అతని కర్పిస్తుంది. అతనూ అంతే.

కాని...తల్లితండ్రుల మాటల్ని కాదనలేకా, వాళ్ళ నెదిరించి డబ్బులేకుండా ప్రేమతో అన్నీ ఇముడవని స్పష్టంగా అర్థంచేసుకుని చివరికి గత్యంతరం తోచక మళ్ళీ ఆ అమ్మాయి మొహం చూడడానికి ధైర్యం చాలక ఇంక ఆమెకు కనిపించకుండా తన జీవితంలో స్థిరపడిపోయాడు నిరంజన్.


అతనిరాక కెదురు చూసి చూసి, అతను రాక — అతని ఆకృతి తనలో కదలటం మొదలెట్టిన మొదట్లో భయంతో స్పృహ తప్పినప్పుడు, ఇంట్లో వాళ్ళకూ కూడా తెలిసి చీదరించుకుంటే, వాళ్ళు చూపిన మార్గాన్ని అనుసరించలేక, ఏ దిక్కూ తోచక ఒంటరిగానే అతని ఆకృతితోనే తృప్తిపొందే అవకాశాన్ని వినియోగించుకుందుకు ఒంటరిగా, దృఢమైన నిశ్చయంతో గడపదాటింది నిర్మల,

క్లుప్తంగా కథ ఇంతే. కాని దీనిని మలచిన తీరూ ఆ శైలీకూడా ఎంతో హృద్యంగా ఉన్నాయి.

ప్రేమ దాని ప్రభావం—పర్యవసానం; స్త్రీపురుషుల దృక్పథాల్లోని వైవిధ్యం అంతా పాత్రల్లో పెట్టి అద్దంలోలా కనిపించేలా వ్రాశాడు రచయిత

కథ చిన్నదే అయినా ముఖ్యమైన బరువైన విషయాల్ని సున్నితంగా చిత్రించాడు. పాఠకుల్ని అర్థం చేసుకోమనీ మీ సామర్థ్యంమీద నాకు నమ్మకముందనీ చెప్తున్నట్టు ప్రతీదీ వ్యంగ్యంతోటీ హాస్యంతోటీ కలిపి చూపించాడు

కాని...ఆ రచయిత ఈ విషయంలో ఎంతవరకూ కృతకృత్యుడయ్యాడన్నది నిరాశాపూరితమైన జవాబొచ్చే పెద్ద ప్రశ్న.



విధిబలీయమని రచయిత చెప్పదల్చుకున్నట్టే చాలామంది అర్థం చేసుకుంటారు. ఇంకా మగవాళ్ళని నమ్మకూడదని కొందరూ, ఆడవాళ్ళు తప్పటడుగువేస్తే కూడదీసుకోలేరని కొందరూ అనుకోవచ్చు. నిజమే ఇవన్నీ చెప్పదల్చుకున్న మాట నిజమే కాని...ఇవేకాదు. ఆ కథ నడిపినతీరు మళ్ళీ జ్ఞాపకమొస్తోంది సంధ్యకు.

మొదటిసారి నిర్మలను చూసినపుడు నిరంజన్ డైరీలో ఇలా వ్రాసుకుంటాడు.

'నిర్మల నలుపే అని గుర్తించేముందే ఆమె కళ్ళు ఎంతో అందంగా నిర్మలంగా ఉన్నట్లు గుర్తిస్తారెవరైనా. ఆమె కొద్దిగా ఊగుతూ నడుస్తున్నట్లు గమనించే ముందే ఆమెజడ పొడుగైందని గమనించినట్లు' అని.

అంటే 'ప్రేమ' సాధారణంగా బాహ్యాకర్షణతోటే ఆరంభిస్తున్నట్లు రచయిత చెప్తున్నాడు.

ఈ వైవిధ్యం చూపడానికే రచయిత నిరంజన్‌ని మొదటిసారి నిర్మల ఎలా గమనించిందో వ్రాస్తూ.

'ఇంత మంటల్లో పడి లోపలికెళ్ళి వాళ్ళకు సాయపడేదాకా అతనికేం పట్టింది! ఎంతమంది బయటనుంచుని తమాషా చూడ్డంలేదూ! తోటి మనుష్యులమీద ఈమాత్రం జాలిలేని వీళ్ళా మనుష్యులేనా! అతనిదెంత జాలిగుండె!' అనుకుంటుందిట.

అంటే మొదట్నించీకూడా అతని హృదయానికే ఆకర్షితురాలైనట్లు స్పష్టంగా తెలుస్తోంది.

ఏదో పనిమీద నిర్మల వాళ్ళవాళ్ళ ఊరు నాలుగురోజులకోసం వెడితే ఆ నాలుగు రోజులూ నాలుగు యుగాలుగా నడుస్తాయి ఇద్దరికీ.

కాని ఇక్కడకూడా వాళ్ళ తహతహాల్లోని తేడా ఎంత స్పష్టంగా వ్రాశాడు! ఆమెది అతని సాన్నిధ్యంలో ఉండాలనే తపనైతే; అతనిది ఆమెను సన్నిహితంగా చేసుకోవాలనే కాంక్షట.

కాని నిస్సందేహంగా ఆ క్షణంలో అతను మనస్ఫూర్తిగానే ఆమెకోసం బాధపడ్డాడు విరహవేదన ననుభవించాడు ఆమెలా. కాని ఎప్పటికీ అదేభావం నిలుపుకోలేక మనసుని కఠినంగా శాసించుకుంటాడట ఇంక ఆమెను మరిచిపోవాలని.

అక్కడే కోపంవస్తుంది సంధ్యకు. అంత మరిచిపోగలిగితే మొదటే మరిచిపోవచ్చుగా. అతని పరిస్థితులూ వాళ్ళవాళ్ళ భావాలూ అన్నీ అతనికి మొదటి నుండీ తెలుసుకూడాగదా! ఆమెను మభ్యపెట్టడంలో అతని ఉద్దేశ్యం?

సంధ్య

అది కేవలం కామంకాదూ! అతను మర్చైతే ఆమె లేనప్పుడు తపించడం అబద్ధం కాదే! అంటే అది కేవలం అల వాటైన అందుబాటులో ఉన్న వస్తువు కావాలనుకున్నప్పుడుండే తహతహే.

ఆకలేసినపుడు అన్నం కావాలనుకున్నంత మామూలుగా కావాలనుకుండచ్చు. ఆలస్య మయేకొద్దీ ఆకలిమంటలలో ప్రపంచం ఏదీ కనపడకుండా ఒక్క అన్నమే పరబ్రహ్మ స్వరూపంగా కళ్ళముందు కద లాడుతుంది. అలాగే ఇదీని...

ఎంత మెత్తగా మోసపోయింది నిర్మల! ఆరోజు 'అంత సిగ్గేమిటి, నిమ్మీ! నాదగ్గర! నీకోసం నేనేదైనా చేయటానికి సిద్ధమే. ధైర్యంగా ఇటు చూడు!' అంటూ తన వైపు తిప్పుకున్నప్పుడు 'నిరంజన్ పెన్ ఇచ్చినప్పుడెంత సంతోషంతో తీసుకుందో అంతే సంతోషంతో అతనికి అంకితమై పోయిందట.

ఇంకోసారనుకుంది సంధ్య అవును ఈ ఎస్. కె. గాంధి చాలా బాగా వ్రాశాడీ కధని—అని.

మగవాళ్ళలో ధైర్యముంటుందనుకునే వాళ్ళకిది కనువిప్పు.

నిర్మల సిగ్గుపడింది. ఆడవాళ్ళందంగా సిగ్గుపడతారు; కాని ధైర్యంగా అవసర సమయాల్లో పరిస్థితులెదుర్కొంటారు. అందుకే తన వారిని విడిచి తెలీనివాళ్ళ మధ్యలో తన ప్రేమనే ఆరాధిస్తూ జీవి తాన్నే అంకితం చేసింది.

నిరంజన్ మొండివాడు. మగవాళ్ళు సహజంగా పిరికివాళ్ళు. అప్పుడప్పుడు మొండికెత్తుతూంటారు. అతను నిజంగా నిర్మలనే ప్రేమిస్తే తన దాహానికామెను బలిపెట్టక్కర్లేదు. ఇటువంటి వారి దాహా నికి బలికావడానికి, పాపం, కొందరు జీవి తాల్నే బలిపెట్టుకు ఎదురు సంఘం చేత నలిపేయ బడుతున్నారు. అలా కాదని ప్రేమ పేరుతో—పోని ప్రేమించినా—వారి జీవితాల్నే కర్కశంగా నలిపివేయడం — ఆ క్షణికమైన ఆవేశంలో నిరంజన్ అను కుంటాడు: 'ఎవరేమన్నా లెక్కచెయ్యను. మనెప్పటికీ నా దానివే. నీకోసం నేను నా సర్వస్వం త్యాగం చేస్తాను' అని. తన కెదో ఎక్కడో ఉన్నదానినిదే పంచ ప్రాణాలూ పెట్టుకుని — దాన్నే 'సర్వ స్వం'గా అంతరాంతరాల్లో అనుకుంటూ వదులుకుంటున్నందుకు బాధ పడు తున్నట్టు 'త్యాగం' అనడంలోనే అతని బలహీనత—హీనత అర్ధమవుతోంది. అతని కుండాల్సింది 'నాకున్నది నీకోసం త్యాగం చేస్తున్నాననే భావం కాదు — నా సర్వసం అయిన నిన్ను దేనికోసం త్యాగం చెయ్య లేనూ' అని. మరి ఇది మొండితనం, మూర్ఖత్వం కాదూ! ఏమంటే వాళ్ళనాన్న 'ఇలా జరగడానికి వీల్లేదు. నీకా అమ్మాయే కావలసొస్తే నువ్వు మాకు పుట్టలేదనుకుంటాం. ఆలోచించుకో' అన్నప్పుడు 'జీవితంలో ప్రేమకు ఎన్నో సహకరించినప్పుడే అది నిలుస్తుందని'

ఓం నమః శివాయ

కం. శకళక లాడు చుంటి నన్ను
శాంతాతీత శాకార విచార
విజ్ఞానిన్
లింగ కళింగ కోటి లింగ
శీతిసీతము లల్లుకొను లీల
నిన్నొదలన్.

కం. ఉచ్చు బుచ్చు లుచ్చను గామ
శూరుపేరు వద్దన్న నీపేరు
చాలన్న
వృష వృష రక్షణుడ నన్న
శ్వాక్సా శిక్షణ విచక్షణ వీక్షణ
నీవున్.

కం. నెమ్మ మేల్కొంచు మంటిన్
శేలేరు దిక్కు దిగంబరా దీన
నంటిన్
శైనైయని యనుగ్రహించన్న
శొక్కారి అభిమాన ఆదరణ
నభిలషించ.

కం. లోలోకులు స్వార్ధులన్న
శా సౌరక్షణ నిరీక్షించుని
అనుంగు బిడ్డనే
శంద కళంద కళావతిని
శః హద్దుదాటి హరునిహసింప
సేతు సేవింతు.

రచయిత్రి : శ్రీమతి సరస్వతీగిరి,

గ్రహించడం—అంటే సంఘంలో వెలుగురికి భిన్నంగా, ప్రత్యేకంగా కనపడ్డానికి భయం పిరికితనం అన్నమాట. మరి ఆనాటి ధైర్య ప్రదర్శన ప్రాణాలకు తెగించిన మొండి తనం. అంతకు ముందు అనే ప్రేమా గీమా అన్నీ వదిలిపోయి అప్పుడే వేరొకరి జీవితంలో ప్రవేశించి — అన్నీ మర్చిపోయి నట్టు నటించడం కూడానూ!

ఆడవాళ్ళెప్పుడూ మగవాళ్ళని ప్రేమించ కూడదు. ప్రేమించినా వాళ్ళమాటలు నమ్మి పూర్తిగా వాళ్ళకు కైంకర్యమై పోకూడదు. ఇంత చిన్న విషయం అర్ధం కాదేం ఎవ్వరికీ!

ఆలోచనలతో మధనపడుతూ అటూ ఇటూ తిరుగుతున్న సంధ్య ఉయ్యాల్లో ఉష ఆరున్నొక్క రాగం ఆలాపించడంతో సర్వం మరచిపోయి అటు పరుగెత్తింది.

మొహం అంతా కాటుక చేసేసుకుని, మూసిన గుప్పిళ్ళతో ఇంకా కళ్ళు రుద్దు కుంటూ కాళ్ళు సాముచేస్తున్నట్టాడిస్తూ ఏడుస్తోంది ఉష.

పాపని సున్నితంగా పైకితీసి ఎత్తు కుని చిన్నగా కుదుపుతూ ఆమెకే అర్ధం కాని భాషలో ఆడిస్తూ మొహం తుడిచి పౌడరు రాస్తోంటే గేటుతీసిన చప్పుడైంది. కిటికీదగ్గరకొచ్చి కాళ్ళెత్తి క్రిందకు చూసిన సంధ్యకు వేణు కనపడ్డాడు.

ఉషని పక్కమీద పడుకోబెట్టి తలగడ ఒకటి అడ్డుపెట్టి క్రిందికి వస్తోంటే కాలింగ్ బెల్ మ్రోగింది. తలుపుతీసిన సంధ్య వేణు మొహం దేనికో హుషారుగా ఉన్నట్టు చెప్తోంటే నవ్వుతూ 'ఏమిటి?' అని కళ్ళతోటే అడిగింది

'అదికాదు చిన్నక్కా! ఏమైందను కున్నావు! వస్తోంటే బస్‌స్టాప్‌లో నుంచున్నామా, చాలా మందే వున్నారు. అందులో ఇద్దరమ్మాయిలు చేతిలో పుస్త కాలో నిలబడి చూస్తున్నారు మామూ లుగా ఏమంత బాగా వుండివుండరులే. మధ్యాహ్నమేమో, మేకప్ అంతాపోయి, జిడ్డుకారుతూ కొస్త అసహ్యంగా కూడా వున్నారు. బస్ వచ్చేస్తోంది. అందరూ

మాటలాపేసి అటు చూస్తున్నారాత్రంగా. మాముందునుంచే బస్ చాలాదూరం దూసుకుపోయింది. అందరూ అటు పరుగెడుతున్నారు. "అమ్మాయిలుకూడా అటు పరుగెడుతున్నారనుకో. మా వాడేమో అటు బస్‌కేసి చూస్తూ 'ముఝే రంగ్ లగ్ రహీహై ముఝుసే దూర్ తూ నజా' అన్నాడు. అంతే ఇంకేముంది! ఒకమ్మాయి మమ్మల్ని మింగేసేట్లు కోపంగా మాకేసి చూసింది' నవ్వుతున్న కళ్ళతో మధ్య మధ్య అభినయంతో వేణు ఏదైనా తమాషాగా చెప్తాడు.

'ఏం ఫ్రెండ్సురా బాబూ! ఉత్తినే కోపంగా చూసి ఊరుకుండా? పాపం!'

'అదికాదు, చిన్నక్కా, వాడు మొదట నిజంగానే బస్ అలా దాటిపోతోంటే పాడాడు. కాని వాళ్ళు అలా అది వాళ్ళ మీదే పెట్టుకుని వాళ్ళ ఉలకు చూపిస్తే వాడిక్కాస్త హుషారు హెచ్చి 'నజా' అని సాగదీస్తూ ఈసారి చెయ్యిజాచి మరీ పోజు పెట్టాడు. వాళ్ళు కోపంగా నేలని తన్నుకుంటూ...' ఇంకా ఉబికే నవ్వుని ఆపుకోలేక నవ్వుతూనే ఉన్నాడు వేణు.

'మాకు తగుల్తుందనుకున్నారేమో! ఫూల్ గర్ల్స్! విసురుగావెళ్ళి మేమెక్కిన బస్‌లోనే ముందు ఎక్కారు. అంతే తేడా. ఏమీలేదు' పుస్తకాలు అల్మైరాలో పడేసి వెళ్ళి కాళ్ళు కడుక్కొని తిన్నగా ఉషదగ్గర కెళ్ళి ఎత్తుకు ముద్దులాడడం మొదలెట్టాడు. రోజా అందరూ అంతే. రాగానే ఒకసారి దాన్నెత్తుకోందే అన్నం తినరు.

'అన్నంపెట్టనా వేణూ?'

'వద్దు. ఇది పెడితే తింటా' అన్నాడు 'ఏమ్మా! పెడతావా!' అంటూ తలెగరేస్తూ దాని మొహంమీదికి వంగి తలూపుతూ.

అన్నింటికీ ఒకటే జవాబుగా నవ్వుతూనే ఉంటుంది ఉష. ఎలా కావాలంటే అలా సర్దుకోవచ్చు నవ్వుని.

'పోనీ కాస్త టిఫిన్‌తెస్తాను' అంటూ వద్దనడని తెలుసు గనుక లోపలికెళ్ళింది సంధ్య ఆలోచనల బరువులో మందంగా నడుస్తూ. వేణూ మనస్తత్వమే అంత. ప్రతీదీ 'జోక్' అంటాడు. ఎంజాయ్ చెయ్యలేని వాళ్ళని చూసి ఇంకొంచెం నవ్వుతాడు.

ఆడపిల్లల కసలేమీ సెన్సాఫ్ హ్యూమర్ ఉండదని చెప్తుంటాడు. ఆ మధ్య నోసారి సంధ్య ఈ మాటకు కొంచెం చిన్నబుచ్చుకున్నట్టు కనపడడంతో మరీ ఎవరే జోక్‌ని ఎలా ఎంజాయ్ చెయ్యలేక పోయారో చెప్తుంటాడు.

సంధ్య సిద్ధాంతాలన్నీ ఇక్కడి కొచ్చే సరికి పల్చబడిపోతూంటాయి. బహుశా ఎప్పుడూ ఇలా చప్పబడిపోవడం అందరికీ అలవాటే. సంధ్యకేకాదు అందరికీ కూడా వాళ్ళ అన్నదమ్ముల ప్రవర్తన చాలా సర్దైనదిగానూ, ఎంతసేపూ వాళ్ళ మంచితనం, గొప్పతనమే బాగాను కనిపిస్తాయి. మరి ఇవి ఎదుటివ్యక్తులలో ఎందుకు చూడలేరో!

ఇదే ఎవరో అయితే విమర్శించేదే సంధ్య. కాని చిన్నన్నయ్య వేణుని దగ్గర

సంధ్య

కొచ్చేసరికి దృక్పథం మారుతుంది;

'నిజమే...వీళ్ళేదేనా అంటే— అనగలిగితే వాళ్ళు ఆ గాలి లేకుంటే తనుని కాన ట్టుండిపోవాలిగాని ఈ హావభావ ప్రకటన లెందుకు సినీమాల్లోలాగా. ఏమైనా వాళ్ళ చూపులకి వీళ్ళు కొంగల్లా రాలిపోతారా?' సంధ్య సమర్థింపులు నిజజీవితంలో ఇలా వుంటాయి.

నిన్నటికి నిన్న చిన్నన్నయ్య బయట ఎవరితోనో గట్టిగా అరుస్తున్నాడు. ఏమిటా అని తనూ చూసింది. బయట మెట్ల దగ్గర ఎవరో ఒకామె ఒకచేతిలో కాగితం; రెండో చేతిలో సంచితో.

'హమ్ పరదేశీ హై; థోడా మదద్ కరో' అని ప్రాధేయపడుతోంది చిన్నన్నయ్య అచ్చతెనుగుతో—

'ఇచ్చింది పుచ్చుకు వెళ్ళిపోతావా— అదికూడా ఊడలాక్కో మంటావా?' ఉంటున్నాడు. రమేష్, జయ, వేణు కూడా అక్కడేవున్నారు. అందరూ గొల్లున నవ్వారు. పైనుంచి వదినకూడా చూస్తున్నట్టుంది. నవ్వు వినిపించింది. 'అలా అనకు బాబూ! మూడంతస్తుల మేడోరు. అర్ధరూపాయినా ఇచ్చేది?' అంది మామూలుగా మొదలెట్టి చివరికి తెలంగాణాయాస తెప్పించుకుంటూ. అడుక్కునే వాళ్ళ కన్నిభాషలూ వస్తాయిలా వుంది!

'అంతస్తులు మూడుంటేయేం? మొదటి అంతస్తులోంచేగా ఇచ్చేది—ఇలానే ఇస్తారు. ఎప్పుడేనా పైనున్నప్పుడు కనపడు చూద్దాం.' మళ్ళీ అందరూ గొల్లున నవ్వుతున్నారు. వేణూ మరి తప్పట్లు తరుస్తూ ఊగుతున్నాడు.

నిజానికి దానికో అయిదు పారేసినా వీళ్ళకి తరిగిపోయేదేంలేదు గాని సంధ్య మళ్ళీ ఇదీ సమర్థించుకుంది.

'ఏంతుంటేయేఁ? ఇంతమంది వచ్చే పోయేవాళ్ళు; ఇంతమంది చదువులు! అసలు చిన్నన్నయ్య వచ్చినవాళ్ళ ఎముకల కోసమే వచ్చినంత తగలేస్తాడు. అక్కయ్య అన్నమానూ వస్తూనే వుంటుంది రమేష్ని చూడాలనుందనే వంకతో దానితో ఒక మంద వచ్చి పడతారు. పెద్దన్నయ్య ఉద్యోగం చేస్తున్నా డన్నమాటే గాని అంతకు రెట్టింపు వాళ్ళ ఫ్రెండ్స్ కిచ్చే పార్టీలకే ఖర్చవుతుంది. అందరూ కాలేజీలకూ, స్కూళ్ళకూ పోయేపిల్లలా— ఏం లేకపోయినా కుదరదు. పైగా హోదాకు తగ్గట్టు లేకపోతే చిన్నతనం కూడాను. ఇలాంటి పెద్ద ఊళ్ళో ఉంటే అస్తమానూ చుట్టాలూ. బంధువులు, స్నేహితులూ రావడం వాళ్ళకే అవుతుంది చాలాభాగం. ఒకకారుందన్న మాటేగాని అది వాళ్ళకు ఊరు చూపించడానికే ఉండిపోతుం దెప్పుడూ. ఒక్కొక్కప్పుడు పాపం, నాన్నగారు కూడా టాక్సీలో వెళ్ళాల్సొస్తోంది. పిల్లలు సరేసరి. ఇంకోకారు కొనాలంటేనే పడటంలేదు—వీళ్ళందరికీ వంచి పెట్టడానికేం మిగుల్తుంది ?!' ఇంత అనుకుని మరీ చిన్నన్నయ్యను సమర్థించుకుంది సంధ్య.

'రారా వేణూ. నీగదిలో పెట్టాను' కేకేసింది సంధ్య.

'ఇక్కడిచ్చేయ్, చిన్నక్కా.'

పట్టుకొచ్చి వేణుకి ప్లేట్ అంది స్తూంటేనే కాలింగ్ బెల్ వినిపించింది. తలుపు తీసింది సంధ్య ఒక్కపరుగునవచ్చి. అమ్మా, వదినా వచ్చారు.

'ఎవరేనా వచ్చారే సంధ్యా?' అనుకుంటూ జవాబు వినకుండానే నవ్వుతూ ఏదో పెద్దత్త వాళ్ళమాటలు చెప్పుకుంటూ లోపలికెళ్ళారు వాళ్ళు.

అప్రయత్నంగా అటు కళ్ళుతిప్పిన సంధ్య గోడ ప్రక్కగా వున్న సీతాఫలం చెట్టు మొదట్లో పుస్తకాలు పడేసి దేనికోసమో ఒకళ్ళ చేతిలోంచొకళ్ళు లాక్కుంటూ రమేష్ జయలు కనుపించారు.

'ఏమిట్రా అది' అంటూ వెళ్ళబోయిన సంధ్యని చూసి.

'ఏం లేదు పిన్నీ' అంటూ రమేష్ 'ఏం లేదత్తా' అంటూ జయ ఏకకంఠంతో పలికి బొగదుచెట్టు వెనక నుంచి రొద్దు వైపుకి పారిపోయారు.

'చిన్నపిల్లలంతే కొట్లాడుకుంటారు మరోక్షణంలో ఆడుకుంటారు. మధ్యలో ఎవరేనా కలగజేసుకుంటే పాపం చాలా ఇబ్బందిపడతారు. వాళ్ళ మానాన వాళ్ళను వదిలెయ్యాలి' అనుకుంది సంధ్య.

'సంధ్యక్కా ఉషేడుస్తోంది — అమ్మ రమ్మంటోంది' అని చిన్న చెల్లెలు పద్మ వచ్చి పిలిచేదాకా అక్కడే నుంచుంది సంధ్య.

'అప్పుడే వచ్చావేమే పద్మా ఈరోజు?' లోపలికొస్తూ అంది.

'ఆఁ...ఇవాళ స్కూలు మునిగిపోయింది రేపు కొంచెం నీరుతీస్తే రమ్మని చెప్పి తోలేశారు' అంది నవ్వుతూ జుట్టు తోసహా కత్తిరించుకుని అతినాగరికంగా ఉండడానికి ప్రయత్నించే పద్మ

సంధ్యకి ఇదే మరోళ్ళైతే ఈ భాష న్నకు హద్దంటూ ఉండాలి అనుకునేదే కాని ... చెల్లెల్ని చూస్తే గుర్తొస్తాడులా వుంది.

లోపలికెళ్ళి ఉషను ఒడిలోకి తీసుకుంటూ.

'మా పాప నవ్వితే వెన్నెలే కురియాలి,
మా పాప పాడితే పాములే ఆడాలి'

అని సన్నగా కూనిరాగం తీసుకుంటూ సమస్తం విస్మరించి అలా ఎంతో సేపు లాలనగా ఆ చిన్నారి చేతిని నిమురుతూనే వుండి పోయింది.

ఇంట్లో రకరకాల శబ్దాలు. వంటింట్లోంచి గిన్నెల చప్పుళ్ళు; బీరువాలు తీసి వేసే చప్పుళ్ళు, వదిన గదిలోంచి తను తెచ్చుకున్న ట్రాన్సిస్టర్లోంచి వివిధ భారతి రికార్డులు సన్నగా వినిపిస్తున్నాయి. వేణూ క్రికెట్ కామెంట్రీ జోరుగా పెట్టేసి రేడియో చుట్టూ ఎవరెవరంటికి స్టెప్స్ వేస్తుండి వుంటారో లెక్కిస్తుండి వుంటాడు—అడుగుల చప్పుడు; కింద పిల్లల కేరింతాలూ పకులు కిలకిలలూ, పిల గాలికి ఆకుల రొదా, మధ్య మధ్యలో దూరంగా గొర్రెల మందనదలించే మోటు కంఠాలూ —మెట్ల—పైన ఎప్పటి ఉడతల గోడా విడి — కాని సంధ్యకు పాపాయి పెదాల చప్పుడే హాయిగా, తీయగా సర్వస్వంగా వినిపించి అనిపిస్తోంది...... ●

ఒక వారం విపరీతం పాలాక్షుడు

రోగులులేని ఆస్పత్రి!

త్రివేండ్రం జిల్లాకు చెందిన వెన్‌పాకల్ అనే ఊరిలో ప్రభుత్వ ఆసుపత్రి వున్నాసరే గత ఏడాదిగా ఎవ్వరూ రోగం కారణంతో ఆ ఆసుపత్రిలో చేరనే లేదట. ఆ ఊరు అంత ఆరోగ్యకరమయినదనుకో డానికి వీల్లేదు. కానీ ఏ రోగి ఏ వేళపుడు ఆసుపత్రికి వెళ్ళినా అక్కడ డాక్టరుగానీ, నర్సుగానీ, వారి అనుమతి పొందిన మరియొకరుగాని— ఎవరూ వుండ రుట. ఇది గిట్టనివారు అన్న ముక్కగాదు, కల్పించిన ముక్క అసలేగాదు. ఆరోగ్యశాఖకు చెందిన ఓ అధి



కారి అన్నారట. ఆసుపత్రి కట్టిన నాటినుంచి నేటి వరకూ కనీసం ఒక్కనాడుకూడా ఒక్క డాక్టర్ను సరదాకైనా ఆసుపత్రిలో కూర్చోలేదట. చెంబూరి ఆసుపత్రి ఇంతకేమీ తక్కువ తినలేదుట. ఆసుపత్రికి డాక్టరుగారింటికి 10 మైళ్ళ దూరమట. ఆయ నకు చాలా సరదా పుడ్తే వస్తాడట అయ్యో! ఆసు పత్రులు కాస్తోకూస్తో యిదే విధానంలో లేనిది ఏ ఊరిలో బాబూ!

ప్రేమ—శిక్ష!


12 సంవత్సరాల క్రితం 'మాస్కో'లో ఓ నావి కుడు వెరాస్ట్రెటోవ్నాషా అనే వితంతువును లేవదీసుక పోయాడట. ఆమె తనతో తన కుమారుడిని కూడా తీసుకు వెళితే అతను ఒప్పక, ఆ కుర్రాణ్ణి నువ్వొదుల్తావా, లేక నిన్ను నేను ఒదల్నా అనినిల దీశాడట. చేసేదిలేక 'ప్రేమే' గొప్పది గనుక (మాతృ ప్రేమకన్న) ఆ పిల్లడిని రైలుపట్టాలమీద వదిలేసి ప్రియునితో వెళ్ళిపోయిందట. ఆ కొడుకు వ్లాదిమర్ అన్నన్యోవశాల్కు అనాధశరణాలయంలో పెరాగాడట. ఎవరి పుణ్యంవల్లనో, జ్ఞానం వచ్చాక ఆ వ్లాదిమర్ శరణాలయంలోంచి పారిపోయి, తన తలితండ్రులను వెతకడానికి బయలుదేరాడట. ఈ కాండలో ఆతడు ఓ స్త్రీ వద్ద పర్సుకాజేసి, పట్టుబడ్డాడట. ఆ పర్సు పోనరు శిక్ష ఆ కుర్రాడికి కాదనీ, అతన్ని పెంచిన ఆతని తలితండ్రులకనీ వాదించి, ఆ కుర్రాడి తలిదండ్రుల భోగట్టా సేకరించడానికాతనివద్దకు వెళ్ళి, అట్టే వుండిపోయిందట. వివరాలవల్ల ఆతను తన కొడుకే నని ఆమె ఆనందంతో వుక్కిరిబిక్కిరయిందట— శిక్ష అమలు జరపొద్దూ!

చావుకికారణం?

ఎరనియల్ పంచాయితీ సభ్యుడు 52 ఏళ్ళ కోలప్పపిళ్లై, ఆయన భార్య 43 ఏళ్ల వళ్ళియమ్మ 14వ తేదీ వుదయం పెరుంగోడెమార్కెటు వద్ద నున్న వారింటిముందు చచ్చిపడున్నారట

బ్రిటన్‌లో నిరుద్యోగులు!

బ్రిటనులో నిరుద్యోగుల సంఖ్య ఇరవై లక్షల దాటిందట. దేశంలో 38 రోజులుగా బొగ్గుగనుల వారు చేస్తున్న సమ్మెవల్ల యీ నిరుద్యోగుల సంఖ్య పెరిగిపోయిందట. కరెంటు స్తంభించి పోయింది లండనంతా కూడా. అయినా సరే సమ్మెవారు చెక్కు చెదరటం లేదనీ, వారివాటం చూస్తే యీ సమ్మె ఇంతలో తీరేలా కనుపించడం లేదనీ లండన్ భయ పడుతున్నది.




కారులో 26 వేల తులాల దొంగ బంగారం!

బొంబాయిలో కస్టమ్స్ అధికారులు అనుమా నంతో ఒక కారును వెంబడించి, నమ్మకంతో ఆ కారును ఆపి, చేసిన సోదా ఫలితంగా 62 లక్షలు విలువచేసే 26వేల తులాల దొంగబంగారం దొరికిం దట. ఈ బంగారమంతా ఆ కారులో చక్కగా దా బడున్నదట— అకటా!!

భార్యమీదకోపం—పిల్లలకి విషం!

బొంబాయికి చెందిన దేశ్‌లాల్ అర్జున్ అనే ఆయనకు తన భార్యతో యింటిఖర్చు విషయంగా తగాదా వచ్చిందట. దాంతో ఆయనకు కోపం వచ్చి



అన్నంలో విషం కలిపి తన ముగ్గురు పిల్లలకూ పెట్టేశాడట. విషంతిన్న వారి పరిస్థితి ప్రమాద కరంగా వుందట.

అనుమానం — హత్య

బెంగుళూరుకు చెందిన ఉత్తరహళ్ళి అనే వూరుకు చెందిన 30 ఏళ్ళ వుప్పప్ప తన భార్య దేవమ్మ నడవడిక మీద అనుమాన పడి, దాన్ని ఏపుగా పెంచుకుని, తద్వారా పుట్టిన ఆవేశంతో దేవమ్మ గర్భిణి అన్న జాలి కూడా లేకుండా ఆమెను నరికి చంపేశాడట.

తెరవెనుక ఎత్తు!

రానున్న ఎన్నికలలో తాను నిలబడేది లేదని, నిల బడుతున్న, కాంగ్రెస్ అభ్యర్థి వారిని ప్రోత్సాహ పరుస్తూ, పార్టీ విజయానికి తాను కృషి చేస్తా నని మైసూరు రాష్ట్ర మాజీముఖ్యమంత్రి వీరేంద్ర పాటిల్ అన్నారట విన్నారా! దని భావమేమి! ●

ప్రశ్నావళి

— కె. రామలక్ష్మి

ఏమ్. కె. కావలి

అంతా 'స్వామినా,' 'స్వామినా' అంటూంటారు. అదేమిటి?

చేయలేం అనుకున్నప్పుడు కూడా చేయడానికి మనచేత ప్రయత్నింప చేసే— మొండితనమే— స్వామినా.

ఏన్. ఎస్. ఎల్. కాకినాడ

కీర్తి ప్రతిష్టలు శాశ్వతాలా? డబ్బు శాశ్వతమా?

రెండూ కూడా ఉన్నంతవరకే — శాశ్వతం అనుకుంటే మంచిది. కలకాలం కూడగట్టింది అంతా క్షణం చాలు నాశనం కాడానికి!

టి. ఎస్. కె. పి. ఉచంటవేమవరం

రామలక్ష్మిగారూ మీరెప్పుడైనా టిక్కెట్టు లేకుండా రైలు ప్రయాణం చేశారా?

రైలు ఏమిట కనీసం బస్సు ప్రయాణం కూడా చేయలేదు బాబూ, అంత ఎడ్వెంచర్ నేచరు కాదు నాది!

ఏమ్, గుంటూరు

విప్లవ రచయితలపై మీ అభిప్రాయం అడిగితే వాళ్ళేం బూచాళ్ళేమిటి భయపడ్డానికి అని డొంకతిరుగుడు సమాధానం చెప్పారు. రచయితలని గురించి అభిప్రాయం అడిగితే వాళ్ళ ఆకారాలనిపట్టి సమాధానం చెప్తారా?

ఏం బూచాళ్ళంతా వికారంగా ఉంటారనా మీ అభిప్రాయం! నా సమాధానంలో డొంకతిరుగుడూ లేదు. పిరికితనం అంతకన్నా లేదు. గట్టిగా అరిచి అందరినీ ఆకర్షించాలనో, భయపెట్టాలనో, తూలనాడాలనో అవస్థపడే వాళ్ళూ బూచాళ్ళే

గోపి, వైజాగ్ 4

కె. రా. గారూ అరుద్రగారూ శ్రీశ్రీగారూ ఒక్కరే అని విన్నాను నిజమేనా? ఈ ప్రశ్నకు తెలిసే సమాధానం యివ్వక పోయారో మీరు వి. ర. సం. ప్రెసిడెంటవగలరు జాగ్రత్త.

అంత శిక్షకి అర్హురాలనా ప్రభూ! నారూ వారూ ఒకరు కారు!

ప్రేమ, తిరుపతి

మీరు అన్ని ప్రశ్నలకీ సమాధానాలు ఇస్తారా? లేక కొన్నిటిని మాత్రమే ఎన్నుకొని సమాధానాలిస్తూ ఉంటారా?

కొన్నిటిని ఎన్నుకొంటూంటాను.

ప్రే. ఏ, తిరుపతి

మగవారిపై మీ అభిప్రాయం ఏమిటి?

ఆడవాళ్ళు ఒకరినొకరు ద్వేషించుకోవడానికి కారణం—యీ మగవారే కద చిట్టితల్లీ!

అందరూ మిమ్మల్ని తిడుతూ రాస్తారు ఎందుచేత? నాకూ మిమ్మల్ని చూస్తే, మీ జవాబులు చూస్తే చిరాకు వేస్తుంది...

అదిగో అందుకే తిడుతూ ఉంటారు—ఆడదానికి ఇంతయుందా! అని!.. చిరాకు వేసినప్పుడు ప్రశ్నావళి పేజీ తిప్పేసి యింకోటి చదవాలి. లేదా హాయిగా ఓ పది నిముషాలు చల్లగాలిలో తిరిగిరావాలి. తెలిసిందా!

టి. ఎస్, న్యూపాల్యంచ

విద్యార్థులకు మీరిచ్చేసలహా — చదువుకునే రోజుల్లో చదువుకోమని. అంటే మిగతారోజుల్లో అల్లరిగా తిరగమనా మీ ఉద్దేశ్యం?

అల్లరి చేయకపోతే పిల్లలెలా అవుతారండీ! మరి అంత అవురంగజేబు తమ్ముడిలా ముఖం పెట్టుకుంటే ఎలా?

ఏన్. ఎస్. ఎస్ ఆర్, ఆముదాలవలస

ఇంటికి దీపం యిల్లాలు అను సామెత ఈ కాలం స్త్రీలకు ఏంతవరకు వర్తిస్తుంది?

ఏ కాలంలోనైనా గృహిణిగా స్త్రీ తన బరువు బాధ్యతలు మరిచిపోదు. పాతకాలం యిల్లాలు ప్రమిదలో దీపం అయితే నేటి అధునాతన గృహిణి ట్యూబులైటు!

డి. ఎమ్. కె, షాద్‌నగరు

మనసున్న మనిషికి సుఖ మెప్పుడుంటుంది?

ఎప్పుడూ ఉండదు— సుఖంలో కూడా ఎదుటివాని కష్టసుఖాల గురించి ఆలోచిస్తాడు కనుక.

పి. పి. ఆర్, నెల్లూరు

శ్రీమతి రామలక్ష్మిగారూ నేను వ్రాసే ప్రశ్నపై కమెంట్సు ఏమీ చెయ్యకుండా సమాధానమిస్తారని తలుస్తాను. నేనొక నవల రాశాను. దాన్ని ఆంధ్రపత్రికకు పంపదలచాను. మరి ఏ అడ్రసుకి పంపాలి? ఎలా పంపాలి?

కమెంట్ చెయ్యొద్దన్నారు— సమాధానం ఎలా చెప్పడం ప్రసాదరావుగారూ, దగ్గర్లోనే ఉన్నారు కదా— ఆఫీసు కొచ్చి యిచ్చేయండి— ఎలా పంపాలి అన్న గొడవ వుండదు!!

బి. ఎల్. కె, యాడికి

ఆడదాని ఆఖరు అస్త్రం కన్నీరు అంటారు మరి తొలి అస్త్రం ఏమిటంటారు?

చిరునవ్వు.

పి. ఆర్, ఆదోని

మానవుడు నైతికంగా పతనం కావడానికి కారణం ఏమిటి?

దారిద్ర్యం. ఐశ్వర్యం— రెండూ సమకారణాలే.

పి. ఆర్; బి. ఎమ్. కె, ఆర్మూరు

పతివ్రతను ఆంగ్లభాషలో ఏమందురు?

మన తెలుగులోలా ఒక్కముక్క లేదు గాని ఫెయిత్‌ఫుల్ విమెన్ అంటే తప్పుకాదు.

కళ్యాణశ్రీ, కోవెలకుంట్ల

ఆడది చేసిన త్యాగాల్లో ఏది గొప్పది?

కోరి దానిని కావడం.

ఎస్. ఏ. ఏ, ఇల్లెందుకాలరీస్

మానవజన్మలో స్త్రీ జన్మ మంచిదా? పురుష జన్మ మంచిదా?

సవ్యంగా సాగితే ఏదైనా మంచిదే.

కె. ర్. ఏమ్, గుడివాడ

తాము కాలక్షేపం సరుకు సప్లయిచేస్తూ విరసం గురించి యిష్టం వచ్చినట్టు మాట్లాడేవారిని బాధ్యతలేని మనుషులనాలి. ఏమంటారు?

ఈ కాలక్షేపం సరుకు చదువుతూ విరసం గురించి విప్లవం గురించి మాట్లాడే మిమ్మల్నే మనాలో తెలియడం లేదు— రమణమణి గారూ, కనీసం బాధ్యతతో బరువైన సరుకు మీరైనా రాస్తుండ కూడదా!!

జి. బి. ఆర్, రాజమండ్రి

నవ్వు నాలుగిందాల చేటు అంటారు కదా. అసలు నవ్వనేకూడదా?

నవ్వులు ప్రతిధ్వనించని యింట ప్రేమలు లోపించినట్టే తమ్ముడూ, ఇతరులని కించపరచడానికి, వ్యంగ్యం ధ్వనించుతూ నవ్వే రకాలు వేరు— అవి చేటు.

ఎక్స్. టి. ఆర్, అనకాపల్లి

చనిపోయాక కొరివి పెట్టడానికి కొడుకు కావాలి కదా. నన్ను దత్తత చేసుకుంటారా?

కంటే కర్మగాని, పెంచుకుంటూ— వీలాంటి వాడెందుకయ్యా నాకు

ప్రశ్నావళి

వి. వి. ఎల్, భద్రాచలం

అంతరాత్మ భగవంతునిచే సృష్టింపబడినదా? లేక మానవసంఘం చేత సృష్టింపబడినదా?

శరీరం మానవ 'సంఘం' చేతా అంతరాత్మ భగవంతుని చేతా సృష్టింపబడిందేమో అనిపిస్తుంది చెల్లెలా!

వి. పి, జగిత్యాల

సంప్రదాయాలు, ఆదర్శాలు వీటి అర్థం ఏమిటి?

సంప్రదాయాలు—అలవాట్లు. ఆదర్శాలు—కోకలు!!

ఇ, అనంతపురం

మొన్నొకసారి దిగంబర కవుల సమావేశం జరిగింది. వాళ్ళు వాగేదంతా నిజమేననిపించింది!

మంచిది అయినా దిగంబర కవులేరి? పేరు— వారు విప్లవంలో కలిసిపోయారట!

కె. ఆర్, విద్యానగర్

అత్తా కోడళ్ల అన్యోన్యతను మీ రెప్పుడైనా చూశారా? తల్లి ఎన్నిఅన్నా పడే కోడలు అత్త చీపురుతీసి పక్కన పెట్టమంటే అంతరాద్ధాంతం చేస్తుంది ఎందుకు?

ఏం ఆ అత్త కాస్త చీపురుతీసి పక్కన పెట్టలేదా ఏమిటి?! దానికొకర్ని పురమాయించాలా?

డి. ఎస్, ఆదోని

పాటలు పాడే లీల మీరు సిస్టర్స్? నాకేమీ అలా అనిపించింది.

లీల పాడితే హాయిగా నిద్రపోయే పసిపాప నా కాస్తానే గొంతు సవరిస్తే భయపడి లేచి కూర్చుంటుంది. పాపం ఆవిడకేం బంగారు తల్లి. నాతో పోలుస్తారేమిటి?

సి హెచ్. ఎస్. కె, కరీంనగర్

మీ ఆడవాళ్ళు భర్తలమీద కోపం తమ పిల్లలపై ప్రదర్శిస్తారెందుకండీ?

అది చేతకాని ఆడవాళ్ళు చేసేపని!

మీరు కసురుకుంటున్నట్టు జవాబిస్తారు. మీకు తలతిక్క బాగున్నట్టుంది.

బాగానే ఉంది. అప్పుడప్పుడది ప్రకోపిస్తూ కూడా ఉంటుంది. అసలే కోతి—అందులో కల్లు తాగిందన్నట్టు— తలతిక్క మనిషికి మీ ప్రశ్న అందిస్తే ఏం చేస్తుంది?!

ప్లాట్‌ఫారం నిండా జనం చిందర వందరగా వున్నారు. పెట్టెల్ని, పరుపు చుట్టల్ని, చేతిసంచుల్ని, మనుష్యుల్ని, తప్పించుకుంటూ ఆలోచిస్తూ నడుస్తున్న రామారావు, తాడుమీద నడుస్తూ బాలెన్స్ తప్పి క్రిందపడిన వానిలా, కాలికి తగిలిన లెదర్ బాక్స్‌తో తుళ్ళిపడబోయి తమాయించుకున్నాడు. ఆ బాక్స్ మల్లె పూలతుప్పవలె మృదువుగా, ఆడదాని అసూయవలె మంచుగడ్డలా తగిలింది. దీనికి కొంచం దూరంలో చిన్నకొండవలె వుంది పెద్ద బెడ్డింగ్. వీటి తాలుకు యజమాని వో సూటువాలా ప్రక్కనే నించున్నాడు. ఎర్రగా, బొద్దుగా, ముద్దుగావున్న ఆపిల్ పండుకి అందంగా రెండునల్లటి మరకలున్నట్లు ఎర్రని అతని మొహంపై నల్లటి కళ్ళద్దాల జోడు కొనతేలిన ముక్కు మొదట్లో నించున్నది. సిల్క్‌క్రింద మెరుస్తున్న తెల్లని యిసుకవలె వెనక్కిదువ్విన పలుచని జుత్తు మధ్య మధ్య అతని తల విచిత్రంగా మెరుస్తున్నది. నీలిరంగు సూట్, ఎర్రని నెక్‌టై, బయటికి కనబడుతున్న కోటు జేబులోని చేరుమాలు, పెదిమల మధ్య వెలుగుతున్న సిగరెట్ అతను పెద్ద ఆఫీసరని, బాగా డబ్బున్నవాడని చెప్పక చెబుతున్నాయి.

ఆ సూట్‌వాలాని చూస్తూ మెరుపు లాంటి ఆలోచనతో ఉలిక్కిపడ్డాడు రామారావు. గాభరాలో మొహం తుడుచుకున్నాడు. 'అవును తప్పదు. యింకేం చేస్తావ్? కాని సంపాదనలేని నువ్వెందుకు పెండ్లి చేసుకున్నావ్? పెళ్ళానికి పదిపైసలపూలు కొనాలంటే నాన్నని అడగాలి. ఆయన దగ్గర మాత్రం డబ్బెక్కడది? ఇంకా విదగవలసిన వాళ్ళు ఆరుగురున్నారు. అయినా ఎంత కాలమని యిస్తారు? నీకు విశ్వవిద్యాలయం వారిచ్చిన డిగ్రీసర్టిఫికెట్, నీ తెలివి తేటలు ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి. ఇంకా ఆలోచిస్తే ఏందుకు? నేను చెప్పినట్లువిను, నీకిక ఉద్యోగంరాదు—' అంటూ ఆందోళనపు ఆలోచన వెలువరించింది మనసు. అతని వక్రపు ఆలోచనల్ని ఆపింది వివేకంగా అంది బుద్ధి 'తప్పు [illegible]



స్వయంకృతం

[illegible]

చేయడం. మువ్వొకసారి దొంగవైతే ఆ ఊబి నుండి యిక తప్పించుకోలేవు. దానివల్ల నీకు సుఖం తాత్కాలికం, యెప్పుడో ఒకప్పుడు శిక్ష అనుభవించక తప్పదు—'

'నిన్ను దొంగగా బ్రతకమని నేను చెప్పడంలేదు. కఠిన దారిద్ర్యం అనుభవిస్తున్నావు. డబ్బు అవసరం నీకుంది, అందుకే నాలుగు డబ్బులు దొంగిలించి; ఎక్కడైనా లంచమిచ్చి మంచి ఉద్యోగం సంపాదించుకో, ఇందులో తప్పేమీలేదు—' అనే మనసులో ఆలోచనలకి అడ్డువస్తూ 'నువ్వు ఆవేశపడకు, చేజేతులా భవిష్యత్‌ని పాడుచేసుకోకు. నువ్వు దొంగవికాకు. చిక్కుల్లో చిక్కుకోకు—' అనే బుద్ధి హెచ్చరికని లక్ష్యపెట్టకుండా 'నువ్వు ధైర్యం చేయాలి, రిస్కు తీసుకోవాలి. అప్పుడే నీకు ఆనందం, నీమీద ఆధారపడిన వాళ్ళకి సుఖం. నువ్వు దొంగవికాక తప్పదు. డబ్బు సంపాదనకి యింకో మార్గం లేదు.' అనేమనసు హితబోధతో అతని మస్తిష్కం వేడెక్కింది.

అంతవరకు ఫెళ్ళున ఎండకాసిన ఆకాశంలో నల్లటిమేఘాలు కమ్ముకుంటున్నాయి. దూరంగా సుడిగాలికి రోడ్డుమీది చెత్త, చెదారం, అయిదారు అడుగుల ఎత్తులో గిరున తిరుగుతోంది.

'మీది ఈవూరా?' అన్నాడు సూట్‌వాలా అంగ్లంలో, రామారావుని ఉద్దేశించి.

స్వయంకృతం

'కాదు' అన్నాడు సంక్షిప్తంగా రామారావు.

'ఎక్కడకి వెళ్తున్నారు?'

'గుంటూరు'

'ఈసారి బండి అరగంట లేటుట. వాన వచ్చేట్లుంది' అన్నాడతను తిరిగి సిగరెట్‌ని బూటుకాలి క్రింద నలుపుతూ.

'అవును. యిప్పుడే నాకు తెలిసింది'


'మీకేమీ అభ్యంతరం లేకపోతే నా బెడ్డింగ్, లెదరుసూట్‌కేసూ చూస్తూ వుండండి. నేను కాఫీ త్రాగి హిగ్గిన్ బాదమ్స్‌లో ఏమైనా మేగ్జన్స్ తెచ్చుకుంటాను' అన్నాడు సూట్‌వాలా రామారావు మొహాన్ని చదువుతూ.

'వెళ్ళిరండి. నేనిక్కడే వుంటాను' అన్నాడు అనాలోచితంగా.

'థాంక్స్' అంటూ రామారావు వొంక ఒకసారి చూసి సిగరెట్ వెలిగించి కదిలాడు సూట్‌వాలా.

రామారావు మనసు తిరిగి కల్లోలమయింది.

'వెతకబోయిన తీగె కాలికి తగిలింది. ఆయన వెళ్ళిపోతున్నాడు. అదిగో 'వోవరుబిడ్జి ఎక్కుతున్నాడు. కొద్ది క్షణాల్లో కనుమరుగై పోతాడు. అందుకో బంగారపు ముద్దలాంటి సూట్‌కేసుని'



ఎవరో కొరడాతో కొడుతున్నట్టు ఫీల్ అయ్యాడు.

'నీ అదృష్టం పండింది. నువ్విక పెద్దమనిషిలా ధైర్యంగా సూట్‌కేసుని తీసుకుని వెళ్ళవచ్చును. నువ్వున్న ప్లాట్‌ఫారం కనబడకుండా రేపల్లె వెళ్ళే రైలు వస్తున్నది; గో మాన్, అదృష్టాన్ని కాలదన్నుకోకు.'

అతన్ని ఎవరో ముందుకి తోసినట్లయింది. వణికే చేతులతో సూట్‌కేసు అందుకున్నాడు. ఎడమచేత్తో గుండెని నిమురుకుంటూ కుడిచేత్తో సూట్‌కేసుని పట్టుకుని పరిగెత్తినంత పనిచేస్తూ పెద్ద పెద్ద అంగలతో ప్లాట్‌ఫారం దాటి బుకింగ్‌హాల్లోకి ప్రవేశించబోయాడు. కాని గేటు దగ్గర టికెట్ కలక్టర్ అటకాయించాడు. 'నేను గుంటూరు వెళ్దామనుకున్నాను. కాని యిప్పుడు అవసరం కనిపించడం లేదు. అందుకే టికెట్ రిటరన్ యిస్తున్నాను ...' అంటూ మాటలు నానుస్తూ టికెట్ చూపిస్తూ తడబడుతున్నాడు రామారావు. తడిసి ముద్దవుతున్న అతని దుస్తుల్ని. అతని చిన్న చిన్న కళ్ళల్లో లేత చిగురుటాకులా కదులుతున్న భయాన్ని దాచడానికి వ్యర్థ ప్రయత్నం చేస్తున్న పొడవైన జుత్తుని, మాటలు పెగల్చి పెదిమల్ని, నల్లబడుతున్న సన్నగా గీసిన గెడ్డాన్ని, వణుకుతున్న చేతిలో కదులుతున్న సూట్‌కేసుని, టికెట్ కలక్టర్ మార్చిమార్చి చూస్తూ అతగాడ్ని తోసుకుని వస్తున్న ప్రయాణీకుల వద్ద టికెట్స్ తీసుకుంటున్నాడు. అచేతనంగా రామారావు నెమ్మదిగా కదిలి టికెట్ కలక్టర్‌కి అనుమానం కలగకుండా వుండేందుకు బుకింగ్ ఆఫీస్ దగ్గరకివెళ్ళి ఒక క్షణం తటపటాయించి గబగబా బయటికి నడిచి రిక్షాయెక్కి 'బస్‌స్టాండ్‌కి' అని హెచ్చరించి 'అమ్మయ్యా' అంటూ గాఢంగా నిట్టూర్చాడు.

'ఏయ్ రిక్షా ఆపు' అని పిలుపు వినబడగానే రామారావు గుండె ఝల్లుమంది. సూట్‌వాలానా, టికెట్ కలక్టరా, అని అనుకుంటూ వెనక్కి తిరగలేక భయాందోళనతో బంగళాదుంపలా ఉడికిపోతున్నాడు. అంతలో ఒక పంగనామాలవాడు రిక్షా దగ్గరికి వచ్చి 'మీరా ... క్షమించండి మా అల్లుడు అనుకున్నాను' అంటూ తప్పు

కున్నాడు. 'పోని...పోని...రిక్షాని పోనీ' అంటూ అరిచాడు రామారావు. అయిదు నిమిషాల్లో రిక్షా బస్‌స్టాండుకి చేరింది. రిక్షావాడి చేతిలో అర్ధరూపాయి పెట్టి కదులుతున్న బస్‌ని విసురుగా, గాలిలా ఒక్క అంగలో అందుకున్నాడు. ఎక్కి ఎక్కడంతో బస్‌నంతా కలియజూశాడు. పట్టుమని రెండుపదుల ప్రయాణీకులు కూడా లేని ఆ బస్‌లో తనకి తెలిసిన వాళ్ళు ఎవరూ లేరని నిర్ధారణ చేసుకుని ఒక సీటుని ఆక్రమించి పెట్టెని జాగ్రత్తగా కాళ్ళదగ్గర పెట్టుకున్నాడు. ఒకసారి బలంగా గాఢంగా గాలి పీల్చాడు. ప్రక్క సీటులో కూచున్న ఆసామి ఎడమ చెయ్యి కిటికీ చువ్వలకి ఆన్చుకుని దర్జాగా చుట్ట త్రాగుతూ అర్ధనిమీలిత నేత్రాలతో రామారావుని పరిశీలించసాగాడు. ఆయన మోచేతులుదాటిన శుద్ధ ఖద్దరు చొక్కా ధరించాడు. ఏడుకొండలవాడి నామాలు. టూత్‌బ్రష్ మీసాలు. విప్రనారాయణ క్రాఫ్. నల్లగా, మొద్దుగా, పోత విగ్రహంలా వున్న ఆయన పళ్ళుమాత్రం తెలుపు. ఆయన నెమ్మదిగా వంగి రామారావు కాళ్ళక్రింద దొంగలా దాక్కొన్న సూట్‌కేసుని గుచ్చి గుచ్చి చూడసాగారు. శరీరమంతా తేళ్ళు జెర్రిలు పాకినట్లు వణికిపోతున్నాడు రామారావు. పెట్టె హేండిల్ని కదిలిస్తూ 'ఈ పెట్టె ఎక్కడ కొన్నారండీ' అన్నారాయన.

'బెజకాడ...బెజవాడ...విజయవాడ'

'విజయవాడలో యిటువంటి డీలక్స్ సూట్‌కేసులు దొరకవే...అక్కడ లేవే—' అంటూ ఆయన అనుమానం వెలిబుచ్చుతూ రామారావు కళ్ళల్లోకి చూశారు. 'ఎంతకి కొన్నారు' అంటూ తిరిగి ప్రశ్నించారు.

రామారావుకి మాట పెగలటంలేదు. అతని మొహం నల్లబడుతోంది. చిన్నాభిన్నమైపోతున్న గుండెని చిక్కబెట్టుకుని తెలివిగా అన్నాడు.

'నేనిది కొనలేదు. నా ఫ్రెండ్ ప్రజెంట్ చేశాడు'

'అలాగా' అంటూ దీర్ఘం తీశారాయన.

ముందుసీటులో కూచున్న పోలీస్ సర్కిల్ ఇనస్పెక్టర్ దొంగ వాసన పసిగట్టినట్లు వెనక్కి తిరిగి చూశాడు.

పంచప్రాణాలు గాలిలో కలిసిపోయి

స్వయంకృతం

నట్లు ఒక క్షణకాలం నిర్జీవుడైనాడు రామారావు. కండక్టర్ 'ఎక్కడికి వెళ్లాలి' ప్రశ్నించడంతో బాహ్యలోకంలోకి వచ్చి బలహీనంగా 'గుంటూరు... గుంటూరు' అంటూ స్లాకు జేబులువెతికి, ఆందోళనతో ఫాంట్ జేబులు తడుముకుని తిక్కగా తలగోక్కుని, చివరికి ఫాంట్ బాక్ పాకెట్‌లోని రూపాయినోటు తీసి యిచ్చాడు రామారావు. బస్‌లోని వాళ్ళంతా తనకేసి చూస్తూ వుంటే తల తిరిగి మూర్ఛ వచ్చినంత పనయింది అతనికి.

గుంటూరు బస్ స్టాండులో బస్ ఆగింది. ఆదుర్దాగా సూట్‌కేసు తీసుకుని బస్ దిగి గబగబా నడవసాగాడు తలవంచుకుని. అంతలో అతని భుజంపై పాము పాకినట్లయింది. ఆపాదమస్తకం వణికిపోతూ ప్రక్కకి తిరిగి చూశాడు. 'అగ్గిపెట్టె వుందా?' అంటూ అడిగాడో ఆగంతకుడు

'లేదు...లేదు...' అంటూ పది అడుగులు వేసేసరికి,

'ఆగరా ఆగు దొంగవెధవ...నా సూట్‌కేసు తీసుకుని పారిపోతావా? యిల్లు పొలం అమ్మి పిల్లకి పెండ్లి చేద్దామని పదివేలు పదిలంగా పెట్టెలో పెట్టుకుని ప్రయాణం చేస్తూవుంటే నన్ను మోసం చేసి పెట్టెనెత్తుకుపోతావా? యిప్పుడెక్కడికి పోతావు...దొరికావురా దొంగ' అంటూ మాటల తుపాకీని పేలుస్తున్న పిచ్చివాడ్ని తప్పించుకుని ఎక్కుపెట్టి వదిలిన బాణంలా బస్ స్టాండుదాటి రోడ్డుమీదికి వచ్చాడు రామారావు. ఎదురుబడిన రిక్షానెక్కి టాపు వేయించుకుని ఎక్కడికి వెళ్ళవలసినది చెప్పాడు. ముళ్ళపొదలా గుచ్చుకుంటున్నది సూట్‌కేసు అతగాడికి.

చిన్న ధర్మసత్రంలాంటి యింటిముందు రిక్షా ఆగీ ఆగడంతో ఒక్క దూకు దూకి పద్మవ్యూహంలోకి ప్రవేశిస్తున్న అభిమన్యుడిలా అయిదారు నాకిళ్ళు దాటి రెండు మూడు మెలికలు తిరిగి యింట్లోకి ప్రవేశించి 'అమ్మా అర్ధరూపాయి వుంటే యివ్వవే' అంటూ కేకవేశాడు రామారావు.

'ప్రొద్దున్నే గదురా మూడురూపాయలు తీసుకున్నది. అప్పుడే ఖర్చు అయిందా?' అంటూ వంటింట్లోంచి సమాధానం యిచ్చింది అతని తల్లి.

'అమ్మా నేను పది పైసల టీ కూడా త్రాగలేదు. ఖర్చు అయింది మూడు రూపాయలు. ఏమని చెప్పను—' అని మనసులో అనుకుని 'ముందు అర్ధరూపాయి చూడు. రిక్షావాడి కివ్వాలి' అని అన్నాడు.

'రిక్షా ఏమిటా? ఆ పెట్టె ఏమిటి?' అంటూ సావిట్లోకి వస్తూ ఆరాతీయడం ప్రారంభించింది. అప్పటికే ఆ యింటి జనభా అతనిచుట్టూ చేరారు.

'అదంతా నీకు తరువాత చెబుతానులే—ముందు డబ్బులివ్వు' అంటూ విసుక్కున్నాడు.

'యిప్పుడెక్కడున్నాయిరా?' అంటూ సణుక్కుంటూ అయిదారు నిమిషాలకి ఇరవై నాణేల చిల్లర తెచ్చి యిచ్చింది.

ఆవిడ వచ్చేలోగా శ్రీమతి మాలతి కురిపిస్తున్న ప్రశ్నలవర్షంలో తడుస్తూ; సూట్‌కేసుని తమ్ముళ్ళ, చెల్లెళ్ళబారినుండి రక్షించుకుంటూ; రిక్షావాడి కేకలకి సమాధానం చెబుతూ సతమతమైపోయాడు.

రిక్షావాడికి డబ్బులిచ్చాకా తనకై ప్రత్యేకించిన తడికల గదిలోకి వెళ్తూ 'ఈ పెట్టె నా ఫ్రెండ్‌ది. హైదరాబాద్ నుండి నిన్ననే వచ్చాడు. అమరావతి వెళ్తూ పెట్టెకూడా ఎందుకని మనింట్లో వుంచమని నాకిచ్చాడు. రేపు వస్తాడు' అంటూ గుక్కతిప్పుకోకుండా అందమైన అబద్ధపుకథ వల్లించాడు. క్రొత్తపెట్టె చూడగనే కొడుకు ప్రయోజకుడైనాడని భ్రమించిన అతగాడి తల్లి కొంచం నిరుత్సాహపడి 'అది సరేలే సంబడం...వెళ్లినపని ఏమయ్యింది?' అంది కొంచెం కటువుగా.

'మామూలే...మళ్ళీ పదిరోజుల తరువాత కనబడమన్నారు' అంటూ సులభంగా సమాధానమిచ్చాడు.

'ఇంతోటి భాగ్యానికి మూడున్నర ఖర్చు? ఉద్యోగం వచ్చాకా ఎంత వెనకేస్తావో తెలీదుగానీ ముందు ఖర్చు మితిమీరి పోతున్నది—' అంటూ చేతులు తిప్పుకుంటూ వెళ్లిపోయింది అతనితల్లి.

'అంతఖర్చు ఎందుకవుతుంది అత్తయ్యగారు. మహాఅయితే రూపాయిన్నర. లేకపోతే రెండు. మిగతాది మిత్రుడికి మెహర్బానీగా

ఖర్చుపెట్టి వుంటారు' అంటూ మాటలు పొగతీసింది మాలతి మూతివిరుస్తూ.

'అదికాదు లతా—' అంటూ సూట్‌కేసుని సురక్షితంగా తలుపు మూల పెట్టాడు.

'ఏదికాదు. ఈవేళ శ్రావణ శుక్రవారం. మీ నాన్నని అడిగి చీర కొంటా నన్నారు. చీరెకాదుకదా జాకెట్‌కి గతిలేదు. అంతదాకా ఎందుకు నాలుగు గాజులు వేయించుకుందామంటే నాదగ్గర నలభై పైసలులేవు. అత్తయ్యగారిని అడిగితే అరవై ఆరాలు తీస్తుంది. మా పుట్టింటిని ఎద్దేవా చేస్తుంది అందుకే ఆవిడ్ని అడగను. గతిలేక గానుగ ఎద్దులా ఎందుకు బ్రతుకున్నానో తెలీదు' అంటూ కంట నీరు పెట్టుకుంది మాలతి.

'అదికాదు లతా' అంటూ ఆమెని దగ్గరకి తీసుకోబోయాడు. ఆమె దూరంగా జరుగుతూ 'నా దగ్గరకి రాకండి వొళ్ళు మండిపోతున్నది. నేను ఎన్నిరోజులనుండి అడుగుతున్నాను పదిపైసల పూలు తెమ్మని. తెచ్చారా? ఈ రోజు తెస్తానని డాంబికాలు పలికి వెళ్ళి మిత్రుడు కనబడగానే నన్ను మరిచిపోయారు. అప్పు డెండి నేనటు పుట్టింటివారికి యిటు మెట్టినింటికి భారమైపోయాను. అయినా పెళ్ళానికి పది పైసలివ్వలేనివాళ్ళు పెళ్ళెందుకు చేసుకోవాలి? నేను గతిలేక ఆత్మహత్య చేసుకోలేక జీవచ్ఛవంలా పడి వుంటున్నాను—' అంటూ అతడ్ని కడిగి వేస్తూ కన్నీళ్ళు తుడుచుకుంటూవుంది మాలతి.

'కంట తడిపెట్టుకులతా. కష్టాలు కలకాలం వుండవు. నాకూ ఉద్యోగం వస్తుంది. మంచిరోజులు వస్తాయి. శుక్రవారం కంట తడిపెడితే లక్ష్మినిలవదు—' అతని మాటలకి అడ్డువస్తూ తీవ్రంగా అంది 'ఒకసారి బయటికి వెళ్ళిచూడండి రంగురంగుల చీరెలు కట్టుకుని పూలు పెట్టుకుని పేరంటానికి వెళ్తున్న మన పక్కింటివాళ్ళని చూడండి. అత్తయ్యగారు నన్నూ పేరంటానికి రమ్మంటుంది ఎలా వెళ్ళను— పెళ్ళినాటి పట్టుచీరె ఎన్ని సార్లు కట్టుకోను—'

'అయితే నువ్వు వెళ్ళడంలేదా?' అన్నాడు ఆలోచితంగా,

'ఎందుకు వెళ్ళడంలేదు. మీ అమ్మగారు ఊరుకుంటుందా? ఈ ముష్టిది కూడా వెళ్ళాలి గుప్పెడు శనగలకోసం —నేనేంటి అంతా వెళ్తాం—' అంటూ ఆమె ఆవేశంగా ఆ గదినుండి నిష్క్రమించింది పమిటి చెంగుతో కళ్ళు తుడుచుకుంటూ, తల్లిదండ్రుల ఫోటో వంక చూస్తూ గాఢంగా నిట్టూర్చాడు రామారావు.

* * *

పరంధామయ్యగారు పూర్వకాలపుమనిషి. సత్తెకాలపు సత్తెయ్యగారు. లంచం తీసుకోవడం పాపమంటారు. సిఫార్సులతో ఉద్యోగం వేయించుకోవడం తెలివితక్కువ అంటారు. నీన్నోనీతులు చెబుతున్న ఎనిమిది పిల్లలతండ్రి అయిన పరంధామయ్యగారు పెద్దకూతురు పెండ్లి నిమిత్తం పెద్దకొడుకు రామారావుకి నాలుగువేలు కట్నం తీసుకుని పెండ్లిచేశారు. అప్పుడేం అడగలేక పోయాడు. రామారావు. నేనుకట్నం తీసుకుంటేగానీ అక్కయ్య పెండ్లి కాదని సర్ది చెప్పుకున్నాడు. అప్పటికే అతను బి.ఎస్‌సీ. పాసైనాడు. కాని ఉద్యోగంలేదు. అతగాడు గత నాలుగు సంవత్సరాలనుండి ఆరు తాత్కాలిక ఉద్యోగాలు చేశాడుగాని స్థిరమైన ఉద్యోగం దొరకలేదు. పరంధామయ్యగారు నెలకి సంపాదించేది ముప్పై పదులు, అందులో ఆరగురు పిల్లలు; ఉద్యోగంలేని కొడుకు; కోడలు పిల్లా; ఆయనగారు; ఆయన భార్యా బ్రతకాలి, ఎన్నో ఆర్థికబాధలు అనుభవిస్తున్న ఆ కుటుంబాన్ని భగవంతుడు ఒకే ఒక విషయంలో కరుణించాడు. ఎనిమిది పిల్లల తరువాత కుటుంబనియంత్రణ అసలు వరచకపోయినా పరంధామయ్యగార్ని తొమ్మిది మంది పిల్లలతండ్రిగా తయారు చేయలేదు. మూడు సంవత్సరాలుగా కాపురం చేస్తున్నా మాలతిని తల్లిని కానివ్వలేదు.

మాలతి మంచి గంధంలాంటిది. మల్లె పువ్వులాంటిది. తన పరిమళంతో పది మందిని పరవశింపచేయాలనే తత్వంగలది. ఆమె అందమయింది. ఆమె అందాన్ని ద్విగుణీకృతం చేయడానికి అందరూ గుర్తించడానికి తగిన ఆడంబరాలు లేవని ఎప్పుడూ ఆవేశపడుతూ వుంటుంది. రామారావు నిరాడంబరుడు. నిర్వికారుడు. ఉద్యోగంకోసం అప్లికేషన్స్ పెట్టడానికి పోస్టుఖర్చులు కూడా తండ్రిని అడగలేని అవిటివాడు. కాని పెళ్ళాంపోరు, కుటుంబ ఆర్థిక పరిస్థితి, తడిగుడ్డలతో గొంతులు కోసే నయవంచకుల సంఘం అతడ్ని పిచ్చివాడిలా చేసి దొంగలా మార్చింది.

* * *

పక్కింటి గోడగడియారం ఆరుగంటలు కొట్టింది పేరంటానికి వెళ్ళారు అందరూ.



వీధి తలుపు గడియపెట్టి లైట్ వెలిగించి మడతమంచం వాల్చిదిండుపై జనరల్ నాలెడ్జి పుస్తకంపడేసి గబగబా తడికల గదిలోకి వెళ్ళి సూట్‌కేసు మూత అట్లకాడ సహాయంతో తీశాడు రామారావు అదుర్దాగా పెట్టెనంతా కెలికాడు. అతని ఉత్సాహంపై చన్నీళ్ళు చల్లినట్లయింది. పెట్టెలో ఒకపెరి కాటన్ వైట్‌సూట్, బనీన్లు, డ్రాయర్లు, లుంగీ, ఒకఫైలు. డైరీ చెక్కుపుస్తకం మినహాయించి యింకేమీలేవు అతని కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. యాదాలాపంగా డైరీమీద సి. జాన్. జనరల్ మేనేజర్, ఎ. బి. సి. కంపెని మద్రాసు అని చూడగానే అతని కళ్ళముందు మెరుపు మెరిసినట్లయింది. ఆత్రుతగా ఫైలుచదివాడు అతని కళ్ళల్లో నీళ్ళసుడులు తిరిగాయి, గుండెలు వడి వడిగా కొట్టుకున్నాయి క్షణకాలం చలన రహితుడైనాడు. కళ్ళార్పకుండా తిరిగి తిరిగి ఆ ఫైలులో కాగితాలు చదువుతున్నాడు. ఆ ఫైలు అంతా అతనికళ్ళల్లో కనబడుతోంది. అతనికళ్ళల్లో రెటినాపై ఏర్పడిన ఆ ఫైలు కథయిది.

స్వయంకృతం

ఎ బి సి కంపెనివారి ప్రధాన కార్యాలయం మద్రాసులో వుంది. దాని ఆంధ్రా సర్కిల్ ఆఫీసు గుంటూరులో వుంది. ఆ బ్రాంచి ఆఫీసులో ఒక రిప్రజంటెటివ్ పోస్టు ఖాళీగా వుంది. ఆ ఖాళీ పూర్తి చేయడానికి బ్రాంచి మేనేజర్ మాధవయ్య జరిపిన తతంగమంతా ఆ ఫైలులో వుంది. పత్రికలలో వేసిన ప్రకటనకి పది వందల అప్లికేషన్స్ వచ్చాయి. కాని నలభైమందికి మాత్రం వ్రాత పరీక్ష ఏర్పాటు చేసి ఆ వడపోతలో మిగిలిన ఆరుగురికి ఇంటర్వ్యూ జరిపి, పి. రామారావుని (తండ్రి శ్రీ పి. పరంధామయ్య) సెలక్టు చేసినట్లు అతగాడికి అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ యివ్వడానికి అనుమతి యిప్పించవలసినదిగా కేంద్ర కార్యాలయాన్ని కోరాడు బ్రాంచిమేనేజర్ మాధవయ్య. కేంద్రకార్యాలయం వారు ఫైలంతా పరిశీలించి పి. రామారావుకి అపాయింట్‌మెంట్ ఆర్డర్ యివ్వమని బ్రాంచి మేనేజర్‌కి హుకుం జారీ చేశారు. అదీ కథ!



ఫైలు సవ్యంగా బ్రాంచి మేనేజర్ మాధవయ్య దగ్గరికి వెళ్ళి వుంటే వెంటనే అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ వచ్చేవి రామారావుకి. నాలుగువందల రూపాయల ఉద్యోగస్తుడిలా నవ్వుతూ కాలక్షేపం చేసేవాడు. కాని ఆ ఫైలు యిప్పుడు అతని చేతిలో వుంది. అందుకే నీళ్ళు కారిపోతున్నాయి; అతని నవనాడులు జివ్వుమని లాగుతున్నాయి; కర్తవ్యం బోధపడటం లేదు. కారణం అతను దొంగ! యిక ఉద్యోగం రాదు. ఏ మొహం పెట్టుకుని సూట్‌కేసుని జనరల్ మేనేజర్‌కి అప్పగిస్తాడు? తప్పు క్షమించమని కాళ్ళావేళ్ళా పడితే సి. జాన్ కరుణిస్తాడా? అతను ఆలోచిస్తున్నాడు. కరుణించడు ఉద్యోగం యివ్వడు, పోలీసులకి అప్పచెబుతాడు. తన మచ్చ అందరికి కనబడుతుంది. కుటుంబ భవిష్యత్ మరింత అధ్వాన్నమైపోతుంది. తనిప్పుడేం చేయాలి? సూట్‌కేసు సంగతి బయటపడితే తల్లిదండ్రులు ఈసడిస్తారు; భార్య దులిపి పారేస్తుంది యిప్పుడు ఆ సూట్‌కేసు పెద్ద వైట్ ఎలిఫెంట్‌లా తయారయింది అతనికి. తేలుకుట్టిన దొంగలా అన్యమనస్కుడై ఆలోచిస్తున్నాడు. యిప్పుడు ఏం చేయాలి? ఏం చేయాలి? అతని మనసులో తుఫాన్, అంతలో వీధి తలుపు చప్పుడయింది.

హడావిడిగా పెట్టెసర్ది అటకమీదికి విసిరివేశాడు. ఇప్పుడు అతనిపై అతనికే అసహ్యం వేస్తున్నది. భారంగా అడుగులు వేస్తూ తలుపులు తీశాడు.

'అప్పుడే తెనాలినుండి వచ్చావా? వెళ్ళిన పని ఏమయింది?' అంటూ చెప్పులు విడుస్తూ ప్రశ్నార్థకంగా చూశారు పరంధామయ్యగారు. రామారావు జవాబు చెప్పలేదు. పిచ్చివాడిలా శూన్యంలోకి చూస్తూ నించున్నాడు.

'మళ్లీ రమ్మన్నారా' అంతేలే... అంతగాక యింకేమవుతుంది. ఇప్పుడే మాధవయ్య కనబడ్డాడు—' అంటూ బట్టలు విప్పి లుంగీ కట్టుకున్నారు. నిర్లక్ష్యంగా వింటున్నాడు రామారావు.

'నిన్ను సెలక్టు చేశాడుట.' అంటూ కుర్చీలో కూచుని తన మాటలకి కొడుకు


ఏమీ అర్థంకాక విశ్చలంగా వుండటం గమనించి 'ఏం నీకు కూడా తెలిసిందా?' అన్నారాయన కళ్ళు చిట్లించి 'ఏమిటి నాన్నా...ఏమిటి?' అన్నాడు వరాకుగా.

'అదే... అదే... జనరల్ మేనేజర్ పి. జాన్‌గారి లెదరు సూట్‌కేసుని తెనాలి ప్లాట్‌ఫారంమీద ఒక దొంగవెధవ పెద్ద మనిషి ఫోజులో కాజేసాడుట. మన తల రాత బాగుంటే ఈ దొంగతనం జరిగేది కాదు—' కాంతివంతమైన తండ్రి కళ్ళ ల్లోకి చూడలేక అసలు విషయం లాగాలని రామారావు నేలచూపులు చూస్తూ ప్రశ్నించాడు 'అపాయింట్‌మెంట్ ఆర్డర్సు ఎప్పుడిస్తామన్నారు మాధవయ్యగారు?'

'ఇంకేం ఆర్డర్స్. బుగ్గిలో ఆర్డరు. మద్రాసు జనరల్ మేనేజర్‌గారు ఈ బ్రాంచి ఇనస్పెక్షన్‌కివస్తూ ఆ ఇంటర్వ్యూ ఫైలుకూడా తెచ్చారుట. అది బాక్సులో వుంది. మన పాలిటి శనిదేవత ఆవరించిన ఆ భిక్షుడు ప్లాట్‌ఫారంమీద యింకేమీ పెట్టెలు లేనట్లు ఆయనగారి సూట్‌కేసునే తస్కరించాడు. మళ్ళీ కథ మొదటికి వచ్చింది. రెండుమూడురోజులలో తిరిగి ప్రకటన చేస్తారుట. మళ్ళీ నిన్ను అప్లయిచేయమన్నారు మాధవయ్య—' అన్నారు విసుగ్గా పరంధామయ్యగారు. వెక్కివెక్కి ఏడుస్తున్నాడు రామారావు.

'అదేమిట్రా ఏడుస్తున్నావు. ఏం చేస్తాం మనకర్మ. అనుభవించాలి తప్పదు. ఆ దొంగ వెధవకి మాత్రం మన ఉసురు తగలదూ? వాడుమాత్రం ఏం బాగుపడు తాడు. సర్వనాశనమైపోతాడు. నోటిదగ్గరకి వచ్చిన 'కూడు'ని లాగినవాడు కుష్ఠు రోగంతో కృంగిపోతాడు' అంటూ ఆవేదనతో, ఆక్రోశంతో తిడుతున్నారు పరంధామయ్యగారు. యాదృచ్ఛికంగా చేసిన తప్పుడు పనికి పర్యవసానం మౌనంగా అనుభవిస్తున్నాడు రామారావు, ఆ సూట్‌కేసుని ఎలా వదిలించుకోవాలో ఆలోచిస్తూ దిక్కులు చూస్తున్నాడు. ●

రత్నాలను గురించి



ధర్మపథం: బులుసు వేంకటరమణయ్య

విలువగల వాటిలో మిక్కిలి విలువైనవి రత్నాలు తొమ్మిది. అవి — వజ్రం, వైడూర్యం, గోమేధికం, పుష్యరాగం, పద్మరాగం, మరకతం, నీలం, ప్రవాళం, మౌక్తికం అనేవి. వీటిలో ప్రవాళమంటే పగడం. మౌక్తికమంటే ముత్యం. తక్కినవి మణిభేదాలు.

ఇవి గొప్ప ఐశ్వర్యం గలవారే సంపాదించ వీలగుతుంది. నకిలీ రత్నాలు కాకుండా అసలైన వాటిని పెద్ద పెద్ద శ్రీమంతులు, మహారాజులు మాత్రమే సంపాదించ గలుగుతారు.

విలువగల యీ రత్నాలు ఎక్కడ ఉన్నా, వాటిని ఎంత శ్రమపడి అయినా సంపాదించ డానికి పూర్వం రాజులు ప్రయత్నించేవారు; కృతార్థులూ అయ్యేవారు. దాన్నిబట్టే 'రత్నహారీ తు పార్థివః' అనే నానుడి ఏర్పడింది.

'రత్న' శబ్దానికి రత్నమనే అర్థం కాకుండా మరొక అర్థమున్ను ఉన్నది. ఆయా జాతి వస్తువులలో శ్రేష్ఠమైన దాన్ని కూడా రత్నమని అంటారు. పురుష రత్నమంటే పురుషులలో శ్రేష్ఠుడు, కాంతా రత్నమంటే స్త్రీలలో ఉత్తమురాలు. ఈ విధంగానే వస్తువులున్నూ.

అందువల్లనే పూర్వకాలంలో ప్రభువులు రత్నాలతోపాటు ఆయా వస్తువులలో అత్యుత్తమమైన వాటిని కూడా సంపాదించేవారు. 'రత్నహారీ చ పార్థివః' అనే దానికి వస్తురత్నాలను సంపాదించే వాడని కూడా అర్థం చెప్పవలసి ఉన్నది. ఈ వస్తు రత్నాలు ఉన్నప్పుడే ప్రభువుల ప్రభుత్వం పరిపూర్ణమయి ఉండేది.

ఆ రత్నాలు పద్నాలుగని యీ శ్లోకం చెప్తున్నది—


'గజవాజి రథ స్త్రీసు
    నిధి మాల్యాంబర ద్రుమాః
శక్తి పాశ మణి చ్ఛత్ర
    విమానాని చతుర్దశ.'

ఏనుగులు. గుర్రాలు, రథాలు, స్త్రీలు, నిధులు, మాల్యాలు, వస్త్రాలు, చందనము సంపద, శక్తి, పాశం, మణులు, ఛత్రాలు విమానాలు— వీటిలో ఉత్తమ మయినవి పద్నాలుగు రత్నాలని దీని అభిప్రాయం.

రాజ్య పరిరక్షణానికీ, రాజభోగాలకూ ఇవి అవసరమైనవే!

బుద్ధుని చరిత్ర గ్రంథాలలో అతి ప్రాచీనమైన లలిత విస్తరంలో మాత్రం ఏడు రత్నాలే చెప్పబడి ఉన్నవి. అవి — చక్రరత్నం, హస్తి (గజ) రత్నం, అశ్వరత్నం, స్త్రీ రత్నం, గృహరత్నం, పరిణాయకరత్నం అనేవి.

అభిప్రాయంలో భేదం ఉన్నా రాజులు తమ రాజ్యం స్థైర్యంగా ఉండటానికి ఈ రత్నాల్ని సంపాదించడం తమ ధర్మంగా భావించేవారు. ●



జరిగినకథ

లక్షాధికారి గారాల ముద్దుబిడ్డ శశిరేఖ. తండ్రి ఆదరంతో తనతోపాటే మెడిసిన్ చదువుతున్న ప్రసాదును ప్రేమిస్తుంది. యుద్ధరంగంలో సైనికుల చికిత్సకోసం ప్రసాదు వెళ్తాడు. విరహంతో తల్లడిల్లుతున్న శశిరేఖను స్నేహితురాలు వాణి అనునయిస్తుంది. వాణికి శశిరేఖ రహస్యమంతా తెలుసు. అందుకే ఆమెని నిగతాళి పట్టించింది. రేఖ గురించి ఆలోచించుకుంటూంటే ఆమె పెళ్లిచూపుల తతంగం జ్ఞాపకం వచ్చింది. తలుచుకుని బాధపడ్డాడు ప్రసాద్. రేఖతో తన పెళ్లి నిశ్చయమై పోయిందని తలచుకుని మురిసిపోయాడు. సూర్యం ప్రసాద్ తమ్ముడే. అతను జబ్బుతో తీసుకుంటూ ఆ హాస్పిటల్ లో జాయినయాడు. సూర్యం అన్నగారు దగ్గర లేకపోవడంతో ఎలా చెడిపోయిందీ తలచుకుని బాధపడ్డాడు. తండ్రి ప్రసాద్‌ని పోగొట్టుకున్నాక చాలా బాధపడ్డాడు. రమణయ్య గత స్మృతులు అతన్ని కలచి వేస్తున్నాయి. ప్రసాద్ ఆచూకీ ఇచ్చిన డాక్టరికి కృతజ్ఞతలు చెప్పుకున్నాడు రమణయ్య. ప్రసాద్ వస్తున్నాడని ఉత్తరంద్వారా తెలుసుకుని డా. విశ్వం సంతోషించాడు.

12

పర్సు నా జేబులో వేసుకొని అక్కడ గుమిగూడి ఉన్న నలుగురి సాయంతో ఆ యువకుడిని కారు దగ్గరకు తీసుకువచ్చి కారులో చేర్చాను. అంతలో ఆ రౌడీని వెదకడానికి వెళ్లిన మనుషులు తిరిగి వచ్చి వాడు దొరకలేదని' చెప్పారు. వారందరికీ కృతజ్ఞతలు చెప్పి కారును నర్సింగ్‌హోం వైపు మళ్లించాను. నర్సింగ్‌హోంలో అతని గాయాన్ని శుభ్రపరచి; కుట్లువేసి, కట్టు కట్టాను. అది స్పృహ తప్పవలసినంత గాయం కాదు. రక్తం ఎక్కువగా కారడం ...ఆ రౌడీ వెధవతో పోరాడడంతో అలసిపోయిన ఆ యువకుడు స్పృహ కోల్పోయాడు. జరిగిన దానికి పూర్తిగా అలసిపోయాను. వెంటనే యింటికి బయలుదేరాను. అమ్మాయి కూడా ఆందోళన పడింది. ఆకలిగా ఉండడం వల్ల యిద్దరమూ భోంచేసి పడుకున్నాము.

అర్ధరాత్రి ఫోను మోగడంతో మెలుకువ వచ్చింది. స్థిమితంగా కూర్చొని ఆ ఫోను అందుకున్నాను. విషయం తెలుసుకొని త్వరగా బట్టలు మార్చుకొని కారును షెడ్ నుండి తీసి నర్సింగ్‌హోంకు బయలుదేరాను.

నేను వెళ్లేసరికి ఆ యువకుడు బాధతో మెలికలు తిరిగి పోతున్నాడు...టెంపరేచరు కూడా ఎక్కువగా ఉంది...బ్లీడింగు వల్ల నే కట్టిన కట్టు తడిసి ఎర్రగా అయింది. బ్లీడింగు ఆపడానికి జ్వర తీవ్రత తగ్గడానికి, ఇంజక్షన్లు చేసి నుదుటిమీద ఐస్ ఫోమెంటేషను పెట్టించాను. నిద్రపోవడానికి మందు యిప్పించాను. అరగంటలో నిద్రపోయాడు.

'సిస్టర్...యిప్పట్లో నిద్రలేవడు. అవసరమనిపిస్తే మళ్లీ ఫోనుచెయ్యి ... నేను వెడుతున్నాను.'

'అలాగే డాక్టర్...!'

ఈ ఇంటికి వచ్చి పడుకొనేసరికి రాత్రి మూడయింది. మగత నిద్రతో తెల్లవారింది. కాలకృత్యాలు తీర్చుకొని హాస్పిటలకు వెళ్లాను. అతని పరిస్థితి కాస్త మెరుగుగా ఉంది. జ్వరం పూర్తిగా తగ్గలేదు. కాని తీవ్రత తగ్గింది. గాయం నుండి బ్లీడింగు ఆగిపోయింది. రాత్రి చూసినప్పటి మరక వెడల్పు కాలేదు.

ఆ యువకుడు వారంరోజులలో పూర్తిగా కోలుకున్నాడు. అమ్మాయి శశి ఆరోజు స్కూలు నుండి హాస్పిటలుకు వచ్చింది.

'నాన్నగారూ...అతని కెలా ఉంది?'

'కులాసాగానే ఉన్నాడు. చాలా నీరసంగా ఉన్నాడు. పని ఒత్తిడి వల్ల ఉదయం నుండీ వెళ్ళి చూడలేదు.'

ఇద్దరమూ అతని బెడ్ దగ్గరకు వెళ్లాము...చార్టు చూశాను...టెంపరేచరు నార్మల్‌గా ఉంది... నీరసం తప్ప అతనికి ఏబాధా లేదు. అతనికి ఎదురుగా ఉన్న కుర్చీలలో కూర్చున్నాము.

'నీ ఆరోగ్యం ఎలా ఉంది బాబూ...?'

'నీరసంగా ఉంది ... గాయం కొద్దిగా నొప్పి పెడుతూ ఉంది ... ఆకలి బాగానే ఔతూ ఉంది.'

'నీ పేరేమిటి...?'

'నన్ను ప్రసాదు అంటారు.'

'మీవాళ్ళకెవరికైనా కబురు చేయాలా? ఆ విషయం నాకింతవరకూ తట్టనే లేదు.'

'నాకెవరూ లేరండీ!'

'మరి...! నీవేం చేస్తుంటావు బాబూ...? నీవు ఈ సిటీ వాడివిలా కను

పించడం లేదు.'

'నేను 12వ క్లాసు డిస్టింక్షన్‌లో ప్యాసయ్యాను...మెడిసిన్ చదవాలని ఉంది... ఎవరిని కలవాలో...ఏం చేయాలో అర్థం కాక వారినీ, వీరినీ తెలుసుకుంటూ రెండు మూడు రోజులు తిరిగాను. కాలేజీకి వెళ్ళాను ... అవి యింకా తెరవలేదు. ఏమీ తోచక ఈ రోజు ట్యాంకు బండు వద్ద ఆలోచిస్తూ కూర్చున్నాను. మీరు వచ్చిన దగ్గర నుండీ మీ మీద దృష్టిని నిలపాడు ఆ రౌడీ. నేనప్పుడే అనుమానించాను వాడిని. అనుకున్నంతా అయింది.'

'ఇంత దెబ్బ ఎలా తగిలింది...? గాయం కత్తిపోటులా ఉంది ... ఆ రౌడీ కత్తితో పొడిచాడా ఏం...?'

'అవునండీ! వాడి కాళ్ళకు నా కాళ్ళు అడ్డవేసి కదలనివ్వకుండా పట్టుకొని వాడి చేతిని కొరికి ఆ పర్సు లాక్కున్నాను. మళ్ళీ పర్సును నా చేతిలో నుండి పుంజుకోవాలని విశ్వప్రయత్నం చేశాడు ... ఇక లాభం లేదని గ్రహించి పర్సును కుడి చేతితో పట్టుకొని బోర్లా పడుకున్నాను ... వెంటాడుతూన్న మనుషుల అలజడి విని అక్కసు కొద్దీ బలంగా కత్తితో పొడిచి పారిపోయాడు. కొద్ది సేపటికి మీరు వచ్చారు. మీ పర్సును మీకు అందించాను. ఆ తర్వాత ఏం జరిగిందో నాకు తెలియదు.'


మెల్లిగా...వినయవిధేయతలు ఉట్టిపడేలా చెప్పాడు ప్రసాదు. నాకు ఆశ్చర్యం కలిగింది... ప్రసాదు ఎంత ధైర్యం చేశాడు.

'అందులో ఉండవలసిన పైకం జాగ్రత్తగా ఉందాండీ...?' ఒక్క నిముషం ఆగి [illegible] అడిగాడు.

'జాగ్రత్తగానే ఉంది...కానీ నీ పరిస్థితి నాకు ఎంతో బాధను కలిగించింది.'

'ఇంకా ఎంతకాలం యిక్కడ ఉండాలి డాక్టర్...? నేను మెడికల్ కాలేజీలో చేరాలి... ట్యూషన్లు కుదుర్చుకోవాలి... చనిపోయిన నా తల్లిగారి ఆశయాన్ని నెరవేర్చాలి. వీధిలైటు క్రింద కూర్చొనియైనా కన్నతల్లి కోరిక నెరవేరుస్తాను... ఆమె ఏ లోకాలలో ఉన్నా నా సఫలతకు సంతోషిస్తూ నన్ను ఆశీర్వదిస్తుంది...'

ఆ యువకుని దృఢ విశ్వాసం నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది. ఏ ఆసరా లేకుండా మెడిసిన్ చదవాలని సిటీకి వచ్చిన అతని ధైర్యసాహసాలను మనసులో అభినందించకుండా ఉండలేకపోయాము.



'నీ ఆశయం తప్పకుండా నెరవేరు
తుంది...భారమంతా నా పైవేసి నీవు
విశ్రాంతిగా ఉండు......నీవు సాహసించేసి
రెండువేల రూపాయలు కాపాడావు...చాలా
కృతజ్ఞతలు.'

'అదేం మాటలండీ...? మీరు పెద్ద
వారు...నాకు మీరు కృతజ్ఞతలు చెప్పాలా..?
అన్యాయం జరుగుతూ ఉంటే చూస్తూ
ఊరుకోలేకపోయాను... నా విద్యుక్త ధర్మం
నిర్వర్తించాను. గొప్పగా నేను మీకు చేసిం
దేమీలేదు.' అని మళ్లీ 'డాక్టరు విశ్వం
గారు ఎవరో మీకు తెలుసా? వారు చాలా
మంది పేద విద్యార్థులకు సాయం చేస్తారని
విన్నాను......వారిని ఒకసారి చూడాలని
ఉంది...'

'అలాగే బాబూ...! నీకు పూర్తిగా
నయమయ్యాక నేనే వారియింటికి తీసుకు
వెడతాను...బాగా విశ్రాంతి తీసుకో.'

ముసి, ముసిగా నవ్వుతూ రేఖవైపు
చూశాను ఆమె చిరునవ్వు చిందిస్తూ
ప్రసాద్ ముఖంలోకి తదేకంగా చూస్తూ
'నాన్నగారి మాటలపై విశ్వాసముంచి
నిశ్చింతగా ... నిర్భయంగా ఉండి విశ్రాంతి
తీసుకోండి అన్నీ సవ్యంగా జరిగిపోతాయి.'

'అలాగేనండీ...! మీ పేరు...?'

'శశిరేఖ...'

'సంతోషం...! ఈ నిరుపేదనుమాత్రం
మరిచిపోకండి.'

'ఎంతమాట...? ఎలా మరుస్తాం...?'

'ధన్యుణ్ణి...'

'మేం వస్తాం బాబూ...మరొక వారం
రోజులలో పూర్తిగా కోలుకుంటావు
ధైర్యంగా ఉండు.'

ఆ యువకునికి ధైర్యంచెప్పి నేను శశి
నా రూముకు వచ్చాము. శశి యింటికి వెళ్లి
పోయింది. నేను అక్కడ గుమికూడిఉన్న
పేషెంట్లను పరీక్ష చేయడంలో నిమగ్నుడ
నయ్యాను. పది రోజులు గడిచిపోయాయి.
ప్రసాదు పూర్తిగా కోలుకున్నాడు అతని
గాయానికి వేసిన కుట్లు విప్పికూడా
రెండు మూడు రోజులైంది.

ఒకరోజు ఆ యువకుని వద్దకు వెళ్లి
ప్రశ్నించాను 'ప్రసాద్ ! ఈ రోజు
డా. విశ్వంగారి యింటికి వెడదామా?'

'అలాగే...నాకిప్పుడు ఎంతో ఆరోగ్యంగా
ఉంది; మీ దయవల్ల.'

గూడుచేరిన పక్షులు

'అదేమిటి బాబూ? ఇందులో నాదయే
ముంది? మా కోసం ప్రాణాలను సైతం
లెక్కచేయక ఆ రౌడీతో పోరాడావ్ ! వాడు
నీచేతిమీద కాకుండా మరెక్కడైనా పొడిచి
ఉన్నట్లయితే...?'

'ఊరికే నన్ను ఆ విషయంలో పొగడ
కండి...అందులో ప్రత్యేకంగా నే చేసిందేమీ
లేదు. ఆ పరిస్థితిలో ఎవరైనా అదే
చేస్తారు. దొంగను తరమాలని ఎవరికి
మాత్రం ఉండదు...?'

'ఈ మాటలు నీ మంచితనాన్ని ఋజువు
చేస్తున్నాయి. సరే...! ఇక వెడదాం పద.'

'అలాగేనండీ...!'

ఇద్దరమూ యిల్లు చేరాము. ప్రసాదును
నేను క్రింద హాలులో కూర్చుండబెట్టి
పైకి వెళ్లాను. అమ్మాయికూడా అక్కడే
ఉంది. సీతమ్మ అమ్మాయికి ఏదో నీతికథ
చెబుతూ ఉంది. నేను రావడం చూసి
ఆమె నిలబడింది.

'స్నానానికి నీళ్లు తోడుతాను...త్వరగా
గుడ్డలు మార్చుకొని స్నానానికిరండి బాబు
గారూ...'

'స్నానం తర్వాత చేస్తాను సీతమ్మా...
ముందు హాలులో కూర్చున్న అబ్బాయిని
పైకి తీసుకురా...'

'అలాగే బాబూ !'

సీతమ్మ వెళ్లిపోగానే కుర్చీలో కూర్చుని
బూట్లువిప్ప సాగాను. రేఖ మంచంమీద
కూర్చుని ఏదో చదువుకుంటూ ఉంది.

ప్రసాద్ నా గదిలోపలికి వచ్చాడు సీతమ్మ
దారిచూపిస్తూ ముందుగా లోపలికి వచ్చింది
ప్రసాదును చూడగానే ఎదురుగా ఉన్న
కుర్చీ చూపిస్తూ కూర్చోమని సంజ్ఞ
చేశాను సీతమ్మతో 'మొన్న పర్సు కాపాడా
డని చెప్పిన కుర్రవాడు ఈ అబ్బాయే!'

'అలాగా బాబుగారూ...?' అని ప్రసాదు
వైపుచూసి 'ఎంత ధైర్యంచేశావు బాబూ?
ప్రమాదం జరిగి ఉంటే...?'

'ప్రమాదం జరుగుతుందని భయపడి...
అక్రమాన్ని ఎదుర్కోకుండా ఎలా ఉండగల
మండీ...?'

'కూర్చో నాయనా...! నిలబడే
మాట్లాడుతున్నావేం' అన్నాను నేను.

'ఫర్వాలేదండీ... మీరు పెద్దవారు...
మీతో సమానంగా కుర్చీలో కూర్చో...'

'కూర్చోవయ్యా బాబూ ... ఫర్వాలేదు'
అని సీతమ్మ అతని కుర్చీలో కూర్చుండ
బెట్టింది; బలవంతంగా.

'డాక్టరు బాబుగారూ...మీరు నన్ను
డా. విశ్వంగారి యింటికి తీసుకువెడతానని
తీసుకువచ్చారు...?' నసుగుతూ బెరుకుగా
అన్నాడు ప్రసాదు.

'ఏమిటీ...? ఇది విశ్వంగారి యిల్లే
నాయనా...! వారే విశ్వంగారు.' అంది
సీతమ్మ. ప్రసాదు ఆశ్చర్యపోయాడు...
మొహమాట పడ్డాడు. లేచివచ్చి నాపాదాలకు
నమస్కారం చేశాడు... రేఖ... నేను ముసి
ముసిగా నవ్వుకున్నాము.

అతనిని లేవదీస్తూ 'ఆ విశ్వాన్ని నేనే
బాబూ ! నీ చదువుకు తప్పకుండా సాయం
చేస్తాను. నీవు నా యింట్లోనే ఉండి
చదువుకో. నీకే అవసరంకలిగినా సీతమ్మను
అడుగు. మా అమ్మాయి శశికూడా నీకు
కావలసిన సాయం చేస్తుంది ... ఏమాత్రం
బిడియపడకు,' అన్నాను.

'అంతటి అదృష్టమా బాబుగారూ...?
ఇంత గౌరవానికి నేను తగనేమో ? మీరు
సహాయంమాత్రం చేయండి ... హాస్టలు
లోనో... వేరే ఎక్కడైనా రూములోనో
ఉండి చదువుకుంటాను ... అప్పుడప్పుడు
మిమ్ములను కలుసుకుంటూ మీ ఆశీస్సులను
పొందుతూ ఉంటాను.'

'హాస్టలు... రూము ... ఎందుకోయ్ !
ఇంతయిల్లు ఉండగా ఎక్కడో అవస్థ
పడతానంటావేం ? ఇక్కడ ఉండడం
యిష్టం లేకపోతే మాత్రం చెప్పు. వేరే
ఎక్కడైనా ఏర్పాటు చేయిస్తాను.'

'ఎంతమాట...? ఇష్టంలేకపోవడమా?
నేను యిక్కడ ఉండడంవల్ల మీకు
ఏమైనా యిబ్బంది కలుగుతుందో ఏమో
నని...' గోళ్లు గిల్లుకుంటూ... సిగ్గు
పడుతూ మాటలు పూర్తి చేయలేక
పోయాడు.

'లేదు బాబూ...! సంతోషం కలుగు
తుంది. మరింకేమీ మాట్లాడకు' అని
సీతమ్మ నుద్దేశించి 'ఒకగదిలో శుభ్రంచేసి
అతనికి అన్ని ఏర్పాట్లూ చూడు.' అని
వారిద్దరినీ అక్కడినుండి పంపించివేశాను.

'బుద్ధిమంతుడు...చదివిస్తే మణి
పూసలా తయారౌతాడు ... ఆ నమ్మకం

కాకుంది... ఏమంటావమ్మా...?'

'అవును నాన్నారూ... ఎక్కడో పల్లెటూర్లో ఉంటూ అంత గొప్పగా పాసయ్యాడంటే అతనికి చదువుమీదగల శ్రద్ధను ఒప్పుకు తీరాల్సిందే!'

అమ్మాయిని ఆప్యాయంగా చూస్తూ 'పదమ్మా! వెళ్లి బాతురూంలో నీళ్లు పెట్టి మనముగ్గురికీ వడ్డించమని చెప్పు సీతమ్మకు. ఐదునిముషాలలో స్నానంచేసి వచ్చేస్తాను.' అన్నాను.

'అలాగే నాన్నారూ...!' అని అమ్మాయి మేడదిగి క్రిందికి వెళ్లిపోయింది.

ఒక ఆదివారంరోజు సాయంత్రం నాలుగుగంటలకు నా గదిలో విశ్రాంతి తీసుకుంటూ ఏదో మెడికలు మాగజిన్ తిరగవేయసాగాను. నా గది ప్రక్కగది అమ్మాయి-శశిది. ఆమెగదిలో ఏవోమాటలు వినిపించడంతో నా ధ్యాస అటు మళ్లించాను.

'నన్ను పిలిచారా అమ్మాయిగారూ...?' ప్రసాదుగొంతు.

'అవును ప్రసాద్! మొన్నచేసిన ప్రాక్టికల్సులో ఒకసందేహం కలిగింది. తెలుసుకుందామని ..?'

'అలాగే! మీ ప్రాక్టికల్సు పుస్తకం తీయండి. నాకు సాధ్యమైనదైతే చెబుతాను.'

'ఇదిగో యిక్కడ...'

ప్రసాద్ అమ్మాయికి వివరించి చెప్పడం విన్నాను...ఎంత చక్కగా చెప్పాడు...ఏదైనా ఒకవిషయం విడమర్చి చెప్పడంలో అతనికి అతనేసాటి ... ఈ విషయంలోగా కూడా గమనించాను. అమ్మాయి కూడా ఒకటి రెండుసార్లు ప్రస్తావించింది.

'అమ్మాయిగారూ ... నేను వచ్చేసరికి మీరు ఏదో నవల చదువుతూ ఉన్నట్లున్నారు...? తెలుగా...? ఇంగ్లీషా...? చూడనివ్వండి.'

'అదా... ప్రసాద్...ఏదో కాలక్షేపానికి చదువుతున్నానులే' అమ్మాయి తడబడుతూ అంది.

'ప్రణయంలో ప్రమాదం' దయచేసి పొరపాటునగూడా మీరు అటువంటి నవలలు చదవకూడదు. మనసును, శరీరాన్ని పాడు చేస్తాయి. ఇప్పటి ఈ వయసు కెమెరా లెన్సు లాంటిది, ఎదురుగా ... ఆకర్షణీ

గూడుచేరిన పక్షులు

యంగా కనపడే విషయాలను హృదయానికి గాఢంగా హత్తుకునేలా చేస్తుంది. ప్రతి వ్యక్తి ఈ వయసులోనే ఎంతో జాగ్రత్త పడాలి...ముఖ్యంగా మంచికంటే చెడునే ఎక్కువగా ఆకర్షిస్తూ ఉంటాము. తమాషా ఏమిటంటే...? ఆ చెడును చెడుగా తెలుసుకోలేము. ఇటువంటి పుస్తకాలను ప్రభుత్వం నిషేధించి నప్పటికీ అవి మార్కెటుకు ఎలావస్తాయో నాకు తెలియడంలేదు... వ్రాసేవారైనా కేవలం ధనాభావం తప్ప మంచి... చెడును ఆలోచించరు.'

'ప్రసాద్...! నాపై కోపం వచ్చిందా?'

'అబ్బే! లేదండీ. మీపై కోపమా?... ఈ కోపం...ఆవేశం మీపై కాదు. రోజు రోజుకూ నైతికంగా పతనమౌతూన్న సమాజంపైన ... యువతరంపైన...వాళ్ల దోషం మాత్రం ఎంతవరకు? అదే అర్థం కావడం లేదు. బాధ్యులు వారి తల్లిదండ్రులా...? అధ్యాపకులా...? ప్రభుత్వమా? అందరూనా...?'

'నీకిష్టంలేకపోతే చదవను...సరేనా...?'

'నామాట మన్నించినందుకు ధన్యుణ్ణి ...అనవసరంగా లేనిపోని సోదిపెట్టి మీ సమయం పాడుచేశాను...నన్ను మన్నించండి.'

'అబ్బే...! అంత మాటెందుకు ప్రసాద్? నిజమెప్పుడూ నిష్ఠూరంగానే ఉంటూంది. నేనుకూడా ఎప్పుడూ చదవను...యిక అసలే మానేస్తాను...ఏమిటో ఆ వెధవ పుస్తకాలమీద ఆకర్షణ అలా ఉంటుంది...'

'అలాగే! నేను వెడతాను ... పరీక్షలు దగ్గరకు వస్తున్నాయి. జాగ్రత్తగా చదివి. మీ క్లాసులో మీరే ప్రథములుగా పాసవ్వాలి.'

'అలాగే!'

ప్రసాద్ వెళ్లిపోతూన్న చప్పుడు వినిపించింది. అతని సంస్కార హృదయాన్ని నా మనసులో అభినందించాను. అందరూ ఇలా ఉంటే సమాజమెంత బాగుపడుతుందో? నాలుగు సంవత్సరాలుగా గమనిస్తున్నాను. ఒకనాడైనా ప్రసాద్ అబద్ధం చెప్పడంగాని, చెడుమాటలు మాట్లాడడంగాని, ఒకరి మనసు నొప్పించడంగాని చూడలేదు. అమ్మాయిని ఎంత సున్నితంగా మందలించాడు...? చదువు సంధ్యలలో ఆటపాటలలో అగ్రగణ్యుడుగా పేరుసంపాదించుకుంటున్నాడు. అమ్మాయి నాగదిలోపలికి వచ్చింది.

'ఏమ్మా...మీ సంభాషణంతా నేను విన్నాను. ప్రసాద్ మాటలు నిన్ను నొప్పించాయా?'

'లేదు నాన్నారూ...కళ్లు తెరిపించాయి. ఎంత మృదువుగా నచ్చజెప్పాడు...? కాలేజీలో కూడా యింతే. తన మాటలతో ఎంతటి కఠిన హృదయం గలవాడినైనా యిట్టే మార్చేస్తాడు... అంతా అతనిని ఎంతగానో గౌరవిస్తారు... యిక అమ్మాయిల సంగతి చెప్పనే అక్కరలేదు. కాలేజీలో నేను, ప్రసాద్ ఎప్పుడైనా మాట్లాడుతూ ఉంటే ఈర్ష్యపడుతూ గుడ్లగూబలలాంటి కళ్లతో చూస్తూ...అమ్మాయిలంతా నాకు

మాతృప్రణామము

ఆవలింత తీయునపుడు
ఆకలి వేసినపుడు
అలిగా అలిసినపుడు
అనురాగం పెల్లుబికినపుడు
అమ్మా పెట్టెదమమ్మా ప్రణామము

అతిగా ప్రేమించావు
అంతా ధారపోసావు
అన్నీ యూహించావు
అయినది గాంచకనే
అసువులనే బాసావు
అమ్మా పెట్టెదమమ్మా ప్రణామము

అరుణోదయ వేళ తలచిన
అన్నీ సమకూరును
ఆకట్టును మదిలో
ఆ లక్ష్మి కళలా
అందరికీ రావాలనిపించును
ఆ ముత్తైదువ మరణము
అమ్మా పెట్టెదమమ్మా ప్రణామము

అమ్మా నీ జ్యోతి
ఆరకుండ వెలుగుచున్నది
అందరి హృదయాంలో
ఆశలుపడని మాపై
అడపా దడపా రావమ్మా
ఆ నీడవలె నీవు
అమ్మా పెట్టెదమమ్మా ప్రణామము

—సుజాత

వింతగా కనుపిస్తారు.'

'అంత ఈర్ష్య వాళ్ళకెందుకమ్మా?'

'ఏమో నాన్నారూ...?'

'అందరితో చనువుగా మాట్లాడడా?'

'ఎందుకు మాట్లాడడు? మాట్లాడు తాడు. ఎవరికివారే అతనిని స్వంతం చేసుకోవాలని తాపత్రయ పడతారు... ఎవరికీ అందడు.'

'ఏమో నమ్మా...? అతనెవరో...? కులగోత్రాలు ... పుట్టుపూర్వోత్తరాలు... ఆస్తిపాస్తులు...ఎప్పుడూ అడగలేదు... అతను చెప్పలేదు. మొత్తానికి మణిపూస లాంటివాడు.'

'ఒకటి రెండుసార్లు నేనూ ప్రయత్నించాను...లాభం లేకపోయింది ఆ విషయం ఎత్తినప్పుడల్లా ఎంతగానో బాధ పడిపోయాడు...మాట తప్పించే ప్రయత్నం చేశాను. మళ్ళీ ఆ ఊసు ఎత్తలేదు నేను.'

'మంచిదమ్మా ... వెళ్ళి జాగ్రత్తగా చదువుకో ... పరీక్షలు దగ్గర పడు తున్నాయి.'

అమ్మాయి వెళ్ళిపోయింది. ప్రసాదు ఈ సంవత్సరం ఫోర్తుఇయర్ పూర్తి చేస్తాడు. ఎం. బి. బి. ఎస్. తర్వాత ఎమ్మెస్, చేయించాలని ఉంది. అతని ఉద్దేశ్యమేమిటో? ఎమ్మెస్ పూర్తి చేశాక నర్సింగ్ హోం బాధ్యత అతనిపై, అమ్మాయిపై ఉంచుతాను. ప్రసాదు చాలా బుద్ధిమంతుడు. అయినా అమ్మాయికి తగినవాడేనా...? ఆ విషయం అంత త్వరగా నిర్ణయించేటువంటిదికాదు అమ్మాయిని వేరే ఎవరికైనా యిచ్చి వివాహం జరిపిస్తే ఆ వచ్చే అల్లుడితో నర్సింగ్ హోం బాధ్యత ముగ్గురికి చెందు తుంది. నేను త్వరపడి ప్రయోజనంలేదు. కాలమే సమస్యలను పరిష్కరిస్తుంది... ఒకనాడు శశిని పెంచడం ఒక పెద్ద సమస్యగా ఉండేది. సీతమ్మ పుణ్యమా అని ఆ సమస్య తీరిపోయింది... ప్రస్తుతం అమ్మాయి వివాహ సమస్య నన్ను ఎదు ర్కొంటూ ఉంది. అది కూడా పరిష్కార మైతే నేనిక విశ్రాంతిగా నాశేష జీవితాన్ని గడపవచ్చు ... రేణూ! యిప్పుడు నీవు ఉన్నట్లయితే ఎంతగా సంతోషించే దానవో...? నీవు ఆ అదృష్టానికి నోచుకో లేదు. నీవు ఏలోకాలలో ఉన్నా అమ్మాయిని మాత్రం దీవిస్తూ ఉండు. అంతకన్న నిన్ను ఏమీ కోరను.

రోజులు ప్రశాంతంగ దొర్లిపోయాయి. అమ్మాయి శశి తన హౌస్‌సర్జన్‌షిప్‌ను ఈ సంవత్సరం పూర్తిచేస్తుంది. ఆ తర్వాత అమ్మాయి వివాహం జరిపిస్తాను, రేఖా ప్రసాద్‌లు సన్నిహితులౌతూ ఉన్నట్లు తోస్తూ ఉంది నాకు... ప్రసాద్ ఎవరో...? కులగోత్రాలేమిటో తెలియదు. చూస్తూ, చూస్తూ, వెనుక ముందులు ఎవ్వరూ లేనివాడికి పిల్లనివ్వాలంటే నా మనసొప్పడంలేదు పిల్లవాడొక కుటుం బీకుడై తల్లితండ్రి అప్పచెల్లెళ్ళు ఉన్నవాడైతే బాగుంటుంది. అమ్మాయిని ప్రసాద్‌కిచ్చి వివాహం జరిపిస్తే యిక యిద్దరూ మా యింట్లోనే ఉంటారు, రాకపోకలు ముచ్చు ముచ్చటలు ఏమీ నెరవేరవు.

'బాబుగారూ ... మీకోసం ఎవరో వచ్చారు ... హాలులో కూర్చోబెట్టాను... వారిని పైకి తీసుకురమ్మంటారా...మీరు క్రిందికి వెళ్ళి మాట్లాడుతారా?'

'బహుశా రాఘవయ్యగారే అయి ఉంటారు... నేనే వెళ్ళి మాట్లాడుతాను. నీవు త్వరగా రెండుకప్పుల కాఫీ తయారు చేసి తీసుకురా...'

ఆ వచ్చినది రాఘవయ్యగారని మాచాయగా గ్రహించాను. ఈ రోజు వస్తానని చెప్పారు. నేను యిప్పుడు ఆలోచిస్తున్న విషయాన్నే వారికి వారం రోజుల క్రితం చెప్పాను. బహుశా అమ్మాయికి ఏదైనా సంబంధంచూసి ఉండ వచ్చు. ఆలోచనలతో క్రిందకు దిగాను. నేను అనుకున్నట్లుగానే రాఘవయ్యగారు సోఫాలో కూర్చుని నాకోసం ఎదురు చూస్తున్నారు.

'నమస్కారమండీ రాఘవయ్యగారూ... కులాసాయేనా! మీ కంట్రాక్టులు బాగా సాగుతూ ఉన్నాయా...?'

నాకు ప్రతి నమస్కారంచేస్తూ 'బాగానే సాగుతున్నాయండీ! మొన్న మీరు ఒక విషయం నా చెవిన వేశారు...?'


'ఆఁ... అవును, మా అమ్మాయికి మంచి సంబంధమేదైనా ఉందేమో చూడమన్నాను...ఎక్కడైనా చూశారా...?'

'చూశాను ... మీరు కోరిన అన్ని లక్షణాలూ అతనిలో ఉన్నాయి. ఆ మాట మీ చెవిన వేద్దామని యిలా వచ్చాను'

'చాలా థ్యాంక్సండీ! ఓపికతో పని కట్టుకొని శ్రమ తీసుకున్నారు'

అంతలో సీతమ్మ కాఫీ కప్పులు తీసుకు వచ్చింది. మేమిద్దరమూ కాఫీ త్రాగాము.

'అలాగంటారేమిటండీ?' మీరు మా ఫ్యామిలీ డాక్టరు ... మా కుటుంబానికి ఎంతో సేవచేస్తున్నారు ... ఇంత చిన్నపని



గూడుచేరిన పక్షులు

మీరు పురమాయిస్తే, చేయడానికి వెనుక ముందాడుతావా?'

నాపై నా పేషంట్లకుగల అభిమానానికి పొంగిపోయాను—

'ఇంతకూ కుర్రవాడు ఏం చేస్తున్నాడు...? ఏం చదువుకున్నాడు...? వారి కుటుంబ విషయాలు విడమర్చి చెబితే తర్వాత విషయాలు మాట్లాడుకోవచ్చు.'

'కుర్రవాడుకూడా డాక్టరే! ఎమ్. డి. ఈ సంవత్సరంతో పూర్తవుతుంది. ఆ అబ్బాయి తలిదండ్రులు వచ్చే సంవత్సరం వివాహం చేయాలనుకుంటున్నారు. మీరు కూడా వచ్చే సంవత్సరమే అమ్మాయి వివాహం జరిపించ తలచుకున్నట్లు చెప్పారు. పిల్లవాడి పేరు సుధాకర్. తలిదండ్రులు అప్పచెల్లెండ్రు ఉన్నారు. బాగా కలిగిన కుటుంబమే! కొడుకు ఒక్కడే! మీకు అందుబాటులోగల ఆర్థిక స్తోమతు ... మీరు బాగానే సంపాదించారు...పైగా మీకు ఒక్కగానొక్క కుమార్తె. ఈ సంబంధం తప్పకుండా కుదురుతుందని నేను ఆశిస్తున్నాను. ఈలోగా నేనుకూడా వేరే యితర సంబంధాలు యింతకన్న మంచివి తగులుతాయేమో చూస్తుంటాను. నా ఉద్దేశంలో యిది చాలా మంచి సంబంధం ... అయినా యింతకన్న మంచిసంబంధం గురించి తెలిసినప్పుడు మళ్ళీ కలుస్తాను. మీరు ఈవేళప్పుడు యింట్లో ఉంటారని అనుకోలేదు నేను. హాస్పిటలులో ఉంటారనుకున్నాను...అప్పను.. ఈవేళప్పుడు యింట్లో ఉన్నారేమిటి?'

'ఇది నేను హాస్పిటలులో ఉండే సమయమే! కాని డాక్టర్ ప్రసాద్ ఎం.ఎస్. పూర్తి చేశాడు. అతనే యిప్పుడు ఆస్పత్రి బాధ్యత వహిస్తున్నాడు... నాకు యిప్పుడు కాస్త వెసులుబాటుగా ఉంటూ ఉంది. తప్పనిసరి అవసర మనుకుంటే తప్ప నేను వెళ్లడం లేదు...ఎప్పుడైనా వెళ్ళాలనుకున్నప్పుడు మాత్రం వెడుతున్నాను.'

'అలాగా...! ప్రసాద్ అనేపేరు ఒకటి రెండుసార్లు విన్నాను. అతను ఎవరండీ? మీ బంధువా?'

'కాదు. నా సహాయంతో చదువుకున్న వారిలో అతను ఒకడు... సమర్థుడు... తెలివైనవాడు...చురుకైనవాడు. నాదగ్గరే ఉంటూ నర్సింగ్‌హోం బాధ్యత చూస్తున్నాడు.'

'చాలా సంతోషం...! కాని ఒక చిన్న అనుమానం. మీ నర్సింగ్‌హోం ఎంతో పేరు ప్రతిష్ఠలను సంపాదించుకుంది. అందుకు కారణం మీరు...అటువంటిది అంత గురుతర బాధ్యతను మీరు అతనిపై ఉంచారు. అందుకు అతను సమర్థుడా...? మీరు సమర్థుడన్నారు కాబట్టి తెలివైన డాక్టరే నని ఒప్పుకుంటున్నాను. కాని మీదయా గుణం... రోగులయెడ మీకుండే ఆదరాభిమానాలు .. పేదలయెడ మీరుచూపే ప్రత్యేక శ్రద్ధ యివన్నీ మీ వృత్తికి చాలా ముఖ్యం గదండీ! చూస్తే కుర్రవాడు...వ్యవహారం బాధ్యతగలది...? అయినా నా పిచ్చిగాని ఈ విషయాలన్నీ మీరు ఆలోచించకుండా అంత పెద్ద బాధ్యతను మీరు అప్పగిస్తారా? పెడతారా?'

'మీరు చెప్పినవన్నీ ఆలోచించవలసిన విషయాలే! ఆలోచించానుకూడా! మీరు చెప్పినవి గుణగణాలన్నింటిలోనూ అతను నన్ను మించినవాడు...ఏమాత్రం సందేహ మక్కరలేదు.'

'అలాగా...! చాలా సంతోషమండీ! ఇప్పటి యువకులలో అటువంటివారుండడం అరుదు. అందుకే అలా అనవలసి వచ్చింది. ఒకసారి అతని పరిచయం చేసుకోవాలి. ఏం చేస్తాం...? ఎంత ధనికులకైనా, ఎంత గొప్పవారికైనా రోగాలు తప్పవుగదండీ! అటువంటప్పుడు డాక్టర్లను ఆశ్రయించవలసిందే! ... తప్పదు'

'భలే ఛలోక్తి విసిరారే...?' నవ్వుతూ అన్నాను.

'నేనిక శలవు తీసుకుంటాను. మళ్ళీ అవకాశం చూసుకొని ఎప్పుడైనా కలుస్తాను. నమస్తే'.

'మంచిదండి...నమస్తే! ఎంతో శ్రమ చేశారు.'

'అబ్బే ..! మీరు ఊరికే అలా అనకండి! అదేమీ లేదు' అని వెళ్ళిపోయారు.

(ఇంకా ఉంది)

వారఫలం

3 3 1972 శుక్రవారం మొదలు

9 . 3 . 1972 గురువారం వరకు

మేషం : ప్రయత్నించిన ప్రతిపని సులువుగా నెరవేరగలదు. నూతన వ్యవహారాలు లాభించగలవు. వారం మధ్యలో అనవసరమైన శ్రమ కలుగుతుంది. విద్యావైజ్ఞానికరంగాల్లో మీ కృషికి ఆటంకాలు వస్తాయి. ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగా ఉండదు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

వృషభం : వ్యాపారంలో పోటీవారి పోటీ పెరుగుతుంది. ఇతరుల నిమిత్తం మీరు శ్రమపడకు గుర్తి కాగలరు. సమయానికి యేదో ఒకవిధంగా డబ్బు చేతికి రాగలదు. ప్రయాణాలోచనలు చేస్తారు. సాంఘిక కార్యక్రమాలు అనుకూలంగా ఉంటాయి.

స్త్రీలకు:— కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. దైవకార్యాలు నెరవేరతాయి.

మిథునం వృత్తి వ్యాపారాల్లో మీ కార్యక్రమాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. రాజకీయ వ్యవహారాల్లో చికాకులు యేర్పడతాయి. అనవసరమైన సందేహాలు కలుగుతాయి. పోటీవారితో వాదప్రతివాదాలు తగవు.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగుంటుంది ఆడుబువం కోసం వ్యయం చేస్తారు.

కర్కాటకం: సామాన్యమైన పనులకు కూడా మీరు యెంతో కృషి చేయవలసి వస్తుంది. పోటీవారిలో గౌరవం బాగా ఉంటుంది. వారం మధ్యలో వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు బాగుంటాయి. మిత్రుల సహాయం లభిస్తుంది.

స్త్రీలకు:— పుణ్యకార్యాలు చేస్తారు. విలాస వస్తువులు కొంటారు.

సింహం: వ్యాపారంలో అనుకూల వార్తలను వింటారు. రాజకీయ వ్యవహారాలు బాగుంటాయి. సజ్జన సాంగత్యం లభిస్తుంది ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. స్థిరాస్తి వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. ఉద్యోగంలో గౌరవం బాగుంటుంది.

స్త్రీలకు.— ఆరోగ్యం బాగుంటుంది, బంధుమిత్రులను కలుసు కొంటారు,

కన్య : అన్ని వ్యవహారాల్లోను మీ శ్రమకు తగిన ఫలితం లభించ గలదు. ప్రయోజనంగల పరిచయాలు యేర్పడతాయి అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు బాగుంటాయి. మిత్రులకు సహాయం చేస్తారు. కోర్టు వ్యవహారాల్లో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి.

స్త్రీలకు:— కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. సంతోషకరమైన వార్తలను వింటారు.

తుల: వృత్తిలో ఆదాయం బాగుంటుంది. నూతన వ్యవహారాలు లాభిస్తాయి. సాంఘిక కార్యక్రమాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. రావలసిన డబ్బు సమయానికి అందగలదు. విద్యావైజ్ఞానిక రంగాల్లో మీ కృషి ప్రోత్సాహకరంగా ఉంటుంది.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగుంటుంది. శుభకార్యాల విషయంలో అనుకూలత లభిస్తుంది.

వృశ్చికం: కొన్ని వ్యవహారాల్లో శ్రమపడినా ప్రయోజనం ఉండదు. ప్రయాణాలు వాయిదా పడతాయి. అధిక వ్యయం జరుగు తుంది. వారం మధ్యలో అన్ని వ్యవహారాలు బాగుంటాయి. వ్యాపారంలో నూతనావకాశాలు లభిస్తాయి. పోటీవారిలో గౌరవం బాగుంటుంది.

స్త్రీలకు:— కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగు తుంది. వినోదకాలక్షేపాల్లో పాల్గొంటారు.

ధనుస్సు: వ్యాపారంలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు బాగుంటాయి. వారం మధ్యలో మీ తాలూకు వస్తువులు పోవచ్చును. ఉద్యోగంలో యెవరినీ విశేషంగా నమ్మడం తగదు. వృత్తిలో శ్రమ కలుగుతుంది.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగా ఉండదు. సంతానానికి సౌఖ్యసంతోషాలు లభిస్తాయి.

మకరం : వృత్తిలో ప్రయోజనం గల సంభాషణలను జరుపగలరు. ప్రయాణాలు ఫలిస్తాయి. స్థిరాస్తి వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. రావలసిన డబ్బు సమయానికి అందు తుంది. విద్యావైజ్ఞానికరంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

స్త్రీలకు:— పుణ్యకార్యాలు చేస్తారు. అలంకార వస్తువులు కొంటారు.


కుంభం : అన్ని వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. మిత్రులకు సహాయం చేస్తారు. ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. మీ కంటే పెద్దవారు కూడా మీ సహకారాన్ని కోరవలసి వస్తుంది. ప్రయోజనంగల పరిచయాలు యేర్పడతాయి. ప్రయాణాలోచనలు చేస్తారు.

స్త్రీలకు:— వినోదకాలక్షేపాల్లో పాల్గొంటారు. సంతోషకరమైన వార్తలను వింటారు.

మీనం లాభం రావలసిన వ్యవహారాల్లోనే నష్టం రావచ్చును. ప్రయాణాల్లో శ్రమ కలుగుతుంది. ఆందోళనకు గురి కాగలరు. వారం మధ్యలో వృత్తి వ్యాపారాలు బాగుంటాయి. సమయానికి యేదో ఒక విధంగా డబ్బు చేతికి వస్తుంది. నూతన విషయాలను తెల్సు కొంటారు.

స్త్రీలకు:— కుటుంబ వ్యవహారాల్లో శ్రమ కలుగు తుంది. విలాస వస్తువులు కొంటారు.

—మహేష్





'వెనకటికి ఒక ఆఫీసులో జరిగి నట్టు...' అంటూ ఆగింది రోజా రాణి అంటే ఆమె ఏదో చెప్పబోయి ప్రేక్షక వెలుల రియాక్షన్ చూడడానికి ఆగిందని అర్థం.

'వెనకటి గొడవలెందుగ్గాని మన ఆఫీసులో ఇప్పటి కబుర్లేమయినావుంటే చెప్పు. లేకపోతే మానెయ్.' అంటూ చిరచిర లాడింది శాంత.

అంటే రోజారాణి చెప్పేది వినటం శాంతకి ఇష్టంలేకకాదు యీ చిరుచిర్లు. అందరికీ తెలియని ఒక ఆగ్రిమెంటు వాళ్ళిద్దరి మధ్యా వున్నట్టుంది. వాళ్ళిద్దరినీ ఎప్పుడూ వుత్తరదక్షిణ ధృవాలా అనిపిస్తుంది చూసేవాళ్ళకి. ఒకరు నిప్పయితే ఇంకొకళ్ళు చెంబుడునీళ్ళు. ఒకరు ఎండయితే ఇంకొకళ్ళు వెన్నెల. అయితే ఎవళ్ళునిప్పు ఎవళ్ళునీళ్ళు ఎవరు ఎండ ఎవరు వెన్నెల అనేది చెప్పలేం. ఆ ఇద్దరి మూడ్సు అంత గమ్మత్తుగానూ, క్విక్‌గానూ మారిపోతుంటాయి. కాని ఒకటిమాత్రం ఖాయం. అందులో ఏ ఒక్కరూ ఎండయినా రెండోవారు వెన్నెలే.

చిత్రం ఏమిటంటే కనబడే వాళ్ళందరికీ వాళ్ళు హిరణ్యకశిపుడూ, నరసింహ మూర్తుల్లా కనబడ్డా నిజానికి ఎంతో స్నేహంగా వుంటారు. జంటనగరాల్లో జంటనగరాల్లా ఇద్దరూ ఎయిర్‌బేగ్ లంతంత లేడీస్ బేగ్‌లు భుజాలకి తగిలించుకొని (రెండూ ఒక్కలాంటివే) కనబడతారు, బయటకి ఎప్పుడు వచ్చినా.

'నే చెప్పబోయేది ఒక ఆఫీసులో ఎక్కడో జరిగిందికాదు. ప్రతీ ఆఫీసులోనూ ఎప్పుడూ జరిగేదే' అంది రోజా రాణి.

'ఐతే త్వరగా చెప్పి అఘోరించు.' అంది శాంత చిరాగ్గా.

'నీకు శాంతని పేరెవరు పెట్టారు అమ్మడూ ?'

'నీ తాత. ఇదేనా నువ్వు చెప్పబోయేది?'

'వెనకటికో గుమాస్తా గుర్నాథానికి జబ్బుచేస్తే వాళ్ళ డాక్టర్ ఒక నెలరోజులు పూర్తిగా రెస్ట్ తీసుకోమన్నాట్ట. అప్పుడు ఆ గుర్నాథం ఏంచేసుంటాడో చెప్పు...' అంది రోజారాణి.

'ఏం వుంది? వాళ్ళాఫీసరు కాళ్ళావేళ్ళా పడి నెల్నాళ్ళ శలవు శాంక్షను చేయించుకొని వుంటాడు.'

'అదిగో పప్పులో కాలేశావు. ఎంత పూర్వకాలం దానివే మామ్మా! అదేమీ కాదు. పెట్టినశలవు కేన్సిల్ చేయించుకొని డ్యూటీలో జాయినయ్యాడు.'

'నేన్నమ్మను ఏకథలోనో హాస్యానికి రాస్తారుగాని, ఏ గుమాస్తాగాడు యీ రోజుల్లో అంతవెర్రేకండా వుంటున్నాడే ఆఫీసులో' అంది శాంత సవాలుగా.

'ఎదురుగా అతన్ని చూసయినా నా మాట నమ్మనా ?' అంది రోజారాణి.

వీళ్ళిద్దరి ప్రక్కసీట్లో కూర్చుని ఫైళ్ళు తిరిగేస్తున్నట్టు నటిస్తున్న సీతారాముడు రోజారాణి చూపించినవైపు చూసి మొహానికి 'యస్ సెవెన్' ఫైలు అడ్డం పెట్టుకుని కిసుక్కున నవ్వింది.

'ఏడిసినట్టుంది. నువు ఏడిపించడానికి దొరక్క దొరక్క ఆ అమాయకుడే దొరికాడా ?' రుసరుసలాడింది శాంత.

అది గోపాలంమీద అభిమానంతో మాత్రం కాదని మనం గమనించాలి. ఒక వేళ శాంతే అతన్ని ఇలా ఏడిపిస్తే రోజా

రాణీ కూడా ఇప్పటి శాంతలా అతన్ని అలా వెనకేసుకు వచ్చి తీరుతుందన్న వంగతి ఆ కిసుక్కున నవ్విన సీతారాముడికీ తెలుసు.

ఐతే ఆ సెక్షన్‌లో అంతగొడవకు కారకుడయిన గోపాలం మాత్రం నిర్వికార. నిర్వికల్ప, నిర్విచార నిత్యానంద స్వాముల వారిలా ఎదురుగా వున్న కాలండర్లోకే చూస్తున్నాడు. 'ఇంక మాపని ఇంతేనా' అన్నట్లు చూస్తున్న అతని టేబుల్‌మీద ఫైళ్ల దీనదృక్కులుకూడా అతన్ని కదల్చ లేక పోయాయి. దానికి కారణం ఆ ఎదురుగా అతను చూస్తున్న కాలండరు ఏ జ్యోతిలక్ష్మిదో అయుంటుందనుకొంటే మళ్లీ ఇందాక శాంత కాలు వేసిన పప్పులోనే మనమూ కాలు వేసినట్లవుతుంది.

కృష్ణపరమాత్మ భగవద్గీతలో చెప్పినట్లు గోపాలం దృష్టిని ఆకర్షించిన ఆ కాలండర్ నిమిత్తమాత్ర. (ఏంమాత్రా కాదు. నిమిత్త మాత్రుడికి స్త్రీలింగ శబ్దం) పైగా అది కేవలం అంకెల కాలండర్.

అసలు సంగతేమిటంటే, గోపాలం ఆ కాలండరువైపు చూస్తున్నాడన్నమాటే కాని, అతని (దివ్య) దృష్టికి మాత్రం అది ఒక సెవెంటీ ఎమ్మెమ్ సినిమా తెర. ఆ తెరమీద అతను నాల్గువారాల క్రితం తన ఇంట్లో జరిగిన దృశ్యాన్ని సినిమాలా చూస్తున్నాడు.

కాశీమజిలీకథల్లో దేవతా వస్త్రాల్లా గోపాలం చూస్తున్న ఆ సినిమా మనకంటికి కనిపించదు.

(ఏమిటి సార్! నేనేదో అంటే మీరలా నిరాశ పడిపోతే ఎలా? ఈ రోజుల్లో మన నాయకులు మాట్లాడలేని విషయంలేదు. మన రచయితలు చూడలేని విశేషం అసలే దు.)

ఆ గోపాలం చూస్తున్న సినిమా లాంటి దృశ్యాన్ని మనమూ చూద్దాం రండి. నే చూపిస్తాగా.

* * *

మునుపువున్న ఇంటికంటే సౌకర్యంగా వుంటుందని గోపాలం ఆ యింట్లో చేరాడు. అలా చేరేక అదే మొదటి ఆది వారం. సామాన్లన్నీ అతడూ, లలితా కలిసి చక్కగాసర్ది ఇంక విశ్రాంతి తీసుకుందామని అనుకున్నాడో లేదో తలుపు తట్టిన చప్పుడయింది

లలితేవెళ్లి తలుపు తీసింది.

'మీవారు వున్నారా అమ్మాయ్' అంటూ పక్కింటి పార్వతమ్మగారు.

'లోపలున్నారు. ఫరవాలేదు. రండి' అంటూ ఆహ్వానించింది లలిత. పళ్లు బిగించి కోపంతో చూస్తున్న గోపాలాన్ని లోపలిగదిలోనే వుండమని సంజ్ఞచేసింది.

ఆవిడ వస్తూనే ఇల్లంతా కలియ చూస్తూ 'అరె! సామానంతా చక్కగా సర్దేశారే.' అని ఆశ్చర్యపోయి, అంతలోనే 'అప్పుడే పిండివంటలు కూడా చేశావేమిటి?' అంది ఆ ఆశ్చర్యాన్ని రెండు పెట్టి గుణిస్తూ.

'పిండివంట లేమిటి' అంది లలిత ఆవిడ ఆశ్చర్యానికి తన ఆశ్చర్యాన్ని కూడా కలుపుతూ.

'పిల్లలు జంతికలు, కారప్పూసలాంటివి ఏవో నములుతున్నట్లు వినిపిస్తేనూ?' అంది ఆ ఆశ్చర్యంలోంచి సగం ఆశ్చర్యాన్ని 'తీసివేసి' చప్పబడి పోతూ.

'అదంతా మా ఆయన కోపం. నామీద కోపంతో పళ్లు పటపట కొరుకుతున్నారంతే కాని ఎవ్వరూ పిండివంటలు తింటూండటంకాదు పార్వతమ్మగారూ!' అని లలిత మాత్రం ఎలా చెప్పగలదు? అయినా అలా చెప్పే అవకాశం లేకుండానే 'కెవ్వు'మని అరచిందావిడ. అదేదో దెయ్యాల సినిమాలో భూతాన్ని చూసిన హీరోయిన్లా.

'ఏం జరిగిం'దని లలిత అడక్కుండానే.

'ఏమిటండోయ్. మీ ఇంట్లో వంట కిరసనాయిలు స్టవ్‌మీద చేస్తారా?' అంది పార్వతమ్మగారు. 'మీ ఇంట్లో హత్యలు చేస్తారా?' అని అడిగినంత ఆశ్చర్యంగా మొహం పెట్టి.

ఎదుటిమనిషిని కత్తితో పొడిచి ఆ కత్తి బయటికి లాగుతున్నప్పుడు పోలీసుల్ని చూసిన హంతకుడిలా బిక్కమొఖంవేసి 'అవు'నంది లలిత.

'ఒక గేస్‌పొయ్యి కొనుక్కోలేక పోయారూ! మన బిల్డింగులో మొత్తం ఆరువాటాల్లోనూ మీకొక్కళ్లకే లేదు.'

'ఏదో కొనలేదండీ!' అంది లలిత నిజంగానే హత్యచేసి బోన్లో నుంచున్న ముద్దాయిలా మొహంపెట్టి.

ఇంక మొదలెట్టింది ఆవిడ, గేస్ పొయ్యివల్ల ఎన్ని వుపయోగాలున్నాయో చెప్పటం. పూర్వకాలంలో నలుడు, భీముడు గేస్‌పొయ్యిమీదే వంటచేసి అంత పేరు పొందారట. మనం ప్రతీ అరగంటకీ కాఫీ ఎలా తాగుతామో అదేవిధంగా దేవతలు కూడా అమృతాన్ని గేస్ పొయ్యిమీదే వెచ్చబెట్టుకుంటూ ప్రతీ అర్థగంటకీ తాగుతూ వుంటారట.

ఎంతసేపు విన్నా గోపాలానికి ఆవిడ మాటలకి 'మొదలు' అనేది వుందన్న విషయం మాత్రమే తెలిసింది కాని 'అంతం' ఎక్కడవుందో అర్థంకాలేదు.

ఇద్దరు ఆడవాళ్లు కలిస్తే వాళ్ల మాట్లాడేదంతా ఒట్టి 'గేస్' అనీ అందులో ఏ విశేషమూ వుండదనీ, గోపాలానికి తెలుసు. కాని వాళ్ల ఇలా 'గేస్'ని గురించి గంటలకొద్దీ 'గేస్' కొట్టగలరన్న పాఠాన్ని అతనికి నేర్పిన ఘనతమాత్రం పార్వతమ్మగారిదే.

ఆరోజు లలితతో కలిసి మేట్నీకి వెడదామనుకొన్నాడు గోపాలం. కనీసం సెకండ్ షోకయినా వెళ్లడమవుతుందా అనే బెంగ ప్రారంభమయింది గోపాలానికి. దానికి తోడు పొద్దుట పదిగంటలకి అలవాటు ప్రకారం తిన్న పది మెతుకులు తప్పించి కడుపులో ఏమీ పడకపోవటంవల్ల అతని కడుపు ఒక గేస్ పొయ్యిలా మండటం ప్రారంభించాక పార్వతమ్మగారు,

'ఐతే వస్తానమ్మాయ్, గేస్ పొయ్యి కొనడం మరచిపోకేం' అంటూ నిష్క్రమించింది.

'మంధర వెళ్లిపోయిందా?' అడిగాడు గోపాలం అగ్గిమీద గుగ్గిలం అవుతూ.

అతనికేసి ఒక్కక్షణం వింతగా చూసి.

'ఆవిడపేరు పార్వతమ్మ. మంధర కాదు అదీ కాకుండా మీ కసలే ఆకలి మీద నీరసంకూడ వచ్చినట్లుంది.' అంది లలిత.

'ఏడిచినట్లుంది. నాచేత గేస్‌పొయ్యి కొనిపించమని ఆవిడ అంత దుష్ప్రేరణ చేస్తే...'

'మీది మరీ చోద్యంగా వుందేండి! ఆవిడ మన మంచి గురించే కదా చెప్పింది! ఏవండీ! ఆ గేస్‌పొయ్యి కొనరూ? దానిమీద

[illegible] ఏమయ్యిందో నీకెలా తెలిసిందని అంది లలిత.

'అయింది. ఆ మంధర మాటలు నీకు బాగానే తలకెక్కాయి.'

'అదిగో మళ్ళీ ఆ మాటే అనకండి. మన మంచి కోసం చెప్తే ఆవిడ మంధర అయిపోయిందా? అయితే నేను 'కైక'ననా మీ వుద్దేశ్యం?'

'ముమ్మాటికీ ఆవిడ మంధరే. ఒకవేళ నువ్వు 'కైక'లా తయారయినా నేను దశరథుణ్ణి మాత్రం కాదు నీ కోరిక తీర్చడానికి' అంటూ కోపంతో బయటికి పడిపోడు గోపాలం.

అంతకంటే కోపంతో — అంతకంటే బయటికి — పుట్టింటికి నడిచింది లలిత.

* * *

ఫ్లాష్‌బేక్‌తో గోపాలం కేలండరు తెర మీద చూస్తున్న సినిమా పూర్తి అయిందిగా. మళ్ళీ సినిమా తరువాత 'జనగణమన' ప్రారంభం కాకుండా త్వరగా గోపాలం దగ్గరకి వెడదాం రండి.

'ఒరేయ్ గోపాలం, ఆఫీసు కట్టేసి అరగంటయింది. లే...' అని నూరిబాబు వచ్చి గోపాలం భుజం పట్టుకొని కుదిపి లేవదీశాడు.

'వీళ్ళంతా వెళ్ళిపోయారా?' అడిగాడు గోపాలం తన సహోద్యోగుల నుద్దేశించి.

గోపాలం...

'అహా! గడియారం 5 గంటలు కొట్టినా సీట్లోంచి కదలని నీ సిన్సియారిటీని మన 'హెడ్' చూస్తే మెచ్చుకుంటాడేమోకాని మన వాళ్ళెలా వహిస్తారు? అక్కడికీ ఆడా మగా అంతా ఐకమత్యంగా కూడా నీ ఏకాగ్రతని మార్చలేక విఫలమనోరథులై కాస్సేపు విసుక్కొని మరీ వెళ్ళి పోయారు.' అన్నాడు నూరిబాబు.

'కళ్ళు తెరచి నిద్రపోయే ప్రాణి ఏది?' అని కాంత అడిగితే 'మన గోపాలంగారే' అంది సీతారాముడు.

'ఏడిపించడానికి పాపం ఆ అమాయకుడే దొరికాడా!' అని విసుక్కుంది రోజా రాణి—అంతకు ముమవు కాంత తన మాటలకే విసుక్కున్నట్టు.

ఐతే యిలా జరిగిందన్న విషయాన్ని సినిమా తారలు బ్లాక్‌మనీని, మన నాయకులు నిజాన్ని దాచినట్లు దాచాడు నూరిబాబు. అలా దాచడంలో నూరిబాబు స్వార్థం అస్సలు లేదు. నూరిబాబు కనుక ఆ విషయాన్ని చెప్పివుంటే తనకు జరిగిన అవమానానికి గోపాలం ఏడిచి ఏడిచి ఆ కన్నీటి వరదలతో వాళ్ళ ఆఫీసు భవనాన్ని ముంచేసి వుండేవాడు. (నూరిబాబులాటి నిస్వార్థ త్యాగులకు జై.)

ఇద్దరూ కలిసి (అనే కన్నా — నూరిబాబు గోపాలాన్ని తీసుకుని అంటే బాగుంటుంది.) ఆఫీసులోంచి బయటికి వచ్చారు. తన ప్రక్కనే 'మమ్మీ'లా నడుస్తున్న గోపాలాన్ని చూసి జాలిపడిన వాడై నూరిబాబు,

'ఏరా గోపాలం! మరి అంత విరాగిలా వుంటే ఎలా? నీ మనస్సుకి కాస్త ఛేంజ్ కావాలి. ఈ పూట మా యింట్లో భోంచేద్దువుగాని రా.' అన్నాడు నూరిబాబు.

వర్షంపడ్డ రోజు కాలవొడ్డున నడవబోయి జర్రున జారి ముందు బురదలోనూ తరువాత దాని ప్రక్కనే వున్న కాలవలోనూ పడ్డట్టయింది గోపాలం పని. ఎప్పుడూ కనీసం టిఫిన్ కయినా పిలవని నూరిబాబు ఆహ్వానానికి గోపాలం ముందు ఆశ్చర్యంలో పడిపోయాడు. ఆపైన మోహమాటంలో పడిపోయాడు. అలాగ ఆ రెండింటిలోనూ మునిగి, ఈతకొట్టి అలసిపోయి చివరకి,

'అది కాదోయ్! నోటీసయినా ఇవ్వకుండా మీ ఇంటికి భోజనానికి వస్తే మా చెల్లాయికి కాస్త ఇబ్బందవుతుందేమోనని.'


అంటూ నసిగాడు సిగ్గుగా.

'ఏడిశావులే పద.' అని నూరిబాబు గోపాలం భుజంమీద గట్టిగా తట్టడం 'దో సవారీ'కి ఒక రిక్షాని బేరమాడి అందులోకి గోపాలాన్ని ఎక్కించుకొని బార్హ్ పెట్టడం అన్నీ అరక్షణంలో జరిగిపోయాయి. ఆ తరువాత వాళ్ళిద్దరూ కలిసి నూరిబాబు ఇంటికి చేరుకోవడానికి మాత్రం పద్ధెనిమిది నిముషాలు పట్టింది.

గోపాలాన్ని చూసి, ఆ తరువాత అతను భోజనానికి వచ్చాడన్న సంగతి తెలిసి సత్యవతి,

'నే కాపురాని కొచ్చిన ఇన్నేళ్ళలోనూ ఆయనకి ఇలాంటి మంచి బుద్ధి కలిగిందంటే ఆశ్చర్యంగానే వుందన్నయ్యా' అంటూ తన ఆనందాన్ని గోపాలానికి తెలియజేసింది.

ఐతే భోజనంవేళ సమీపిస్తున్నప్పటికీ సత్యవతి గోపాలానికి అదనంగా వంటచేసే ప్రయత్నం ఏమీ చెయ్యకపోవటంతో అతని



...గుబగుబ లాడ్తున్నా, కడుపు కరకర్లాట్టం ప్రారంభించాయి. ఈ మొగుడూ పెళ్ళాలిద్దరూ కలిసి తనని భోజనానికని పిలిచి ఫూల్ చెయ్యటంలేదు కదా అని అనుమానమొచ్చి ఏప్రిల్ ఫస్టేమోనని చేతికున్న డేట్ వాచీ వైపు ఒకసారి చూశాడు గోపాలం.

చివరికి అతని బాధను గుర్తించి నట్టుగా,

'సత్యవతీ, గోపాలానికూడా వంట చెయ్యవూ?' అన్నాడు సూరిబాబు.

'ఎంతసేపండీ చిటికెలో చెయ్యనూ?' అంటూ ఆమె లోపలికి వెళ్ళింది.

'ఇప్పుడు బియ్యం పడేస్తే ఎప్పటి కవుతుంది వంట? వీళ్ళింటినుంచి తన భోజనం అయి బయటపడేసరికి అర్ధ రాత్రయ్యేలా వుంది' అనుకున్నాడు గోపాలం. ఏమాట కామాటే చెప్పుకోవాలి. లలిత ఇంత రాత్రివరకూ ఎప్పుడూ తన భోజనానికి ఆలస్యం చెయ్యలేదు అనికూడా అనుకున్నాడు గోపాలం.

ఐదు నిముషాలు పోయాక వంటిం ట్లోంచి పైట చెంగుకి చెయ్యి తుడుచు కొంటూ వచ్చిన సత్యవతిని చూసేసరికి గోపాలం బక్క (ఆకలి) కోపం మరీ ఎక్కు వయింది.

'నిజం చెప్పాలంటే చెల్లాయ్! మీ వదినయితే ఈసరికి అన్నంకూడా వండి వచ్చేసేది.' అన్నాడు గోపాలం (అది నిజం కాదని అతని అంతరాత్మ హెచ్చరిస్తున్నా)

'నువ్వనేది ఏమిటన్నయ్యా!' అంది సత్యవతి తెల్లబోయి.

'బియ్యం కడిగి ఎసరు పెట్టడానికి నువ్వింత టైం తీసుకొంటేను.'

సూరిబాబూ, సత్యవతీ ఒక్కక్షణం మొహం మొహం చూసుకొని ఆ తరువాత విరగబడి నవ్వేరు. ఈసారి తెల్లబోవటం గోపాలం వంతయింది.

'అదికాదు గోపాలం. వంటంతా పూర్తయిపోయింది' అన్నాడు సూరిబాబు.

గోపాలం మొహం మొదట కందగడ్డ లా తరువాత చింతాకంత చేసుకొని భోజ నానికి లేచాడు.

సూరిబాబు గోపాలాన్ని వంటింట్లోకి తీసుకెళ్ళి ప్రొఫెసర్ సర్కార్‌గారి మేజిక్ ప్రోగ్రాంలో లాగ తను వారంరోజుల క్రితం

కొన్న గేస్ స్టవ్‌ని చూపించి దాన్ని వాడటం ఎలాగ. దానివల్ల వంటెంత త్వరగా అయిపోతుంది అన్న విషయం మీద గంటన్నర ఏకధాటిగా వుపన్యసించాడు. ఆ తరువాత కాని గోపాలాన్ని భోజనానికి కూర్చోనివ్వలేదు.

(ఒరేయ్! సూరిబాబూ!! ఎప్పుడూ ఇంటికి పిలిచి కాఫీనీళ్ళయినా ఇవ్వని నువ్వు నన్ను భోజనానికి పిలవటానికి కారణం ఇదా! నాకీరోజ్జరిగిన అన్యాయానికి బదులు తీర్చుకోలేకపోతానా!)

'అన్యాయంగావి సత్యా! నీకిది న్యాయమా!! అప్పడం ఒక్క గోపాలానికే వేసి నాకు వెయ్యకపోవుట!!!' అన్నాడు సూరిబాబు సత్యవతో.

'అయ్యో! నేనివాళ అసలు అప్పడాలే వెయ్యలేదండీ' అందామె.

'అబ్బే!! గోపాలం ఏదో పటపటా కొరుకుతూ నముల్తుంటేనూ!' అంటూ వీళ్ళు నమిలాడు సూరిబాబు.

'ఒరేయ్! గోపాలం!! నీకెప్పుడూ పళ్ళు పటపట్లాడించడమేనా పని. అది చూసి పక్కింటి పార్వతమ్మగారు జంతికలు నములుత్నా ననుకొంది. సూరిబాబు అప్పడా లనుకొన్నాడు. నీకెప్పుడు బుద్ధొస్తుందిరా' అని తనమీద తనే కోప్పడేసుకొన్నాడు గోపాలం— చచ్చి స్వర్గాన (ఏమో! నరకంలోనూ అవొచ్చు) వున్న తన బామ్మగారి

గోపాలం...

ఫక్కీలో.

భోజనాలయిపోయేక తన కోపాన్నంతా నోట్లోవున్న వక్కపొడిమీద చూపిదుతూ తన కారోజు జరిగిన అన్యాయానికి బదులు తీర్చుకోవటం ఎలాగా అని ఆలోచిస్తున్న గోపాలానికి వంటింట్లోంచి వస్తున్న సత్యవతి కనబడింది.

వెంటనే ముందు వెనుకలు చూసుకోకుండా 'వంటగిన్నెలు సర్దడానికి ఇంత సేపా? ఇదే మీ వదినయితే చిటికెలో చేసేసేది' అన్నాడు.

క్రిందటిసారిలా యీసారి సత్యవతి తెల్లబోలేదు. గోపాలం వాలకం ఆవిడకేమీ కొత్తకాదు. వంటకాల్లో ఎప్పుడయినా కారం ఎక్కువయినప్పుడూ, మరికొన్ని అలాంటి సందర్భాల్లోనూ అతను ఇలా 'హా! హా!!' కారాలు చేస్తుంటాడని ఆమెకి తెలుసు. ఐనా ఆవిడ మాత్రం ఎన్నిసార్లని వూరుకొంటుంది.

నిల్చున్న పళంగా అతన్ని వంటింట్లోకి తీసుకెళ్ళి చూపించింది అక్కడి గిన్నెలు. 'ఈమధ్య ఆడాళ్ళు కూడా నేర్చుకున్నారా మేజిక్.' అనుకుని ఆశ్చర్యపోయాడు. గోపాలం అప్పుడే తోమబడి వరుసగా పేర్చబడ్డ తళతళా మెరుస్తున్న స్టీలు గిన్నెల్ని చూపి.

అరగంటక్రితం సూరిబాబు తీసుకొన్న డ్యూటీని ఇప్పుడామె తీసుకొంది.

గేస్‌పొయ్యిమీద వంటచేస్తే గిన్నెలు మసిబారవనీ వాటిని ఒక్కసారి 'విమ్'తో అలా తోమగానే మిలమిలా మెరుస్తుంటాయనీ గంటసేపు సోదాహరణ ప్రసంగం చేసింది.

చిత్రం. దానికి గోపాలానికి కోపం రాలేదు. అతనికి ముందు తలతిరిగిపోయింది. ఆతరువాత మనసు తిరిగిపోయింది.

మొత్తంమీద మరో పావుగంటకి తపస్సు తరువాత బోధివృక్షం క్రిందనుంచి బయటకు వచ్చిన బుద్ధుడిలా — సూరిబాబు ఇంట్లోంచి బయటపడ్డ గోపాలానికి జ్ఞానోదయ మయినట్లయింది.


ఆతరువాత ఇంకోగంటకి ఇల్లుచేరుకొని నిద్రపోయేముందు అనిపించింది అతనికి 'యీ విశాల ప్రపంచంలో కనీసం గేస్ పొయ్యయినా లేకపోతే బ్రతకటం కష్టం' అని.

తెల్లవారిన తరువాత పెళ్ళిచేసుకోబోతున్న పెళ్ళికుమారుడిలాగ ఆ రాత్రంతా గడిపాడు గోపాలం. తెల్లవారుఘామున 'కోడి'ని భుజంతట్టి లేపి తను బట్టలేసుకుని బయలుదేరాడు. ఆఫీసరు ఇంటికివెళ్ళి, అర్జెంటు డొమెస్టిక్ వర్కుందని రెండుగంటలు లేటు పర్మిషన్ తీసుకుని ఎక్కిన సిటీబస్ ఎక్కకుండా ఆరు సిటీబస్సులు మారి ఆరు అరగంటల తరువాత చేరుకున్నాడు 'కాళీగాస్ కంపెనీ'కి.

కంపెనీ ఆవరణలో వరుసగా కుర్చీల్లో యాభై అరవైమంది, కూర్చునివున్నారు. గోపాలం చెయ్యి పేంటు జేబులోంచి తీసి ఒకవేలు ముక్కుమీద వేసుకొని 'బారా!' అనే ఆశ్చర్యార్థకాన్ని స్వగతం పలుక్కున్నాడు.

మనదేశంలో నిరుద్యోగ రాక్షసి ఎంత భయంకరంగావుంది? అనుకున్నాడు గోపాలం వాళ్ళనందర్నీ చూసి. కంపెనీలో ఏదో ఒకచిన్న తాత్కాలిక వుద్యోగమేదో వుంటే దానికి అభ్యర్థుల్ని పిలిచివుంటారు.

అదృష్టవశాత్తూ తనకి ఏదో ఒక వుద్యోగంవుంది కనుక గాని, లేకపోతే వాళ్ళందరి తరువాత చివర ఒకకుర్చీ వేయించుకొని తనుకూడా కూర్చోవలసి



వచ్చేదికదా !

అక్కడ గ్రాడెజ్ టేబిల్స్ ముందు కూర్చుని పనిచేసుకుంటున్న గుమాస్తాలని చూస్తే ఎంతో ముచ్చటేసింది. గోపాలానికి.

(అయ్యా! గుమాస్తా సోదరులూ !! మీరంతా ఎంత అదృష్టవంతులయ్యా ! మీ పెళ్లాలెవరూ మా ఆవిళ్లా గేస్‌పొయ్యి కోసం కోపగించి పుట్టింటికి వెళ్లే అవకాశమే లేదు కదా? మీ అదృష్టమే అదృష్టమండీ.)

కాస్సేపటికి తన తన్మయత్వంనుంచి తేరుకుని, అక్కడవున్న గుమాస్తాలనందర్నీ పరిశీలించి తన మనస్సుకి నచ్చిన ఒకతని దగ్గరకి వెళ్లి తనొచ్చిన పని చెప్పాడు గోపాలం.

'అలాగా! వెళ్లి అక్కడ వరసలో కూర్చోండి.' అన్నాడతను.

'మీరు పొరబడుతున్నట్లున్నారు. నేను వచ్చింది వుద్యోగంకోసం కాదు; గేస్‌పొయ్యి గురించి.'

'వాళ్లంతా వచ్చిందీ గేస్‌పొయ్యి కోసమేనండీ.' విసుక్కున్నాడతను.

హతాశుడై పోయాడు గోపాలం. భార్య అలుకకు గురైన తనలాంటి అభాగ్యులా వీళ్లంతా? ఇప్పుడు తనేం చెయ్యాలి. తనలాటి పరిస్థితులలోనే తన అభిమాన డిటెక్టివ్ సౌమిత్రి ఒకసారి ఏం చేశాడంటే,

(డిటెక్టివ్ సౌమిత్రి ఆఫీసు ప్యూను దగ్గరికి వెళ్లి చేతో ఒక పదిరూపాయల నోటు అతని కళ్లముందు పెట్టి 'ఇది నీ సొంతం కావాలనుందా?' అన్నాడు. ప్యూను కళ్లు ఆశతో మెరిశాయి. వెంటనే నోటు అందుకోబోయాడు. డిటెక్టివ్ సౌమిత్రి కోటుజేబులోంచి మరో పది రూపాయల నోటుతీసి,

'ఇది కూడా నీదవుతుంది, నేనడిగిన దానికి సమాధానం చెప్తే...' అన్నాడు.

చివరకి వేరే చెప్పాలా, డిటెక్టివ్ సౌమిత్రి తనక్కావలిసిన సమాధానం అతని దగ్గర్నుంచి రాబట్టాడని.)

గోపాలంలో ఆశ మొలకెత్తింది. చుట్టూ చూశాడు. అక్కడ ఒకడవాలీ తిరుగుతూ వుంటే అతని దగ్గరికి వెళ్లి వివరూ చూడకుండా ఒక పదిరూపాయల నోటు అతనికి చూపించి,

'ఇది నీ సొంతం కావాలనివుందా?' అన్నాడు.

అతను గోపాలంకేసి వింతగా చూసి 'నాకు అది అక్కర్లేదు కాని మీరు మా మేనేజరుగారి దగ్గరకు వెళ్లాలంటే వెళ్లండి. ఆయన మంచోడు. మీకు త్వరగా గేస్‌పొయ్యి వచ్చేటట్లు చేస్తాడు' అన్నాడు.

గోపాలానికి తన తలకాయతీసి హిప్ పాకెట్‌లో దాచుకోవాలనిపించింది. కాని అలాచేస్తే ఆ కంపెనీ మేనేజరు తలకాయ లేని తనతో మాట్లాడడేమోనని భయం వేసి ఆపని చెయ్యలేదు.

గోపాలం మేనేజరుగారి గదిలోకివెళ్లి ఆయనతో తన కష్టాల్ని చెప్పుకుంటే ఆయన ఈ విషాదగాథ విని కన్నీళ్లు ఆపుకోలేక ఆ కన్నీళ్ళతో తన ఆఫీసు కాగితాలు ఎక్కడ పాడయిపోతాయోనని భయపడి,

'మీరు నిశ్చింతగా వుండండి. మీ యింటికి గేస్‌పొయ్యి యమర్జంటుగా రెణ్ణెల్లలో వచ్చేట్టు చూస్తాను' అన్నాడు.

'యమర్జెంటు అంటే రెండునెలలా?'

గోపాలం ...

అంటూ ఆశ్చర్యపోయాడు గోపాలం.

'అవునండీ! ఆ బయట కూర్చున్న వాళ్ళకి గేస్‌పొయ్యి విన్నాళ్ళకి వస్తుందను కొన్నారు. పదినెలలకి' అన్నాడు మేనేజరు.

చేసేది లేక బయటకు నడిచాడు గోపాలం.

బయటకు వస్తూ అనుకున్నాడు ఇంత పెద్ద కంపెనీలో తనకి అర్జంటుగా ఒక గేస్‌స్టవ్‌ని సప్లయి చెయ్యలేని ఈ కంపెనీకి 'కాళీగేస్ కంపెనీ' అని పేరు పెట్టే బదులు 'ఖాళీగేస్ కంపెనీ' అని పేరెడితే సరిగ్గా సప్పేది కదా అని.

ఆ తరువాత ప్రారంభమయ్యాయి అసలు కష్టాలు గోపాలానికి.

నాలుగురోజుల కాజువల్ లీవులు, ఐదారు పెర్మిషన్లు పెట్టి కాళీగేస్ కంపెనీ చుట్టూ తిరిగాడు గోపాలం. ఎన్నిసార్లు తిరిగినా ఆ కంపెనీ మేనేజరు నిర్ణయించిన గడువు రెండు నెలలూ గడిస్తేగాని గేస్‌పొయ్యి అతనింటికి వచ్చే సూచనలేవీ కనబడలేదు.

ఈలోగా గోపాలం ఆఫీసులో వాళ్ళకే కాదు జంటనగరాల్లో అందరికీ అతను గేస్‌పొయ్యి కొనబోతున్నట్లు తెలిసి పోయింది. ఆఫీసులో వాళ్ళంతా గోపాలం గేస్‌పొయ్యి సంపాదించటం కోసం నాలుగు రోజుల్లీవు బోలెడు పెర్మిషన్లు వాడేశాడని తెలిసి ఎవరి ముక్కులమీద వాళ్ళు వేళ్ళు వేసుకొని ఆ తరువాత ఒక క్యూలో వచ్చి గోపాలాన్ని పరామర్శించటం ప్రారంభించారు. జంటనగరాల్లో వాళ్ళందరికీ ఆ మధ్య అమెరికానుంచి తీసుకొచ్చి ప్రదర్శించిన 'చంద్రమండలపు రాయి'లాగ సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్ అయ్యాడు గోపాలం. ఈవిధమైన గోపాలం పలుకుబడి చూసి ఒకళ్ళిద్దరు అతన్ని ఎలక్షన్లలో పోటీ చెయ్యమని సలహా యిచ్చారు కూడా.

'ఓట్ ఫర్ ఇందిరా' అనే ఎన్నికల స్లోగన్ కంటే 'గోపాలం గేస్‌స్టవ్ కొనబోతున్నాడు' అనేది ఎక్కువ ప్రచారాన్ని పొందింది.

ఇంత జరిగినా గోపాలానికి గేస్‌పొయ్యి మాత్రం దొరకలేదు అతన్ని ప్రతీ వారూ 'ఏమండీ కులాసాయేనా?' అని పలుకరించే బదులు 'గోపాలంగారూ! గేస్‌స్టవ్ వచ్చిందా?' అని అడగటం ప్రారంభించారు.

ఇది భరించలేక రెండునెలలు గడువు పూర్తవకపోయినా గోపాలం పధ్నాలుగోసారి కాళీగేస్ కంపెనీకి ఫోను చేశాడు. ఆ రోజున,

'నేను . గోపాలాన్ని ఫోను చేస్తున్నానండీ, ఫలానా మంత్రిగారి ఇంటికి ప్రక్క వుంటున్నాను.'

'అలాగా సార్! చెప్పేరు కాదేం? ఇవాళ మధ్యాహ్నంలోగా పంపించేస్తాం సార్!' అన్న కంపెనీవాళ్ళ సమాధానం విని గోపాలం తన చెవుల్ని తనే నమ్మలేక పోయాడు. గేస్‌పొయ్యిని రిసీవు చేసుకోవడానికి తను ఆరోజు మళ్ళీ ఆఫీసుకి సెలవుపెట్టి ఇంట్లోనే వుండిపోయాడు.

ఆరోజున మధ్యాహ్నం గేస్‌పొయ్యి రావటం గోపాలం జీవితంలో మరపురాని మధురాతి మధురక్షణం. అంత ఆనందాన్ని తను జీవితంలో ఎప్పుడూ రుచి చూడలేదు. కాళీగేస్ కంపెనీ మేనేజరుకి తన మనస్సులోనే అనేక కృతజ్ఞతలు చెప్పుకున్నాడు.

వాళ్ళావిడ లలితకి ఒక ఉత్తరం రాసి పారేశాడు, 'నువ్వింక రానవసరం లేదు. నేను గేస్‌పొయ్యి కొనుక్కున్నాను' అని. అప్పటికిగాని అతనికి ఆవిడమీద కక్ష తీరలేదు.

ఆరోజు సాయంత్రం తనింట్లో కాఫీ టిఫిన్‌లకు రమ్మని ఆఫీసులోని తన కిష్టులయిన సహోద్యోగులనందర్నీ ఆహ్వానించాడు.

రావలసిన వాళ్ళంతా వచ్చిన తరువాత వాళ్ళ ఎదురుగా అయిదు నిముషాలలో కాఫీటిఫిన్‌లు తయారుచేసి తన పాకశాస్త్ర ప్రవీణత, గేస్‌పొయ్యి వల్ల ఎంత త్వరగా వంట చెయ్యొచ్చో అన్న విషయాన్ని చూపాలని గోపాలం వుద్దేశ్యం.

సాయంత్రం ఆరయ్యేసరికి అందరూ బిలబిలాడుతూ అతని ఇంటికి చేరుకున్నారు.

అంత తక్కువ వ్యవధిలో గేస్ పొయ్యిని సాధించగలిగినందుకు గోపాలాన్ని వాళ్ళంతా అభినందించారు. కొందరు అతనిని ఆకాశాన్నుంచి భూమికి గంగను తెచ్చిన భగీరథునితో పోల్చారు. గోపాలం తనకి పొగడ్తలు యిష్టంలేనట్లు మొహం పెట్టి వాటినన్నిటనీ స్వీకరించాడు.

కాఫీ టిఫిన్‌లు తయారు చెయ్యబోయే ముందు అతిథులందరినీ గేస్‌పొయ్యి దగ్గరకి తీసుకువెళ్ళి దాన్నెలా వుపయోగించాలో చెప్పబోతుంటే వీధి గుమ్మం దగ్గిర అడుగుల చప్పుడయ్యింది. అందరూ అటు చూశారు. అక్కడ గేస్ కంపెనీ అసిస్టెంట్ మానేజరు.

గోపాలం ఆశ్చర్యం, ఆనందం వర్ణనాతీతం. 'రండి! రండి!! మంచి సమయానికి వచ్చారు.' అంటూ ఆహ్వానించారు.

గేస్ కంపెనీ అసిస్టెంట్ మేనేజరు గొంతు సవరించుకొని.

'క్షమించాలి! గేస్‌పొయ్యి గురించి యీరోజు మంత్రిగారు ఫోను చేశారు. ఇవాళ రెడీగా వున్న దీన్ని 'ఆయనకి పంపించాము పొరపాటున మా మనిషి దీన్ని మంత్రిగారి ఇంటిప్రక్కనే వున్న మీకు డెలివరీ చేశాడు. ఇప్పుడు దీన్ని ఆయనకి ఇవ్వకపోతే మా పరువు పోతుంది. మీకు మరోటి సాధ్యమయినంత త్వరలో సప్లయి చేస్తాం...'

అంటూ నీళ్ళు నమిలాడు. గోపాలం హొయ్యబారి పోయాడు. అతని జవాబుకి ఎదురు చూడకుండానే కంపెనీ మనుషులు ఇంట్లోని గేస్‌పొయ్యిని బయటకు సాయం పట్టారు. నోటమాటలేక అలాగే నిలబడి పోయిన గోపాలానికి థేంక్స్ చెప్పి అసిస్టెంటు మేనేజరు వెళ్ళిపోయాడు.

పాఠకులూ!!

అప్పటి గోపాలం పరిస్థితిని వర్ణించ మిమ్మల్ని శోకానికి గురిచెయ్యను. మీరే వూహించుకోండి అప్పటి పరిస్థితిని.

కాని ఒక్క విషయం మాత్రం చెప్పాలి. ఇది జరిగిన నాల్రోజులకు లలిత దగ్గర్నుంచి గోపాలం వుత్తరంకి జవాబు వచ్చింది.

'గేస్‌పొయ్యి వచ్చింది కనుక నేను రానవసరంలేదని రాశారు. ఈ మగాళ్ళు ఆడవాళ్ళని ఎందుకు పెళ్ళాడుతారో నాకు అర్థం కావటం లేదు తలోక గేస్‌పొయ్యిని పెళ్ళిచేసుకుంటే సరిపోయేదిగా'

పాపభీతి!

— కె. రామలక్ష్మి



సర్వసాధారణంగా ఆడవారందరికీ కామన్‌గా ఉండే మానసిక ఆందోళన ఒకటి ఉంది. అదే తప్పు చేశామన్న బాధ. 'తప్పా?' అని అడగవచ్చు మీరు. అంతే కాదు 'నాకేం అలాంటి రోగం లేద'ని కూడా గట్టిగా వాదించవచ్చు. నిజమే. అక్షరాలా తప్పేదో చేసి ఆ చేసిన పాపం దాచుకోలేక సతమతమై పోతున్నారని కాదు—నా ఉద్దేశ్యం. నేననేది నైతికమైన ఆందోళన. 'అలా చేసి ఉండకూడదు' అనిపించే ధోరణి. అప్పు పుట్టినప్పుడు హాయిగా చీర కొనుక్కుంటే. అనిపించే బాధ! ఆడవారంతా ఒకటే. ఏదో ఒక సందర్భంలో నిలబడి బాధపడిపోతూ ఉండడం జరుగుతుంది. కాని ఈ విషయంలో మగవారంత సీరియస్‌గా బాధ పడిపోరు.

ఇల్లు అస్తవ్యస్తంగా ఉన్నప్పుడు చుట్టాలొస్తే, స్నేహితులు వస్తే—ఆయన గారికేం బాధే అనిపించదు — చిరుగుల బనీమా మాసిన లుంగీతో హాయిగా 'రండి రండి' అంటూ ఆహ్వానిస్తారు. కాని మనమో? గబగబ తల దులిపేసుకోవాలి. లోపలికి పోయి బట్టలు మార్చేసుకోవాలి. ఏ మాత్రం పని చేస్తున్నట్టు కనపడకుండా తాపత్రయ పడాలి. రోజల్లా హాయిగా కూర్చోడం తప్పించి మనకేం పని ఉండదని ఎదుటి ఇల్లాలు అనుకోవాలి! ఇంత చేసే ఆ వచ్చిన వాళ్ళు కాస్తా వెళ్ళిపోయాక 'ఆవిడగారేమనుకుందో, యీసరికి రేపటికి ఊరూ వాడా చాటేస్తుంది,' అని అనుకోకుండా ఉండం. అవునా?


వంట పాడైతే ఎంత తప్పయిపోయింది అని బాధ. కారణం తగినంతది ఉన్నా అది మన మనస్సుకి సరిపోదు. పెరట్లో కుర్రాడు చెట్టెక్కి పడ్డాడు వాడి సంగతి చూస్తూంటే, అన్నం కాస్తా అడుగంటిందన్న సత్యం మధ్య పెట్టి 'అయ్యో, నా మతి మండా, ఎంతపని చేశాను' అని యిదై పోతాం. అంతటితో ఊరుకుంటామా? ఆ కుర్ర నాగన్న పడ్డానికి కూడా మనమే కారణంగా ఊహించుకుంటాం. లేకుంటే ఏ పెద్దాడినో చూసుకోమని చెప్పలేదనో, లేకుంటే అసలా చెట్టు కింది కొమ్మలు కొట్టించి ఉండవలసిందనో బాధపడతాం.

మనని మనం ఎందుకిలా శిక్షించుకుంటామో, నాకెంతకీ అర్థంకాదు—వంటలు పాడూ అవుతూవుంటాయి. పిల్లలు పడుతూనూ వుంటారు. రోజల్లా మనం జాగ్రత్తలు పడ్డాసరే – యివి తప్పించలేం. ముఖ్యంగా పిల్లల విషయంలో యిలా కుమిలిపోయే తల్లులు ఎక్కువ. తండ్రికీ తగినంత బాధ్యత ఉందని తెలిసీ అన్నింటికీ తనదే బాధ్యత అనుకుంటుంది _ తల్లి. మగకుర్రాళ్ళు అల్లరి చెయ్యకుండానూ ఆడపిల్లలు ఏడవకుండానూ ఉండరు. ఆయినా సరే 'నేనెక్కడ దారితప్పాను?' అని ప్రశ్నించుకుంటుంది తల్లి. 'సరైన టైంలో నాలుగంటించి ఉండవు' అన్నా నిలాగే—అనసూయ బాధపడి పోతూంటే. దాని ముఖం చూడాలి మీరు. కొట్టిన తరువాత ఆ తల్లి పడే బాధ – దెబ్బతిన్న కుర్రాడు పడివుండడు!

మా పక్కింటి మామికి ఏడుగురు పిల్లలు. యిప్పుడంతా పెద్దవాళ్ళయి పోయారనుకోండి. వారంత క్రమశిక్షణతో చెప్పినమాట శ్రద్ధగా వినేవాళ్ళలా ఎలా తయారయ్యారు? 'అవసరం అయినప్పుడు, మితిమీరుతున్నారన్నప్పుడు నాలుగంటించే పెంచాను' అంటుంది గర్వంగా మామి. 'మనసులో నాకు నేనే ఆరడుగుల్లోతున తవ్వి పాతేసుకునే దాన్ననుకో' అంది నవ్వుతూ. కాని లక్షణంగా పెరిగారు పిల్లలు. యిప్పుడలాంటి బాధ అనిపించడం లేదు అంటుంది.

ఈరకం మానసికం అయిన బాధ ముఖం మీద కన్పిస్తుంది. వయస్సుకు మించిన ముసలితనం యిచ్చేస్తుంది. 'ఈవేళ లేటు' అన్న బాధతో బస్సుస్టాండులో నిలబడ్డ వాళ్ళని యిట్టే గుర్తుపట్టవచ్చు; లావుగా వున్నవాళ్ళు తిండికి కూర్చుంటున్నప్పుడు చూడండి, ఆఫీసరు క్రిందివాణ్ణి తిట్టగానే చూడండి. అందుకే ఎవర్నైనా గెంటవలసివస్తే—ఆ పని మగవాళ్ళకి అప్పగిస్తాం!

ఎవరితోనైనా—ముఖ్యంగా పరాయి మగవాడితో సరదాగా మాట్లాడితే బాధ, అందంగా అలంకరించుకుంటే – ఏమనుకుంటారో, అన్నబాధ—యిలా అన్నింటికీ బాధపడ్డానికి ఆడవారిదే పైచేయి. మగవాళ్ళకంటె ఆడవాళ్ళకి ఎక్కువ ఆలోచనని అనుభవాన్ని పెట్టాడేమో ఆ భగవంతుడు? అయినా యిలా ప్రతిదానికీ తప్పుచేశామేమో అనుకుంటూ బాధపడిపోడం తగ్గించాలి. మామూలుగ—మానసికాందోళని చెవిపట్టి ముందు నిలబెట్టి—అవతలికి గెంటేయాలి.' లేకుంటే ఏమిటి? బాధ మరిచిపోడానికి సినిమాకెడితే బాధపడి - సరదాకి కొత్తచీర కొనుక్కుంటే బాధపడి—యింకెలా? నాకైతే నేను—ఏ చెత్త సినిమానో చూసివచ్చిగాని కూర్చొని రాసుకోలేను – అయ్యో డబ్బు తగలెట్టానే అన్నబాధ—నాచేత వెకవెకలాయిస్తుంది!



విమలారామం

2

అలా రెండురోజులు గడిచిపోయాయి. వివరి దిన కృత్యాలలోను మార్పులేదు. ఆవేళ ఆదివారం. నాన్నగారు పెందరాళే భోజనం చేసి పనిమీద వెళ్ళిపోయారు.

'అక్కా! మాస్టారికి వేడి మంచినీళ్ళు కావాలిట!' అంటూ వచ్చాడు రవి.

'ఏందుకు?' ఆవేళప్పుడు ఏందుకో నా కర్థం కాలేదు.

'ఏమో! పడుకొని ఉన్నారు. భోజనాని క్కూడా వెళ్ళలేదు.'

నా మనస్సు చివుక్కుమంది ... అతను ఉదయం స్నానానికి కూడ నూతివైపు రాలేదన్న విషయం అప్పుడు గుర్తుకు వచ్చింది.

గబగబ వేడినీళ్ళ గ్లాసుతో అతని గదిలో కడుగు పెట్టాను. అదే మొదటిసారి అతని గదిలోకి రావటం!

అతను బాగా నీరసించి ఉన్నాడు. గెడ్డం మాసి వుంది. ఒక్కరాత్రిలో ఇంత జబ్బు పడటం నాకాశ్చర్యం కల్గించింది. అతని పాలభాగం పై చెయ్యివేసి చురుక్కున కాలి నట్లయి వెనక్కి తీసేసాను.

'అమ్మా!' అని కళ్ళు తెరిచాడతను. ఆ కళ్ళలో ఏదో కాంతి.

'ఎంత చల్లగా ఉంది!'

'ఏమిటి? జ్వరమా!'

చిన్నగా నవ్వి, 'సేవ చేసే వాళ్ళుంటే రోగమంత సుఖం లేదుట!' అన్నాడు;

'ఛ! ఏమిటండీ ఆ మాటలు! రోగాన్ని కోరుకునే వాళ్ళుంటారా? డాక్టరు ఇంట్లో ఉండగానే నిర్లక్ష్యం చేసే రోగి నేమనాలి?'

'జగమొండి...మొండి రోగి...ఏదో ఒక పేరు పెట్టు...' అని నవ్వాడతను.

'బాగానే వుంది...ఇంతకీ ఎప్పటి నుంచి ఈ జ్వరం? నా అనుమానం కుక్కకాటు తిన్నప్పటి నుంచీ అని...'

'కావచ్చు. రెండు రోజుల నుంచి ఇలానే ఉంది. ప్రయాణ బడలిక అనుకున్నాను. పగలు ఏదో తిన్నా రాత్రిళ్ళు సయించటం లేదు. నీవు తెచ్చి యిచ్చే పాలతోనే ప్రాణాలు నిలిచాయి...'

'మరి అంత రాత్రివరకు బయట ఉంటారెందుకు?'

'అలా చల్లగాలికి ఊరి బయటకు షికారు వెళ్ళటం—దారిలో ఎవరో ఒకరు పలకరించటం...టైము ఎలా గడిచి పోతోందో తెలియకుండ చేసాయి.'

అతన్నెంతగా అపార్థం చేసుకున్నాను!

నాన్నగారు ఇచ్చే మాత్రలు తెచ్చి వేసుకోమని వేడివేడి కాఫీ ఇచ్చాను.

'రాధా!...' అబ్బ! ఏమిటాపిలుపు.

'ఊఁ!'

'నిన్నొకటడుగుతాను. ఏమీ అనుకోవు కదా!'

'ఏదో అనుకునే ప్రశ్న అయితే అడగ వద్దు.' అన్నాను కిటికీలోంచి బయట కెక్కడికో చూస్తూ.

'సరే...డాక్టరుగారి కెప్పటినుంచి ఈ అలవాటు? ఒకరికారోగ్యం ప్రసాదించే వ్యక్తి తన ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయ టానికి బలీయమైన కారణ ముండాలని నా ఊహ...'

'అమృతమని మ్రింగటానికీలేదు; విష మని క్రక్కటానికీ లేదు...నాలుగేళ్ళ క్రితం వరకు మాయిల్లు స్వర్గసీమలా ఉండేది. అమ్మ...మాయింటి జ్యోతి మహమ్మారికి ఆహుతి అయిపోయింది. సంగీత సరస్వతి అవతారం చాలించింది. అమ్మకంఠమెత్తితే తన్మయత్వంలో కన్నీరు కురిపించనివారు లేరు. వీణముందు ఆమె మధురవాణి. గాన కోకిల సరోజినీదేవి భర్తగా డాక్టరుగా కంటె నాన్నగారికి మంచిపేరు వచ్చిందంటే అతిశయోక్తి లేదు. ఆమెలేని ఈ యింట దురదృష్టం తాండవమాడుతోంది. అమ్మంటే నాన్నగార్కి పంచప్రాణాలు. బ్రతికించుకుందామని ఆయన చేసిన ప్రయత్నాలు నిష్ఫలమయ్యాయి. దానితో మతిస్థిరంలేక ఈ త్రాగుడు అలవాటు చేసుకున్నారు.'

'ఇంత విజ్ఞానం, వివేకం, గుండె ధైర్యం కల్గిన వ్యక్తి నాలుగేళ్ళయినా తేరుకోలేక పోవటమా?'

'అదొక్కటే కారణంకాదు మాస్టారూ! తర్వాత మరికొన్ని దుస్సంఘటనలు జరి గాయి. అప్పటి ప్రెసిడెంటు కామేశం గారితో ఆయనకు మంచి స్నేహముంది. ఆయన అనుయాయుల బలవంతం పై మళ్ళీ పెళ్ళి కొప్పుకున్నారు. వయస్సుమించి పోలేదు. ఇంట్లో అంతా చిన్నపిల్లలం. ఆడదిక్కు ఉండాలని అంతా ఆశించారు. త్రాగుడునుంచి ఆయన్ను కాపాడుకోవాలని

మా బొమ్మ తొవ్వ తీయ పడింది, అంతా సవ్యంగానే జరిగింది. కాని, పిన్ని మాయింటికి వచ్చేవరకు ఈ పెళ్ళిపెద్దలు చేసిన మోసమేమిటో తెలియలేదు. మాటాడ నోచుకోని భార్యనా ఆయన కోరుకున్నది?...'

'అంటే ?'

'మీకింకా తెలియదా! మా పిన్ని మూగది...'

'అయ్యో, పాపం!'

'అపురూపమైన అందం, అమృతం లాంటి హృదయం ఇచ్చిన దేవుడు నోరు మూసేయటం ఎంత బాధాకరం?...'


'అవును నిజం...ఆమె కళ్ళల్లోని బాధ మీ నాన్నగారి ప్రవర్తన వల్లనే అనుకున్నాను.'

'అదీ ఒక కారణమే! తెల్సుకునే హృదయముండాలి కాని ఆమె కళ్ళు చెప్పే భాష చాలు. ఆమె బాధ చూస్తుంటే నా కడుపు తరుక్కుపోతుంది. మనమేది చెప్పినా అర్థం చేసుకోగలదు. ఆయన ఆదరణ ఉంటే ఆమె ఇంతగా విలపించక పోను. ఆయన ఆవేదన కంతేలేదిక...'

'జీవితంతో రాజీ పడలేకపోతే కష్టమే మరి.'

'అదెలా సాధ్యం! ప్రాణానికి ప్రాణమయిన అమ్మ దూరమైంది. నవ చైతన్యం కలిగిస్తుందనుకున్న పిన్ని పలకాడ నోచుకోనిది. పిన్ని వచ్చిన కొన్నాళ్ళకే బొమ్మకి జబ్బుచేసి ఆజ్వరంలో చెవులు గిళ్ళడిపోయాయి. ఆ రోజుల్లోనే కాలవలో జతగాళ్ళతో ఈత లాడటానికి వెళ్ళిన మా పెద్ద తమ్ముడు మరి తిరిగి రాలేదు...ఇంతకన్న మరేం కావాలి—ఉండే ధైర్యం చెదిరిపోటానికి ? డాక్టరని చెప్పి మృత్యువు, అనారోగ్యం మా యిల్లు విడిచి పోగలిగాయా? దైవమిచ్చిన శాపాలివి మాకు...' ఆపైన దుఃఖంతో నాగొంతు పూడిపోయింది. చెక్కిళ్ళపై కన్నీటి ధార చూసుకోనలేదు. అలా ఎంతసేపు కిటికీ వూచలు పట్టుకొని మౌనంగా దుఃఖిస్తూ ఉండిపోయానో తెలియదు.

'ఒకరు వినలేరు. మరొకరు మాట్లాడలేరు ఈ రెండూ చేయగలిగి భయంతో బాధతో తన్నుతాను క్రూరంగా హింసించుకుంటున్న దింకొకరు, ఇంత విచిత్ర



ప్రవాహంలో చిక్కుకొని కూడ అదే చిరునవ్వుతో ఇందరిని అలరిస్తున్న నిన్ను ఎట్లా అభినందించాలో తెలియటంలేదు రాధా! స్త్రీ తనకోసమే కాదు మరికొందరి కోసం జీవించగలదన్నది కొందరి విషయంలోనే నిజం!'

నిన్ను చూసి నేను జాలిపడేదాన్ని ఇంత వరకు. ఇప్పుడు ఆనంద పారవశ్యంలో మనస్సు నృత్యమే చేసింది.

'కష్టాలంటే ఇవి. మనుష్యులంటే వీళ్ళు. మమతలంటే ఇవి. జీవితమంటే జీవించటానికే నన్న సత్యం వీళ్ళకే తెలుసు...అని ఇప్పుడిప్పుడే నాకు కనువిప్పు కల్గుతోంది. ఆ కన్నీళ్ళు తుడుచుకో రాధా! నీలాంటి పిల్లలు ఎప్పుడూ నవ్వుతూ ఉండాలి. కనులున్నది నవ్వి నవ్వించటానికి కాని కన్నీరు కురిపించటానికి కాదు. మనసున్నది మమతలతో మధురమయం చేసుకోటానికి కాని వేదనాగ్ని రగిలించటానికికాదు. కష్టాలు కలకాలం ఉండవు. ఎవరో ఒకర్ని మంచివాళ్ళని ఆశ్రయించుకొని ఉండటం వాటికి సరదా. కొన్నాళ్ళకి విడుచుకొని మంచితనాన్ని ఆపైన భరించలేక భయపడి అవే పారిపోతాయి...'

నాకు నవ్వు వచ్చింది.

'...కిలకిలా నవ్వటం కూడ అందరికీ చేతకాదు.'

'భలే మాట్లాడతారే మీరు!'

'భోజరాజును చూస్తే కాళిదాసుకు కవిత్వం పుట్టుకు వచ్చేదట! అందరి స్నేహంలోను మంచి భావాలు రావు. కొందరి సాన్నిహిత్యమే మనస్సును మంచిగా పలికిస్తుంది...'

ముంచుకొస్తున్న సిగ్గుని మబ్బుల్ని తప్పించుకోవాలని వృథాయత్నం చేస్తూ 'మీకు విశ్రాంతి కావాలి మాస్టారూ!...' అని గ్లాసు తీసుకొని బయటకు వచ్చేసాను.

ఆ సాయంత్రం కాని నాన్నగారు రాలేదు. రాగానే విషయం చెప్పాను. అతన్ని పరీక్షించారు. రెండుసార్లు పిలిచినా అతను స్పృహలోకి రాలేదు. కళ్ళు మగతగా ఉన్నాయి. ఏదో భయంతో నా గుండె దడ దడ లాడింది.

అతని ఒంటిమీద చేయివేస్తూ '...మాస్టారుగారూ!' అని నాన్నగారు పిలు

రాగధార

స్తుంటే సిగ్గుతో చిక్కి చచ్చిపోయాను. ఇన్నాళ్ళకా అతని పేరు తెలుసుకుంటున్నది?

'అమ్మడూ! జ్వరం తీవ్రంగా ఉంది. ఇంజక్షన్ ఇస్తాను. వేన్నీళ్ళు పెట్టు...'

ఉలిక్కిపడ్డాను. దిగులుగా వంటింట అడుగుపెట్టాను.

* * *

వారంరోజులకి కాని అతని జ్వరం తగ్గుముఖం పట్టలేదు. అతని పలవరింతలతో నా గుండె లవిసి పోయాయి, ఆ మాటల కొక అర్థము— వరస లేవు. సమన్వయం చేసుకోవాలని వృథా ప్రయత్నం చేసాను. అతని తల్లి దండ్రులెవరో— వివరాలేమిటో తెలియదు. ముందే అడగనందుకు కించపడ్డాను.

అతను కళ్ళు తెరిచే వరకు నా మనస్సు మనస్సులో లేదు. స్కూలు నుంచి మాస్టర్లు... స్కూలుపిల్లలు వచ్చి చూసి వెళ్ళారు. వాళ్ళనుంచి అతని వివరాలు తెలుసుకోవాలనుకున్నాను.

'ఇంట్లో ఉన్న మీకే తెలియనిది మాకేం తెలుస్తాయ'ని ఎవరైనా అంటే— నా ఆలోచనకి నాకే సిగ్గేసింది.

ఏమయితేనేం — అతనికి జ్వరం తగ్గుముఖం పట్టింది, నాలోని గుబులు తిరుగుముఖం పట్టింది.

'మీ స్థితి చూసి హడలిపోయాను. మీ వాళ్ళకెవరికయినా కబురు చేసి రప్పించటానికి లేకుండా చేసారు మీరు. దిక్కూ మొక్కూ లేనిచోట...'

'...ఇంతకన్న కడుపులో పెట్టుకొని ఆదరించే ఆత్మీయులు నాకెవ్వరూ లేరు రాధా! ఇది మొండి ఘటం! అంత త్వరగా చావదు.'

నా మనస్సు చివుక్కుమంది. 'చావటం మన చేతుల్లో లేదు.'

'బ్రతకటమే కాదు — బ్రతికించటం కూడ కొందరి చేతుల్లోనే వుంది తెలుసా?'

అతని ముఖం చూసి ఫక్కున నవ్వాను. ఇంతలోనే గంభీరత నెరువు తెచ్చుకొని '...జీవితం మీద ఇంత నిర్లక్ష్యం పనికి రాదు.' అన్నాను.

'...అమృతం చిలికించే హృదయం పక్కన ఉంటే మాటల్కి మోరకు మరింత నిర్లక్ష్యం పెరుగుతుంది!'

'అంటే ?'

'నీకు బాగా తెలుసు.'

'ఉహూ !'

'నిజాన్ని ఆడవాళ్ళెప్పుడూ ఓపట్టాన ఒప్పుకోరు.'

'పాపం...'

'కాదు. అది వారి పుణ్యం !'

నాకు నవ్వు వచ్చింది. 'ఇలాంటి మొండితనం విసుగెత్తిస్తుంది,'

'ఆ ప్రక్కనే జాలి ఉందిగా! వర్రీ లేదు. జాలిలో విసుగు విరిగి కరిగి తరిగి పోతుంది.'

'మాటలతో దాటవేయకండి. మీరిలా నిర్లక్ష్యం పెంచుకోటానికి తగినంత కారణ ముండాలని నా ఊహ...'

అంతవరకు తెలిపూల వెన్నెలలా వెలిగి పోతున్న అతని ముఖంలో విషాద మేఘాలెన్నో అలముకున్నాయి. అతడు తల త్రిప్పుకొని ఎటో చూడసాగాడు. జవాబు దొరకని నా ప్రశ్న ప్రశ్నగామాత్రం మిగిలిపోయింది. మౌనాన్ని భరించటం మరింత కష్టం. అందుకనే లేనిపోని మాటలతో మనం సంభాషణ మరింత పెంచుతూంటాము.

ఇంతలో ఏదో గుర్తుకు వచ్చింది.

'...మీ స్థితి చూసాక మీ అనుజ్ఞ లేకుండా మీయింటి ఎడ్రసుకోసం మీ పెట్టెలు, పుస్తకాలు అన్నీ వెదికాను...'

'...క్షమించవల్సినంత తప్పేమీకాదది.' అన్నాడతను చిన్నగా నవ్వు తెచ్చుకుంటూ.

'అయినా నా ప్రయత్నం ఫలించలేదు. ఇలా మీరు మీ ఎడ్రసు ఏమీ వ్రాసుకోకుండా ... నాకు, మీ పద్ధతేం అర్థం కావటంలేదు...'

'కొందరి గురించి కొన్ని తెలుసుకోకుండా ఉండటమే మంచిది రాధా!'

'అలాగే కొన్ని తెలుసుకోక పోవటంలో ఎక్కువ నష్టంకూడ ఉంటుంది.'

'కావచ్చు. నీకిప్పటికే ఆలోచించవల్సినవి — ఆచరించ వల్సినవి అనేకం వున్నాయి. నా గొడవతో మరింత బుర్ర వేడెక్కటంతప్ప ప్రయోజన మేముంది?'

'అలా అనకండి. మన ఆలోచనలు ఆపాలన్నా ఆగవు. మీ స్థితి చూసాక మీ గురించి తెల్సుకోవాలని...'

'...సరే, సమయం వచ్చినప్పుడు అన్నీ

నేనే చెప్తాను. ఇంతకంటె నా గురించి ఆలోచించి ఏమీ బాధ పడకు. ఈ స్నేహంలోని మాధుర్యాన్ని ఆశించి తృప్తిపడుతున్న నన్ను గతం వైపు చూడనీకు. ఈ వర్తమానమే ఎంతో హాయిగా ఉంది నాకు...' మత్తుతో కనురెప్పలు బరువెక్కినట్లు అతను మూసుకున్నాడు.

ముంచుకొచ్చిన సిగ్గేదో నన్నక్కడ నిలవనీయకుండ చేసింది.

* * *

మరో రెండు రోజులు గడిచాయి. అతనికి పథ్యం వంటబట్టింది. మామూలు మనిషి ఆకారం వచ్చింది. స్కూలుకు వెళ్లగల శక్తిమాత్రం చేకూరలేదు.

'మీ రాజా చెప్పాడు. స్కూలు ఫైనలు చదువుతూ మధ్యలో మానేసావుట...ఎందు

రాగధార

కని రాధా!.

'ఏమని చెప్పను?' నాలో అనుకున్నట్లు అన్నాను.

'చెప్పకూడని విషయమా? అయితే వద్దు.'

'అహఁ! అందుకుకాదు. క్రమశిక్షణ లేనిచోట చదువు ఎలా సాధ్యం? నా మంచితనాన్ని లోకువగా తీసుకొని నా పోట్బులో పెట్టి ఓ ప్రేమలేఖ అందజేశాడు ఓ అబ్బాయి. ఒళ్లు తెలియని కోపంలో అది హెడ్మాస్టారికి చూపించాను. అతన్ని డిబార్ చేసారు. కలవారి అబ్బాయి. ఎంతకైనా తగును. నాపై చెడుప్రచారం చేసాడు. తండ్రి హెడ్మాస్టార్ని ఈవూరినుంచి బదిలీ చేయించాడు. అప్పటికీ ఆ అబ్బాయి కసి తీరలేదు. నా ప్రవర్తనపై కథల్ని నలుగురిలోను అవమానం చేయటం మొదలు పెట్టాడు. స్కూలు రికార్డులు మాపు చేయించారు. డబ్బు న్యాయం నోరు మూసింది. అతన్ని మళ్లీ స్కూల్లో చేర్చుకున్నారు. కాని, ఆత్మాభిమానం చంపుకోలేని నేను స్కూలు మానేసాను...'

'ఒకరి గురించికాదుగా మనం చదువుకునేది!'

'మనకోసమే కావచ్చు. కాని, అటువంటిచోట అది ఎలా సాధ్యం?'

'ఒకరిని అసహ్యించుకోవటమే వీరికి వాళ్లు చేయగల్గిన ప్రతిక్రియ'

'క్రమశిక్షణలేని చదువు చదువేకాదు. అంతకంటె మొద్దులా పడి వుండటం మంచిది.'

'...మన బాధలో మనకలా అనిపించటం సహజం. అంతమాత్రాన మన కోరికలనే శాశ్వతంగా చంపుకుంటామా?'

'అయినా, గతాన్ని త్రవ్వుకోవాలని లేదు నాకు'

'అయితే, ఇక చదువుకునే ఉద్దేశ్యమే లేదా నీకు?'

'ఆశయమైతే ఉంది. అవకాశమే లేదు.'

'ఎందుకులేదు? ఇంటి దగ్గరే ఉండి ప్రవేటుగా చదువుకోవచ్చు. అలా గ్రాడ్యుయేట్సు అయిన వాళ్ళెందర్నో నే నెరుగుదును...'

'కాని, దారిచూపించే వాళ్ళుండాలి కదా? ఈ బాధ్యతలతో ఇల్లువదలి వెళ్ళే అవకాశం లేదు.'


'ఎన్నాళ్లయింది స్కూలుమానేసి?'

'మూడేళ్లు దాటింది.'

'జరిగినదానికి బాధపడకు. మగవాడిని చదివిస్తే ఒక్కడినేనని — ఆడపిల్లని చదివిస్తే ఇంటిల్లపాదిని చదివించినట్లేనని పెద్దలు చెప్తారు. వచ్చే పరీక్షలకి చదువు. మెట్రిక్కి వెడితే మంచిది. తెలియనిది నేను చెప్తాను...'

అనూహ్యమైన భావావేశంలో ఒళ్ళంతా పులకరెత్తింది. 'నాలో ఆశలు పెంచుతున్నారు మీరు.'

'ఆశాజ్యోతి ఎప్పుడూ మినుకు మినుకుమంటూనే ఉంటుంది రాధా! అయినా జీవనజ్యోతిని దేదీప్యమానంగా వెలిగించేదదే!... ఇన్నాళ్లకి ఒక మంచిపని చేసే



అవకాశం నాకు కల్గింది'

'తప్పకుండా చదువుకుంటాను.' అన్నాను. అతని చూపుల్లో తృప్తి ఉంది. ఆ తృప్తి నరతన సందేశం ఉంది.

కిటికీలోంచి రివ్వున గాలి వీచింది. నా ముంగుర్లని ముఖం మీదకి మృదువుగా తోసింది.

అతని ముఖంపై చిరునవ్వులు చిందులు వేసాయి. నా గుండెల్లో విపంచికలు శృతులు చేసుకున్నాయి. ఆ పరవశంలో నన్ను నేనే మరచిపోయేలా ఉన్నాను.

వెనుదిరిగిన నాకు అతని చూపుల భావాలు ఏవో అర్థాలు చెప్పటం సనసన్నగా వినిపించింది. అవి తెలిసినా వెనక్కి వెళ్లే ధైర్యం లేదు నాకు. అవును! నేను ఆడ పిల్లని...

* * *

ఆ సాయంత్రం అతను బయటకు బయలుదేరాడు. అది చూసి, 'కొన్నాళ్ల దాకా అట్టా చేలగట్ల వైపు షికారు వెళ్ళద్దని ఆ అబ్బాయికి చెప్పవే! ఒంటికి మంచిది కాదు...' అని తరిమింది బామ్మ.

అతను గుమ్మం మెట్లు దిగుతుండగా వెనక నుంచి పిలిచాను. 'మాస్టారూ! ఒక్క మాట—'

ఆ కళ్లల్లో వింతైన కాంతి. ప్రశ్నార్థకంగా చూసాడతను.

'బామ్మ అప్పుడే ఆరు బయట తిరగటం మంచిది కాదని చెప్పమంది.'

'ఒక్కడినీ ఏం చేసేది గదిలో కూర్చొని.'

'ఏకాంతమంటే మీకిష్టమేగా?'

'మోతాదు మించితే ఏదయినా మొహం మొత్తుతుంది. మధ్యాహ్నం నుంచి పలకరించేవాళ్లు లేక...పిచ్చెత్తినట్టుగా ఉంది.'

కావాలని మారాం చేస్తున్నట్టు అతని కళ్ళు చెప్పకనే చెపుతున్నాయి. నన్నిక నొవ్వ చేయటం ఇష్టం లేనట్టు తల త్రిప్పేసుకున్నాడు. 'కాళ్ళల్లోకి సత్తువ చేరింది. కొంచెం గుడులు వదిలించుకుంటే దిగులు తీరుతుంది. దేవటి నుంచి మళ్ళీ స్కూలు కదా!...'

'త్వరగా వచ్చేయండి' అన్నాను టక్కున.

'ఏం?' అతను నవ్వుతున్నాడు.

'ఏ...మీలేదు. వేళపట్టున తింటే కొన్నాళ్లకి మనిషిరూపం వస్తుందని...' తడబాటు నణచుకున్నాను.

'ఏం? ఇప్పుడు మనిషిలా లేనా?... బయట నన్నుచూసి వింత జంతువు అనుకోరుకదా!'

'నవ్వులాటకి కాదుకాని — మీరు బాగా చిక్కిపోయారు...తెలుసా!'

'అలాగా!...అంతపరీక్షగా చూస్తున్నావా నన్ను...'

ముంచుకొస్తున్న సిగ్గును మూటకట్టి, 'ఆ! డాక్టరు రోగిని పరీక్షగానే చూడాలి...' అన్నాను.

'చిత్తం...డాక్టర్! మీ అనుమతితో అలా పోయి వచ్చేదా?'

'అవశ్యం. అలాగే వెళ్లిరండి. కాని గంట మాత్రమే గడువు.'


'అబ్బ, డాక్టర్లు...కఠినులు.'

'అవును. మొండివాళ్లపట్ల డాక్టర్లట్లానే ఉండాలి'

అతను చక్కగా నవ్వాడు. ఆ విశాల ఫాలభాగంపై నరాలు ఉప్పొంగి వింతకాంతి నిచ్చాయి. 'మరి పోయిరానా?'

తల పంకించాను. ఆ ఆజానుబాహు విగ్రహాన్ని కనుమరుగయేవరకు చూస్తూ అలానే అచేతనంగా నిలబడిపోయాను.

అమ్మపోయిన తరువాత ఈ నాల్గు సంవత్సరాలలోను కాదంటే పదిమంది మా యింట్లో ఉండివెళ్ళారు. అందులో

షిమ్మీ

వలుచటి ప్రాకుల్లోకిగాని, ప్రాకు లేకుండా వుంచకుండా వాడటానిగ్గాని ఈ షిమ్మీ, పనికొస్తుంది. సాధారణంగా పైన వేసుకునే ప్రాకుకన్న రెండంగుళాలు పొట్టిగా కుట్టుకోవాలి. కుట్టటం చాలా తేలిక. దీనిక్కావలసినది ఒంకీలేసు—నాలుగు బటన్సు బట్టమాత్రం లేతరంగులు గాని తెలుపుగాని, కొంచెం మందపాటిది వాడుకుందుకు బాగుంటుంది.


*ఆరు అంగుళాలు బాడీ పొడవు. నాలుగంగుళాల బెల్టు, (ఒకటిన్నరంగుళాల వెడల్పుబెల్టు) పనిమిదంగుళాల స్కర్ట్‌పొడవు, ఒకటిన్నర మీటరు చుట్టుకొలత వుండాలి స్కర్ట్. స్కర్ట్ దిగువన చేతుల చుట్టూ మెడచుట్టూ వంకీలేసు అడుగునుండి అతుక్కురావాలి.

A. బొమ్మలో మాదిరిగా వున్న బట్టకి బొమ్మలోవున్న విధంగా డ్రాయింగ్‌వేసి కత్తిరించుకుని, B. బొమ్మలోకూడ అలాగే కత్తిరించుకుని ఈ రెంటిని 1½ అం – వెడల్పున్న (రెండుమడతలుండాలి బెల్టు) బెల్టుకి అటు పక్క ఇటు పక్క అతుక్కుంటే అప్పటికది బాడీ అవుతుంది. ఇలా కలిపేక– చేతికత్తిరింపుని మెడ కత్తిరింపుని దాన్నే మడిచి కుట్టటంగాని వేరే ముక్కఅతికి మడిచి కుట్టటంగాని చెయ్యవచ్చును.

వెనకవక్క మెడ కత్తిరింపువుండదు. ఎదురుమాత్రం V ఆకారంలో కత్తిరించుకుంటే బాగుంటుంది. అంచులు మడిచాకే లేసతకాలి. వెనుక పక్కన మామూలు ప్రాకులకు వలెనే, బటన్సు పట్టీ అతకాలి.

స్కర్ట్‌ని కొంచెం దూరంగా పెద్ద మడతలతో ఫ్రిల్, పెడితే సరిపోతుంది. లేసులతక్కపోతే బాగా వుండదు. బాడీ పొడుగు ఎంతో స్కర్ట్ పొడవుకూడ అంతే చేసుకుంటూ హెచ్చుతగ్గుల్లో కుట్టుకోవచ్చు (బాడీలో బెల్టుకూడ కలిపి (వాశాను) బాడీ దిగువను జాకెట్‌కి వేసినట్టు (కొంచెం సన్నగా) డాట్సు వెయ్యాలి.

—కృష్ణప్రియ



రాగధార

వికిలిచేష్టలుచేసి బుద్ధితెప్పించుకొని పోయిన వాళ్ళు కొంతమంది అయితే, అసలాయింట్లో మరొకళ్ళు ఉన్నారన్న భావనేలేని జడులు కొంతమంది. ఒక్కళ్ళూ వట్టుమని మూడు నెలలు లేరు. నాన్నగార్కి భయపడిపోయి వాళ్ళు ఏదో ఒక వంకతో తప్పించుకు పోయారు. మా గురించి చెడు ప్రచారం చేసినవాళ్ళుకూడ లేకపోలేదు.

కాని, అతను మాయింటికి వచ్చాక అంతా క్రొత్తగా ఉంది, ప్రతి సంఘటన వరికొత్తగా జరుగుతోంది. ప్రతి అనుభూతిని మధురతరం చేస్తోంది. నాలో ఏదో సంచలనం, అతని సమక్షంలో ఏదో పరవశం— ఇదంతా అర్థంకాని పిచ్చితనంలా తయారయింది.

అతని కళ్ళల్లోకి చూడాలంటే సిగ్గుతో రెప్పలు బరువెక్కిపోతాయి. అతను భావయుక్తంగా మాట్లాడుతుంటే ఆ కళ్ళల్లోకి చూడాలని అనిపిస్తుంది. ఏమిటీ ఉన్మాదం? ఇదంతా భ్రమా? లేక నిజమైన సంచలనమా?

ఎంతమందితో సంవత్సరాలుగా పరిచయంలేదు? కాని, ఏ ఒక్కరు నన్నింతగా ఎందుకు కదలించలేకపోయారు?

నా ప్రాణసఖి మాధవితోటి అనుబంధమే మధురతరమైనది అని ఇంతవరకు అనుకునేదాన్ని. ఆమె సమక్షంలోనే అన్ని కష్టాలు, అన్నిబాధలు మర్చిపోగలనను కునేదాన్ని. ఆమె కబురతోటే జీవితంలో పోగొట్టుకున్న మధురక్షణాల్ని తిరిగి తెచ్చుకోగలననుకునే దాన్ని...కాని, మరొక వ్యక్తి మాధవిని మరపించగలడని ఇప్పుడిప్పుడే అనిపిస్తోంది. మనస్సును ఆకర్షించగలడని అనుభవమౌతోంది. మనపై మనకు కొన్ని విషయాలలోనయినా నిగ్రహం లేకుండ చేయగలశక్తి ఇతరుల చేతుల్లో ఉందని తెలిసి వస్తోంది. జీవితంలో క్రొత్త అధ్యాయం కాబోలు!

'అనుక్షణం నా మనస్సులో, నా ఆలోచనల్లో, నా అనుభూతుల్లో ప్రవేశించే అధికారం మీకెవరిచ్చారు?' అని అడగాలని వుంది. ఈ ప్రశ్నకేమని జవాబు చెపుతాడు? అసలా ప్రశ్న ముఖాముఖిగా అడగటం ఎలా? – నాకు నవ్వు వచ్చింది.

ఏదో స్పర్శకు ఉలిక్కి పడ్డాను.

'ఏమిటే అనూ! ఒక్కదానివీ అలా ఏలో నీవు మాట్లాడేసుకుంటూ నవ్వుకుంటున్నావు? కొంపతీసి గుండెకాయ ఎక్కడైనా జారవిడుచుకున్నావా ఏం?'

మాధవి మాటలు మరింత వెర్రెత్తించాయి నన్ను; ఎప్పుడొచ్చిందో హఠాత్తుగా నన్ను పట్టుకుంది.

'ఛీ! పోవే—అంత పిటుగుండే కాదు. ది,'

నా బుగ్గలు నొక్కుతూ అంది మాధవి. '... నువ్వు ఎంత దాచినా నీ బుగ్గల్లో గులాబీలు చెప్పకనే చెప్తున్నాయి.'

'అలానే అంటూ ఉంది. నాచేయి కొట్టకనే కోదుతుంది...'

'నువ్వు నిజం చెప్పలేకాని, నీ చేత దెబ్బలు తినటానికొచ్చాడా నేను పిచ్చమేనే!'

'నీ గొడవ కట్టిపెట్టి ఊరినుంచి ఎప్పుడూడివచ్చావో చెప్పు.'

'గంట క్రితం ఇంట్లోను—ఇప్పుడిప్పుడే ఇక్కడాను.'

కాలేజీలో చేరి మాధవి మారలేదు. అదే చిలిపితనం, అదే ఆప్యాయత—నేనూ చదువుకుని వుంటే...కాలేజీలో చేరేదాన్నా? ఏమో! ఎలా పిలివుతుంది? ఇలాంటి శావ గ్రస్తుల్ని యింట్లో వదలి నా చదువు కోనం పట్నం వెళ్లివుండే దాన్నా? ఉహూ! అదెప్పటికీ జరిగి ఉండేదికాదు. నాకు చదువు ఒక్కటే ముఖ్యంకాదు. వేరే బాధ్యతలున్నాయి. వేరే బరువులున్నాయి. అవి నిర్వర్తించుకున్నాకనే నాకై నేనేమి చేసుకున్నా. ఇలా...నేననుకోని రోజు లేదు. అందుకనే పైకి చదువుకోలేక పోయానన్న నా బాధ అణగారి పోయింది.

ఇంతలో బొమ్మ అక్కడికి వచ్చింది. మాధవి అంటే ఆవిడ కమితమైన ప్రేమ. ఆవిడంటే దానికి అంతులేని జాలి. వాళ్లిద్దరూ కబుర్లలో పడ్డారు. మొట్ట మొదటిసారిగా నేను వాళ్ల సంభాషణలో పాల్గొనలేక పోయాను!

'మాధవి త్వ ర గా వె ళ్ళి పో తే బాగుండును.'

ఇలా అని జీవితంలో ఎప్పుడూ అనుకో లేదు నేను. అతడు ఏ క్షణంలోనయినా తిరిగి వచ్చేస్తాడేమో! అప్పుడు నా ప్రవర్తన ఎలా ఉంటుందో? మాధవి ఆవులిస్తే ప్రేవులు లెక్కపెట్టే అల్లరిపిల్ల— దాని పరిహాసాలకి, అల్లరికి తట్టుకోగలనా?

మాధవి చాల చీకటిపడేవరకు అక్కడే వుంది. అంతసేపు నేను ముళ్ల మీదున్నట్లు కూర్చున్నాను. ఆమె అటు వెళ్లిపోయింది — అతను ఇలా వచ్చాడు. నా మనస్సు తేలికపడింది.

మరో అవకాశం రాకుండానే శలవు అయిపోవటంతో మాధవి పట్నం వెళ్లి పోయింది. తిరిగి నా ఊ హా గా న ం లో నేనొంటరినై పోయాను.

(ఇంకా ఉంది)



శ్రీపతి

కౌశీనాథ ఓ కాశీనాథ

[illegible]

'అమ్మాయ్ బావ వచ్చాడు కాళ్ళకి నీళ్ళియ్యి' అని కేక వేసింది కామాక్షమ్మ.

వర్ధని కొంచెం తటపటాయించింది. బావిలో నీళ్ళ తోడి చెంబుతో తెచ్చి గుమ్మం పక్కన పెట్టి బావ వచ్చేటప్పటికి తప్పు కుంది.

శ్రీపతి కాళ్ళు కడుక్కుని చెంబు కింద పెడుతూ వర్ధని అక్కడ ఉందేమోనని చూశాడు. వర్ధని కనబడలేదుగాని ఆ అమ్మాయి వోణీ అంచు కనిపించింది. చేతులు కదిలితే గాజులు చప్పుడవు తున్నాయి.

'ఏమిటది చేతిలో' అన్నారు జగన్నాధం గారు ఆయన శ్రీపతికి వరసకి మేనమామ. వర్ధని తండ్రి.

'ఫొటోలు, అప్లికేషనులో ఫొటో కావా అన్నారు' అన్నాడు.

'ఎప్పుడు పంపించాలి?'

'ఇవాళ పంపిస్తేనే టైముకి అందు తుంది'

'సరే ఆలస్యం చెయ్యకుండా పంపించు' అనేసి ఆయన బయటికి వెళ్ళిపోయాడు.

వర్ధనికి బావ ఫొటో చూడాలని మనసయింది. చెల్లెలు సీతని పిలిచి 'బావ నడిగి ఫొటో పట్టుకు రావే' అంది. సీత శ్రీపతి దగ్గరకి వెళ్ళేసరికి శ్రీపతి ఫొటో చూస్తున్నాడు.

ఫొటో బాగానే వచ్చింది. కాని నుదుటి పైన జుట్టులో క్రుడి బాగా పడలేదు. మామూలుగా చూడటానికి నుడి దగ్గర జుట్టు వంపు తిరిగి చాలా బాగుంటుంది. శ్రీపతి అందగాడు కాబట్టి ఇంకా రాణి స్తుంది.

'అక్క ఫొటో యిమ్మంది' అంది సీత.

"మీ అక్కనే రమ్మను. వస్తే యిస్తాను" అన్నాడు శ్రీపతి. సీత లోపలికి వెళ్ళి అర క్షణంలో తిరిగి వచ్చింది, 'ఇవ్వకపోతే దాచుకోమను' అంది అక్కయ్య' అంది.

శ్రీపతి నవ్వుకున్నాడు.

వర్ధని కనిపిస్తే పలకరిద్దామనుకున్న శ్రీపతికి ఆరోజల్లా ఆమె కనబడలేదు. సీతే ఒకటికి పదిసార్లు కనిపించింది.

ఆ సాయంత్రం పందిరి దగ్గర బంతి మొక్కదగ్గర సీత ఆడుకుంటోంటే 'నాకో బంతిపువ్వు కోసియ్యి' అన్నాడు శ్రీపతి [illegible]

[illegible]

'అమ్మో ఆశ' అంది సీత చేతులు తిప్పుకుంటూ.

'ఊరికే. కాసేపు వాసన చూసుకుని ఇచ్చేస్తాను' అన్నాడు.

చిన్న పిల్లలకి ఇలాంటి విషయాలలో పంతం. అందులోనూ ఆ బంతి మొక్కకి అదేరోజూ నీళ్ళుపోసింది.

సీత ఇవ్వనన్నాక శ్రీపతి నవ్వి లోపలికి వెళ్ళిపోయాడు. కాసేపాగి బజారు వెడదామని బట్టలు వేసుకుంటోంటే సీత వచ్చింది.

'ఇదిగో పూలు' అంటూ నాలుగు బంతి పూలు టేబులుమీద పెట్టింది.

'ఇందాక ఇవ్వనన్నావుగా' అన్నాడు శ్రీపతి కుతూహలంగా.

'మా అక్క ఇమ్మంది' అంది సీత నవ్వి.

శ్రీపతి పెదవులమీదికి చిరునవ్వు వచ్చింది. హృదయం అంతటా వెన్నెల పరుచుకుంది. ఆ నాలుగు బంతిపూలు వాసన చూస్తూంటే ఒళ్ళు తేలిపోతున్నట్లనిపించింది. 'శ్రీపతి—వర్ధని' రాశాడు దినపత్రికమీద. మళ్ళీ ఎవరైనా చూస్తారని కొట్టేశాడు.

* * *

ఆ సాయంత్రం లక్ష్మీపురం ప్రయాణం పెట్టుకున్నాడు శ్రీపతి. ఆ సంగతి మామయ్యతో చెబుతోంటే విని తలుపుకు దగ్గరగా జరిగింది వర్ధని.

'మీ అమ్మదగ్గర ఎన్నాళ్ళుంటావు?' అన్నాడు జగన్నాథంగారు.

'నెల అయినా ఉంటాను'

'అక్కడినుంచి ఏ పిన్ని దగ్గరకికూడా వెళతావా?' అంది కామాక్షమ్మ. ఆ గొంతులో చిరాకు, అసహనం ఉన్నాయి పుల్లవిరిచినట్టు ఉంది ఆ మాట.

'ఆ' అన్నాడు శ్రీపతి

అత్తయ్య ముఖకవళికలు గమనించి కొంచెం బాధ పడ్డాడు. అందుకే ఆమె దగ్గర శ్రీపతికి చనువు తక్కువ.

ఆవిడ తీరే అంత. భర్త మెతక దనం కొంత కారణం. ఆ యింట్లో ఆవిడదే ఆధిపత్యం. ఆమె యిష్టమే చెల్లుతుంది సామాన్యంగా. కొన్ని కొన్ని సమయాలలో ఆయన ఎదురు తిరుగుతాడు. అయితే ఆయనలో ఎప్పుడు ఆ చలనం వస్తుందో చెప్పలేము.

ఆవిడ ఫక్తు 'డబ్బు మనిషి' బంధుత్వాలకి అంతగా విలువ యివ్వదు. లలితమ్మనీ, అనసూయమ్మనీ కూడా ఒక్కలాంటి మమతతోటే చూసుకుంటూ, ఎవరికి బాధ కలిగినా విలవిలలాడే ఆప్యాయత పెంచుకున్నాడని కోపం.

తల్లి గుణాలేవీ కూతురికి రాలేదు. వర్ధని గుణవంతురాలు. స్వచ్ఛమైన స్ఫటికం లాంటి రూపం వర్ధనిది. పదహారేళ్ళ వయసు. శ్రీపతికి నచ్చే అందం. ఒక్కొక్కసారి చీరలూ, ఒక్కొక్కసారి వోణీలూ కడుతుంది.

వర్ధనికి బావ శ్రీపతిని చేసుకోవాలని కోరిక. కామాక్షమ్మకిమాత్రం కూతుర్ని తన అన్నయ్య కొడుక్కి ఇవ్వాలని కోరిక. అతను బాగా స్థితిమంతుడు,

శ్రీపతి బట్టలు సర్దుకుంటోంటే పట్టాలి చప్పుడయి వెనక్కి తిరిగిచూశాడు. వర్ధని గుమ్మం దగ్గర తలుపుకానుకుని నిలబడి ఉంది.

'లోపలికి రా' అన్నాడు శ్రీపతి. మెల్లిగా లోపలికి వచ్చింది.

'సాయంత్రం వెడుతున్నావా?' అంది వోణీ కొంగు వేలికి చుట్టుకుంటూ.

'ఊ'

'మళ్ళీ ఎప్పుడు రావటం?'

'ఒక నెల రోజులు పడుతుంది.'

వర్ధని మాట్లాడ లేదు కాలి బొటన వేలితో నేలనిరాస్తూ కూర్చుంది.

'ఫోటో చూస్తావా?' అన్నాడు శ్రీపతి ఆమెని ఉత్సాహ పరచడానికి. వర్ధని తల వూపింది. పెట్లోంచిఫోటోలు పెట్టినకవరు తీశాడు అందులో రెండు ఫోటోలున్నాయి.

'మూడు కాపీలు తీయించుకున్నాను ఒకటి అప్లికేషనులో పెట్టాను' అన్నాడు

'నాకు ఒకటియ్యి' అంది,వర్ధని బిడియ పడుతూ.

'ఇంకోసారిస్తాలే'

'ఇప్పుడివ్వవా నీకేం?'

'ఒకటి మా అమ్మకివ్వాలి'

'రెండోది?'

'మా అమ్మకివ్వాలి'

అతనికి ఇద్దరు అమ్మలని తెలుసు కాబట్టి సరేనంది వర్ధని.

శ్రీపతి తాతగారు శ్రీపతి-రిది లేని కుటుంబం కాకపోయినా అంతగా బాగా బతికిన కుటుంబం కూడాకాదు. ఆయనకి మగ సంతానంలేదు. ఇద్దరు కూతుళ్ళు అనసూయ లలిత, వయస్సులో వాళ్ళిద్దరికీ ఏడాదిన్నరే తేడా ఉన్నా వాళ్ళిద్దరిదీ ఒకటే పోలిక, పరిచయం లేనివాళ్ళు పొరబడేటంత పోలిక.

వాళ్ళకి మంచి సంబంధాలు చూసి పెళ్ళిచెయ్యగల స్తోమత శ్రీపతిగారికి లేదు. అక్కడే కొంత అదృష్టం కలిసి వచ్చింది. ఆ వూళ్ళోబాగా ధనవంతుల్లో ఒకరైన గంగాధరంగారి అబ్బాయి వెంకటరమణ అనసూయ అంటే యిష్టపడ్డాడు మంచినీళ్ళ రేవుదగ్గిర చూశాడుట, ఆ అమ్మాయినే పెళ్ళి చేసుకుంటానని పట్టుబట్టాడు. మొదట్లో బింకం చూపించినా కొడుకు పట్టుదలచూసి ఆయన ఒప్పుకున్నాడు.

ఆయన పట్టి ఆస్తిమనిషి. అమ్మాయి అందమైనదీ, గుణవంతురాలూ అయినా ఆ విషయానికి ఆయన ప్రాధాన్యత యివ్వలేదు. వంశాన్ని నిలుపుకునే ప్రయత్నంతో సహకరించడమే స్త్రీ ఉపయోగం అని ఆయన భావం, తన భార్యనలాగే చూశాడు భార్య, చెల్లెలు, కోడలు ఇలాంటి మమకారాలు ఆయన కేసీ ఉండవు.

ఆయన ఆలోచించినది వేరు. కొడుక్కి ఈడుకి తగని ఆలోచనలున్నాయి. ఎప్పుడూ హరికథలూ, పూజలూ, రామకోటి సప్తాహాలూ – ఇలాంటి వాటిలో మునిగిపోయి ఉంటాడు. పెళ్ళి చేసుకోవాలన్న ఉద్దేశం అనసూయని చూశాక కలిగింది. వాళ్ళిద్దరికీ త్వరగా ఒక మగబిడ్డ కలిగి వంశం నిలబడితే ఆస్తికి వారసుడు దొరుకుతాడని ఆయన ఆలోచన. అన్న కొడుకులకి ఆస్తి ఇవ్వటం ఆయనకి ఇష్టం లేదు అంతస్తులో చాలా తక్కువయినా ఆయన ఈ సంబంధానికి ఒప్పుకున్న కారణం అదే. అనసూయని కాకపోతే ఇంకొకర్ని చేసుకోనని కాశీ వెళ్ళిపోతానని కొడుకు అనేసరికి ఆయన ఒప్పుకున్నాడు.

అదే పెళ్ళిపందిట్లో లలిత పెళ్ళికూడా జరిగింది. పక్కఊరు శ్రీపురం ఇచ్చారు ఆమెని. చాలా మామూలు సంబంధం! రెండు విభిన్నమయిన కళ్యాణ వేదికలమీద పెళ్ళిళ్ళు జరిగాయి

లలిత దురదృష్టవంతురాలు. వివాహం

అయినా ఆరు నెలలలోనే ఆమె భర్త పొలం దగ్గిర పాము కరిచి చచ్చిపోయాడు. అప్పుడామె గర్భవతి.

అనసూయకూడా గర్భవతే. ఇద్దరినీ శ్రీపతిగారు ఇంటికి తీసుకువచ్చారు. భార్యావిహీనుడు కావటంవల్ల కూతుళ్లిద్దరి అవసరాలలోనూ పక్కింటామె సహాయం చేస్తూ వచ్చింది.

అనసూయకీ లలితకీ ఒకేసారి నొప్పులు వచ్చాయి. హడావిడిగా మంత్రసానికోసం పంపించారు. ఆ వూళ్లో ఉన్నది యిద్దరు మంత్రసానులు, కాంతమ్మ రత్తమ్మ. అని. కాంతమ్మకేమీ ప్రత్యేకత లేదుగాని రత్తమ్మకి ఒక అపప్రథ ఉండేది. ఆవిడ సహాయం చేసిన కాన్పుల్లో బిడ్డగాని, తల్లిగాని పోవడం జరిగింది. ఆవిడ హస్తవాసి మంచిదికాదని అనుకునేవారు.

సమయానికి కాంతమ్మ ఊళ్లో లేక పోవడంతో రత్తమ్మనే పిలిపించారు.

ఆడదిక్కులేని ఆ యింట్లో అంతా రత్తమ్మే చూడాల్సి వచ్చింది. గంటన్నర తేడాలో రెండు కాన్పులూ సుఖంగానే జరిగాయి. ఇద్దరికీ మగబిడ్డలే ఒకటేరూపం పోల్చుకోలేనంత పోలిక ఇద్దరికి శ్రీపతి గారి పోలికే వచ్చిందన్నారు.


అయితే రత్తమ్మ చెయ్యి నిజంగానే మంచిది కాదేమో తెలియదు. ఇద్దరు బిడ్డల్ని ఒక ఉయ్యాలలో పడుకోబెట్టి

శ్రీపతి

పుట్టుమచ్చలు చూస్తుంటే ఒకబిడ్డకి ఎక్కిళ్లు రావటం ప్రారంభించాయి. ఊపిరి అందుకోలేకపోతోంటే రత్తమ్మ గాభరాగా చూసింది. 'ఎవరినైనా పిలుద్దా మనుకుంటుండగానే శిశువుకి ఎగశ్వాస వచ్చింది. క్షణంలో కళ్లు తేలిపోయి ప్రాణం పోయింది.

రత్తమ్మకి గుండెలు పిండినట్లయింది. మరణించిన బిడ్డని కళ్లనీళ్లతో చూసింది. కేకలు వెయ్యలేదు. ఎవర్నీ పిలవలేదు. నిశ్చేష్టగా నిలబడి పోయింది—తన దురదృష్టానికి మరో బిడ్డ బలి అయిపోయినందుకు.

చూస్తుండగానే రెండో బిడ్డకి ఎక్కిళ్ళు ప్రారంభం అయాయి. ఊపిరికి కష్టపడుతున్నాడు. రత్తమ్మకి కాళ్లాడ లేదు కళ్లల్లోంచి నీళ్లు జలజలాకారాయి. క్షణంలో నిశ్చయానికి వచ్చేసింది. తను దూరంగా వెళ్లిపోతేగాని బిడ్డకి రక్షణ లేదనుకుంది. ఉన్నపళంగా ఎవరికీ చెప్పకుండా ఇంట్లోంచి బయటికి వచ్చేసింది. జటకా కట్టించుకుని కట్టుబట్టలతో పట్నం వచ్చేసింది. పట్నంలో దొరికిన రైలు ఎక్కేసింది. తనగాలి సోకనంత, తన ఆలోచనలు అందనంత దూరం పోతేగాని బిడ్డకి క్షేమం లేదనుకుంది.



పనిమీద యింటికి వెళ్ళొచ్చిన పక్కింటావిడ వస్తూనే ఉయ్యాలలో ఒకబిడ్డ చచ్చిపోయి ఉండటం గమనించింది. రత్తమ్మలేదు. క్షణంలో అంతా గందరగోళం అయిపోయింది. చుట్టుపక్కల అమ్మలక్కలంతా వచ్చారు. రత్తమ్మకోసం వెతికారు. కనబడలేదు. ఏమయింది బిడ్డకి అన్నారు' ఇప్పటిదాకా బాగానే ఉన్నాడే' అని కొందరన్నారు 'రత్తమ్మది నిర్భాగ్యపు చెయ్యి' అన్నారు. ఎలా పోయాడు? అని ప్రశ్నించుకున్నారు. ఇంతకీ పోయింది ఎవరిబిడ్డ? అన్నారు.

అదే తేలలేదు. ఇద్దరు బిడ్డలవీ ఒకటే పోలిక. ఆడమనిషిలేని ఆయింట్లో వాళ్లని పోల్చగలిగినది రత్తమ్మ ఒక్కర్తే అయింది. ఆమె కనబడకుండా పోయింది. ఇరుగుపొరుగు అమ్మలక్కలు ఏకాభిప్రాయానికి రాలేదు.

అనసూయకిగాని, లలితకిగాని పుత్రశోకం కలగలేదు. మరో యిల్లాలి బిడ్డ పురిట్లో పోయినట్లు వింటే ఎలా బాధ కలుగుతుందో అలాగే కలిగింది. ఇద్దరికీ కళ్లల్లోకి నీళ్లు వచ్చాయి. కాని భరించరాని వేదనతో విల విల లాడలేదు. భవిష్యత్తు శూన్యంగా అయోమయంగా కనిపించలేదు. బతికినబిడ్డ బోసినవ్వు నవ్వుతోంటే ఇద్దరికీ గుండెలు ఉప్పొంగాయి. ఇద్దరికీ తన బిడ్డలాగానే కనిపించాడు పసికందు. తనబిడ్డ చచ్చిపోయి ఉండవచ్చనే భావనే మనసులోకి రానీయలేక పోయారు ఆ అప్పచెల్లెళ్లలో ఎవరూ. ఇద్దరిస్తన్యం తీసుకున్నాడు పసిబిడ్డ.

బారసాలనాడు పీటలమీద వెంకటరమణ అనసూయ కూర్చున్నారు. వెంకటరమణ ఆలోచించి బియ్యపు పళ్ళెంలో 'శ్రీపతి' అని రాశాడు. అనసూయకీ లలితకీ కృతజ్ఞతతో కళ్ళు చెమ్మగిల్లాయి

తల్లీతండ్రీ ఉన్న కుటుంబంలోనే బిడ్డ పెరగటం సమంజసంగా తోచింది శ్రీపతిగారికీ, లలితకీ కూడా. అనసూయ వెంకటరమణల దగ్గిరే పెరిగాడు శ్రీపతి. కాలవగట్టు స్కూల్లో ఒకటో తరగతిలో వేస్తున్నప్పుడు తల్లిదండ్రుల పేర్లుగా అనసూయ, వెంకటరమణ అని నమోదు వెయ్యబడ్డాయి.

ఎదుగుతున్న కొద్దీ అతనిలో తాత

శ్రీపతిగారి పోలికలే స్ఫుటంగా కనబడ సాగయి.

ఎలిమెంటరీ స్కూలు అయిన తర్వాత మామయ్య జగన్నాథంగారి దగ్గరకి వచ్చి చదువుకున్నాడు. బి.ఎ. పాసయ్యాడు. ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు.

*   *   *

శ్రీపతి శ్రీపురం చేరుకునేటప్పటికి పదిగంటలు దాటింది. అమ్మ తాతయ్య దగ్గిరే ఉందని తెలిసి అక్కడికే వెళ్లాడు. కొడుకుని చూడగానే అనసూయమ్మకి ప్రాణం లేచివచ్చింది. వెంటనే కుంపటి రాజేసి కాఫీకాచి యిచ్చింది. అప్పుడే వేడి నీళ్లుకూడా పెట్టింది. స్నానం చేసిన తర్వాత భోజనం పెట్టింది. కొడుక్కి యిష్టమని గుత్తి వంకాయకూర చేసింది. అన్నం తింటూంటే విసినికర్ర తీసుకు విసిరింది.

మామయ్య అత్తయ్య, వర్ధని విశేషాలు అడిగింది. మామయ్య ఆరోగ్యం బాగుందనీ, వర్ధని అయిదో ఫారం చదువుతోందనీ చెప్పాడు.

'అమ్మదగ్గరికి ఎప్పుడు వెడతావురా' అంది అనసూయమ్మ.

'రేపు వెడతానమ్మా' అన్నాడు.

ఆ మధ్యాహ్నం అంతా యింట్లోనే గడిపాడు. అటకమీద సామానంతా దించి దుమ్ముదులిపాడు. అలా తీస్తుంటే పాత కాలంనాటి ఉయ్యాల కనబడింది. కొంచెం పెద్ద ఉయ్యాల. ఇద్దరు బిడ్డల్ని పడుకో బెట్టవచ్చు. 'నాతోపాటు నా అన్నో, తమ్ముడో దీంట్లో పడుకున్నాడు' అనుకున్నాడు శ్రీపతి.

సాయంత్రం చెరువు ఒడ్డుకి బయలుదేరాడు. ఇల్లు కదలగానే పక్కసందులోనే ఉంది రత్తమ్మ యిల్లు.

పాడుపడిపోయి ఉంది. రత్తమ్మ హఠాత్తుగా ఊరువిడిచి వెళ్లిపోయాక ఆ యింటిని అలాగే ఉంచారు. ఎవరూ ఆక్రమించుకోలేదు. ఇంకొకళ్ల యిల్లు మనకెందుకనో, రత్తమ్మ హస్తవాసిలాగానే ఆమె యిల్లుకూడా మంచిది కాదనో తెలియదు. ఆ యింట్లో దీపం పెట్టి చాలా ఏళ్లయినట్లు స్పష్టంగా తెలుస్తోంది. బూజు పట్టి గోడలునగం పడిపోయి. పిచ్చి మొక్కలు పెరిగి పూర్తిగా జీర్ణావస్థలో ఉంది. 'రత్తమ్మ తిరిగివస్తే ఈయింట్లో ఉండగలదా?' అనుకున్నాడు శ్రీపతి. 'అసలు రత్తమ్మ తిరిగి వస్తుందా?' అన్న ఆలోచనకూడా వచ్చింది.

చెరువు ఒడ్డుకి వెళ్లి కాసేపు మంచి గాలి పీల్చి చీకటి పడుతోంటే యింటికి చేరుకున్నాడు. అప్పటికి అనసూయమ్మ ఇల్లు కడిగి గుమ్మాలకి పసుపురాస్తోంది.

'రత్తమ్మ యిలు' బాగా పాడయి పోయిందే' అన్నాడు అన్నం తింటున్నప్పుడు తల్లితో,

పరధ్యానంగా ఉన్న అనసూయమ్మ ఉలిక్కి పడింది. 'ఏమిటి రత్తమ్మంటున్నావు' అని అడిగింది కంగారుగా.

'రత్తమ్మ యిల్లు బాగా పాడయి పోయిందికదా అన్నాను అన్నాడు.

'అవును' అంది అనసూయమ్మ నిట్టూరుస్తూ.

*   *   *

మర్నాడు శ్రీపురం బయలుదేరాడు. జటకా కట్టించుకుంటే గంట ప్రయాణం. శ్రీపతికి జటకా ప్రయాణం కొత్తకాదు. ఆ కుదుపులు అలవాటే.

శ్రీపురంలో యింటికి చేరుకునే సరికి పొద్దున్న ఎనిమిదిన్నరయింది.

కొడుకుని చూసేసరికి లలితమ్మ ముఖం వికసించింది. సంచీ అందుకుని లోపల పెట్టింది. కాఫీ యిచ్చి తాగుతోంటే 'చిక్కిపోయావేమిరా' అంది.

శ్రీపతి ఒళ్ళు చూసుకుని 'బాగానే ఉన్నానే' అన్నాడు.

స్నానానికి లేస్తోంటే 'తలంటి పోసుకుని ఎన్నాళ్ళయిందిరా' అంది. శ్రీపతి నవ్వి 'రెండు నెలలపైన అయుంటుందమ్మా' అన్నాడు.

'అత్తయ్య పొయ్యలేదా?'

'లేదు. పోసుకోమని అడగదు'

'వర్ధని?' అంది లలితమ్మ నవ్వి.

శ్రీపతికూడా నవ్వి ఊరుకున్నాడు.

మంచినూనె చిన్న ఉద్ధరిణెలో యిచ్చి రాసుకోమని సున్నిపిండిలో నీళ్ళుకలిపి పక్కన పెట్టింది. రెండు చెవులలోనూ నూనెపోసింది. సున్నిపిండితో నలుగు పెట్టు కుంటోంటే కుంకుడు కాయలు కొట్టి పులుసు కలిపింది.

'అమ్మనిచూసి వచ్చావుట్రా!' అని అడిగింది పులుసుపోస్తూ.

'అక్కణ్ణించే వస్తున్నాను' అన్నాడు శ్రీపతి. కొడుకువొళ్ళు రుద్దుకుంటోంటే వీపు రుద్దింది లలితమ్మ. తలతుడుచుకున్నాక కొడుకు కంట్లో పులుసు పడిందంటే రెండు ఉప్పురాళ్లిచ్చి నోట్లో వేసుకుని చప్పరించమంది,

శ్రీపతి

శ్రీపతికి ఇష్టమని గారెలు చేసింది. చేస్తోంటే శ్రీపతి పెరట్లో మొక్కలకి, పాదులకీ ఒరవలుచేసి బావిలోంచి నీళ్ళుతోడి పోశాడు, తర్వాత టిఫినుకోసం బాదంచెట్టు ఎక్కి ఆకులుకోశాడు. లలితమ్మ కొడుకు చేత గారెలు దగ్గిరుండి తినిపించింది.

'మామయ్య నీ పెళ్ళి సంగతి ఏమంటు న్నాడ్రా!' అంది.

'మామయ్య మాటేం చెల్లుతుంది? అంతా అత్తయ్య యిష్టంగదా?' అన్నాడు.

'అత్తయ్య ఏమంటుంది?'

'కొత్తేముంది? మనం వాళ్ళ అంతస్తుకి తగని వాళ్ళమేగదా. కొత్తగా డబ్బు మన వళ్లో కురిసింది ఏమీలేదుగదా' అన్నాడు.

రెండు రోజులుండి అమ్మని తీసుకుని లక్ష్మీపురం తిరిగివచ్చాడు. వచ్చేసరికి మామయ్య అత్తయ్య, వర్ధనికూడా వచ్చారు. మామయ్య పొలం విషయంలో వస్తే నేనూ వస్తానంది వర్ధని. తను ఒక్కర్తే ఎందుకని కామాక్షమ్మకూడా వచ్చింది.

జగన్నాథంగారు వచ్చిన రోజునే గంగాధరంగార్ని చూడటానికి వెళ్లారు. ఆయన ఆరోగ్యం బాగాపాడయిపోయింది. నీరసం, నిస్సత్తువ. పూర్తిగా స్వార్జితమయిన తన ఆస్తి విషయం ఆయన ఏదో ఒకటి తేల్చెయ్య దలుచుకున్నాడు. శ్రీపతి తన కొడుకు కొడుకేనని తేలితే తన ఆస్తి అంతా అతనికి రాసెయ్యాలనీ, తేలకపోతే తన వంశం వాళ్ళయిన అన్న కొడుకులకి రాసెయ్యాలనీ నిశ్చయం చేసుకున్నాడు. ఆ విషయమే జగన్నాథంగారితో చెప్పాడు.


శ్రీపతి లలితమ్మని తీసుకుని ఇంటికి వచ్చేటప్పటికి జగన్నాథంగారు భార్యతో ఆ విషయం చెప్పటం వినిపిస్తోంది.

'ఏదో విధంగా తెలిస్తే బాగుండును. అంత ఆస్తి శ్రీపతికే వస్తే, మా అన్నయ్యకొడుకూ లేరు ఎవరూలేరు — శ్రీపతికే వర్ధనిని యిచ్చి చేసేస్తాను. ఆ రత్తమ్మ తిరిగొస్తే బాగుండును' అంటోంది కామాక్షమ్మ.

శ్రీపతి లోపలికి వెళ్ళేసరికి అనసూయమ్మ పాతఫోటోలున్న పెట్టె సర్దుతోంది. శ్రీపతి పక్కనుండి ఫోటోలన్నీ చూస్తూ ఒకఫోటో బయటికి తీసి పట్టి పట్టి చూశాడు.

అది గంగాధరంగారి చిన్నప్పటి ఫోటో, దాదాపు ఏభైఏళ్ళక్రితం ఫోటో, అప్పటికీ యిప్పటికీ పోలికేలేదు. ఇప్పుడు డెబ్భై ఏళ్ల ముసలివాడు. అప్పుడు ఇరవై ఏళ్ళ యువకుడు. ఇప్పుడు బట్టతల ఆయనకి, అప్పుడు ఒత్తుజుట్టు ఉంది. ఆ ఫోటోలో నుదుటిపైన పడేజుట్టులో సుడిఉంది. ఆ ఫోటోనే చాలాసేపు చూశాడు శ్రీపతి. చూస్తోంటే అతని నుదుటిమీద ముడతలు పడ్డాయి. కనుబొమలు ముడుచుకున్నాయి. కాసేపాగి అద్దంలో చూసుకున్నాడు.

నాలుగురోజుల తర్వాత సూర్యుడు మామూలుగానే ఉదయించిన ఒకరోజున



రత్నమ్మ యింటిముందు జటకా ఆగింది. దాంట్లోంచి రత్నమ్మ దిగింది.

ఆసరా లేకుండా నడవలేనిస్థితిలో ఉంది. శక్తి అంతా ఉడిగిపోయి గంటలు లెక్క పెట్టుకునే స్థితిలోఉంది. ఆఖరిక్షణాలు స్వంతవూరిలో, పరిచయమైన నేలమీద; తనకి తెలిసిన మనుషులమధ్య గడపాలని వచ్చింది. తన హస్తవాసికి శ్రీపతిగారి రెండోమనవడు బలి కాలేదన్న సంతోష వార్త తెలుసుకోవచ్చునన్న ఆశతోటీ, శ్రీపతిగారి మనవడిగురించి బహుశా తనకి మాత్రమే తెలిసిఉన్న విషయం చెప్ప వలసిన నైతిక బాధ్యతతోటీ వచ్చింది.

జట్కావాడు ఆమెకి ఆసరా యిచ్చి దింపాడు. ఆమె అడుగు వెయ్యలేక పోతోంటే ఇంటిలోపలికి నడిపించాడు. తలుపుతీసి తన బండిలో గుడ్డదీసి పరి చాడు ఆమె మాట్లాడగల స్థితిలోలేదు. అతికష్టంమీద నోరు పెకలించుకుని 'శ్రీపతి గారు' అంది. జట్కావాడు ఇల్లుకనుక్కొని వచ్చేసరికి ఇంట్లో శ్రీపతి, వర్ధని ఉన్నారు శ్రీపతి జట్కావాడిద్వారా విషయం కను క్కొని దారిలో వైద్యుడియింట్లో కబురు పెట్టి, వెంటనే రత్నమ్మ యింటికి రమ్మని చెప్పి రత్నమ్మ యింటికి బయలుదేరాడు.

శ్రీపతీ, వర్ధనీ అడుగు పెట్టేసరికి రత్నమ్మ ఎగశ్వాసతో ఉంది. శ్రీపతిని కళ్లు చిట్లించి చూసి పోల్చుకుంది. పట్టలేని ఆనందంతో ఆమెకళ్లు మెరి శాయి. కళ్లనీళ్లతో అతనిచేతులు పట్టు కుని ఆప్యాయంగా నిమిరింది, వెంటనే ఏదో గుర్తుకు వచ్చినట్లు తనసంచీ చూపించి పక్కకి జరిగింది. ఆ సంచిలో అంటించిన కవరుఉంది దానిమీద 'శ్రీపతి గారి బతికిఉన్న మనవడికి' అని రాసి ఉంది. అది అలాగే జేబులో పెట్టు కున్నాడు శ్రీపతి.

రెండుక్షణాల్లో వైద్యుడు, కామా క్షమ్మ, జగన్నాథంగారు, శ్రీపతిగారు, రత్నమ్మనిగురించి తెలిసిన పాతతరం మనుషులు చాలామంది వచ్చారు. కామా క్షమ్మ ఆత్రంగా రత్నమ్మ దగ్గరకి రాబో తోంటే వైద్యుడు వారించాడు. రత్న మ్మకి గాలి తగిలేటట్లుగా చేసి నాడి చూశాడు. వెంటనే పెదవి విరిచాడు. రత్నమ్మ అందర్నీ చూస్తూ గుర్తుపట్ట డానికి ప్రయత్నిస్తుండగానే ఆమె ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.

ఆమెకి దహనక్రియలు అన్నీ శ్రీపతే చేశాడు, శవం కాలుతోంటే శ్రీపతి అంటించిఉన్న ఆ కవర్ని జేబులోంచి తీసి ఆ మంటల్లో వెయ్యడం గమనించింది వర్ధని. "నువ్వు చెప్పదామనుకున్న రహస్యం శాశ్వతం, నీలోనే ఉంచుకో రత్నమ్మా' అనడం వింది.

శ్రీపతి ముఖంలో చెక్కుచెదరని ప్రశాంతతనీ, పెదవులపై స్వచ్ఛమైన చిరునవ్వునీ చూసింది వర్ధని ●

రసవర్గాలూ - గుణాలూ :

మజ్జిగ

ఆవు మజ్జిగ మేహశాంతిని, పైత్య శాంతిని చేకూరుస్తుంది. అగ్నిదీప్తినిస్తుంది. త్రిదోషహరమైనది. ఇది మిక్కిలి పథ్య మయినది. ముఖ్యంగా అవగాతిసారం, ఉబ్బు, గ్రహణి, పాండువు, మేహం, గుల్మం, ఉదరం, మూలవ్యాధి, కామెల, పైత్యం, పురాణజ్వరం, అరుచి, శోష, క్షయ, శీతపైత్యంగల రోగు లకు మిక్కిలి పథ్యమయినది.

గేదె మజ్జిగ కామిల, పాండురోగ్యం, కఫ రోగం, రక్తం స్రవించే మూలవ్యాధి— ఈ రోగాలు గలవారికి పథ్యమయినది. దేహపుష్టి నిస్తుంది. వాతరోగాన్ని పెంపొందిస్తుంది

మేకమజ్జిగ త్రిదోషహరమైనది. జఠర దీప్తి నిస్తుంది. గుల్మం మూలవ్యాధి, సంగ్ర హణి, పాండువు, మేహపైత్యం, జలోదరంగల వారికి పథ్యమయినది.

అసలు సాధారణంగా ఏ జంతువుయొక్క పాలతోచేసిన మజ్జిగైనా చలవచేసి నీరు పెంచుతుంది. కఫవాతాన్ని అణచివేస్తుంది ఉబ్బు, ఉదరం, మూలవ్యాధి, గ్రహణి, మూత్ర బద్ధం, అరుచి, గుల్మం, కడుపులోబల్ల, కామిల, హృద్రోగం, పాండువు, క్షయ— ఈ రోగాల్ని ఉపశమింపజేస్తుంది. మూర్ఛ యాసాన్ని పోగొడు తుంది. రక్తంలోని వేడిని తీసివేస్తుంది.

ఇనుపగుండ్లుగాని మేకుగాని, కాల్చి మజ్జిగలోవేసి— ఆ మజ్జిగను పడగట్టి త్రాగి నచో జీర్ణశక్తి పెంపొందుతుంది. గోరం కాల్చి మజ్జిగలో వేసి—ఆ మజ్జిగను త్రాగుతే పైత్యంవల్ల అయే రక్తవిరేచనాలు కడతాయి. బియ్యం కొద్దిగా వేసి, మజ్జిగతో వండిన అన్నం తింటే రాకవిరేచనాలు కడతాయి.

ప్రతిరోజూ అమితంగా టీ త్రాగడంవల్ల నరముల వికలత్వం సంభవించినవారు, రోజూ రెండుపూటలూ ప్రశస్తమైన మజ్జిగను అన్నంలో కలుపుకొని తినడం మంచిది. క్షయ జబ్బు ప్రారంభదశలో గలవారు రోజూ ఉద యాన్నే పరిశుభ్రమైన మజ్జిగను తగ్గ మోతాదులో త్రాగుతే ఎంతో మేలు చేకూర తుంది.

తియ్యని మజ్జిగ పైత్యాన్ని శమింప జేస్తుంది. పుల్లటి మజ్జిగ వాతాన్ని శమింప జేస్తుంది. వెగటుగా ఉన్న మజ్జిగ శ్లేష్మాన్ని శమింపజేస్తుంది.

వాతరోగులు పులిసిన మజ్జిగను సైంధవ లవణంతోను, పైత్యరోగులు తియ్యటి మజ్జి గను పంచదారతోను— శ్లేష్మరోగులు వగ రుగా నున్న మజ్జిగను శొంఠి పిప్పిలి మిరి యాలు, సికులు, ఆకుపత్రికం, లవంగాలు వీని చూర్ణంతోను— గ్రహణిరోగులు— ఉప్పుతోను— మూత్రకృచ్ఛం గలవారు బెల్లం తోను— పాండురోగులు శొంఠి చూర్ణం తోను— మూలవ్యాధిగలవారు కొడిశచెక్క చూర్ణంతోను— ప్రమేహంగలవాళ్ళు తేనె తోను మజ్జిగను పుచ్చుకోడం మంచిది.

మజ్జిగను పది విధాలుగా చెయ్యవచ్చును. చేసే విధానానికి అనుగుణంగా కించెత్తు గుణాలు కూడా మారుతూంటాయి.

శ్లేష్మతత్వం, వాతతత్వం గలవాళ్ళు, దంత రోగులు, ఉబ్బు వ్యాధి గలవారు, ప్రసవ మైన స్త్రీలు, రక్తక్షీణదేహులు, గాయ ములు తగిలినవారు— మూర్ఛ, నవజ్వరం, వాతశ్లేష్మజ్వరం, రక్తపైత్యం, కార్శ్యరోగం గలవారు అధికంగా మజ్జిగ త్రాగకూడదు.

కొన్ని రకాల జబ్బులు గలవారు మజ్జిగను అమితంగా పుచ్చుకుంటే— శ్లేష్మం, వాతం, అగ్నిమాంద్యం, అజీర్ణం, తలత్రిప్పు, జ్వరం మొదలగు వ్యాధులు వస్తాయి.

మజ్జిగయొక్క దుర్గుణాలకువిరుగుళ్ళు:— 1. ఉప్పు, 2. శొంఠి, 3. సైంధవ లవణం, 4. శంఖభస్మం, 5. అల్లం, 6. కాకజౌషధములు.

సేకరణ ఆకుండి నారాయణమూర్తి

గుండె జబ్బుకు మంచి మందు

ప్రపంచంలో గుండె జబ్బువల్ల మరణిస్తున్నవారి సంఖ్య నానాటికీ పెరిగిపోతున్నది. సైంటిస్టులు ఈ జబ్బుమీద అనేక పరిశోధనలు గావిస్తున్నారు. బ్రిటన్‌లో జరిపిన కొన్ని ప్రయోగాలపై జాన్ రోవన్ విల్సన్ అభిప్రాయాలని ఈ వ్యాసం తెలియపరుస్తుంది.

ఒకోసారి అకస్మాత్తుగాను, అదృష్టం కొద్దీ మరోసారి రోగ నివారణోపాయాలు తడుతూ వుంటాయి. కొన్ని సంవత్సరాల ప్రయోగాలు, పరిశోధనల ఫలితంగా శాస్త్రజ్ఞుల కృషి ఫలిస్తూ వుండడం సర్వ సాధారణంగా జరిగే విషయం.

ఈ పరిశోధనల ఫలితంగా ఆవిర్భవించిందే 'ఎట్రోమిడ్—ఎస్'. గుండెజబ్బులని నయం చేయడానికి ఈమందు అమోఘంగా పనిచేస్తుంది. 'ఎట్రోమిడ్ — ఎస్'నే క్లోఫయిబ్రేట్ అనికూడా పిలుస్తూవుంటారు. ఇది సరికొత్త ఔషధంమాత్రం కాదు. పదేళ్ల క్రితమే పరిశోధకులని ఆకర్షించిన మందు ఇది కాని, ఈ మందుకు నిజమైన ప్రధాన్యతని ఈమధ్యనే కనిపెట్టారు.

పాశ్చాత్యదేశాల్లో గుండెజబ్బులు విపరీతంగా పెరిగిపోతున్నాయి మందులుకూడా అభివృద్ధి చెందడం అత్యవసరం. గత ముప్పయిఏళ్లలో గుండె జబ్బు వల్ల బ్రిటన్‌లో మరణించినవారు అయిదురెట్లు పెరిగిపోయారు. ఇతరకారణాలవల్ల చనిపోయే వారికంటే ఈ గుండెజబ్బువల్ల చనిపోయే వారి శాతం ఎక్కువగా వుంటున్నది.

ప్రభుత్వపరంగాగాని, 'ఫార్మసుయేటికల్ కంపెనీల్లోగాని ఈ జబ్బుమీద పరిశోధన చాలా ముఖ్యమైనదిగా ఎంచుకుంటున్నారు. కొద్ది ఫలితంకోసమే కొన్నికోట్ల రూపాయలు వెచ్చిస్తున్నారు. ఫలితంగా కొన్ని నిరుపయోగమైన మందులుకూడా పుట్టుకొచ్చాయి గుండెజబ్బుతో బాధపడేవారికి తక్షణ చర్యకోసం కొన్నిమందులు బాగా ఉపయోగపడ్డాయిగాని, వాటివల్ల మరిన్ని ప్రమాదాలు వాటిల్లడానికి అవకాశాలు కలిగిస్తూ వచ్చాయి. రక్త ప్రసారంలో కొవ్వువంటి పదార్థాలు తగ్గించి నట్లయితే గుండెజబ్బు నయమయ్యే సూచనలు కనిపిస్తాయనే సిద్ధాంతం ఒకటి పరిశోధనల వల్ల బయటపడింది.

ఎట్రోమిడ్ — ఎస్ ఈ ప్రయోగాన్ని రుజువుచేసి చాలా సౌకర్యమైన మందుగాను బాగా పనిచేసే మందుగాను పేరు తెచ్చుకుంది రక్తంలో కొవ్వువంటి పదార్థం (కలెస్టరల్) ఎక్కువగా వున్నవాళ్లు ఈ మందు వాడగానే వాళ్ళకి మంచిగుణం కనిపించింది. ఇతర ప్రమాదాలుకూడా ఏమీ కనిపించలేదు.

వైద్యశాస్త్రరీత్యా—రక్తంలో ఈ కలెస్టరల్ పదార్థాన్ని తగ్గించినందువల్ల ప్రయోజనం ఎంతవరకు వున్నదీ అనే పరిశోధనలో కృతకృత్యులయ్యారనే చెప్పాలి. ఇది వెంటనే గుణమిచ్చే మందుకాదు. మందు వాడకంమీద నెమ్మదిగా జబ్బు తగ్గుముఖం పడుతుంది.

ఎట్రోమిడ్-ఎస్ ఉపయోగించి అనేక మంది రోగులమీద అనేకమంది డాక్టర్లు ప్రయోగాలు జరుపుతున్నారు. కాని ఈ ప్రయోగం తమమీద జరపబడుతున్నది అని రోగులకు తెలియకుండా జాగ్రత్త పడుతున్నారు — అంటే, ప్రయోగాత్మకమైన ఈ మందును మామూలు మందుల కేప్స్యూల్స్‌తో కలిపి రోగులకు ఇస్తున్నారన్నమాట!



1965 లో ఇలాంటి మూడు ప్రయోగాలు జరిగాయి. ఈ ప్రయోగాల్లో —మొత్తం 1,214 మంది రోగులమీద 50 మంది డాక్టర్లు పనిచేశారు. 1971 ఆఖరివారం బ్రిటిష్ మెడికల్ జర్నల్‌లో ఈ ప్రయోగ ఫలితాలని ప్రచురించారు.

ఎట్రోమిడ్—ఎస్ గుండెజబ్బున్నవారి రక్తంలో ధమనుల ప్రభావాన్ని తగ్గిస్తుందా? అన్న ప్రశ్నకి ఈ ప్రయోగాల వల్ల సమాధానం లభించింది. కాని, ఈ సమాధానం పూర్తిగా నిరుత్సాహకరమైనది. ఎట్రోమిడ్—ఎస్ తీసుకోకుండా వున్నవారిలో 13 శాతం చచ్చిపోయారు. ఎట్రోమిడ్ — ఎస్ తీసుకున్న వారిలో 10 శాతం మరణించారు. ఈతేడా ఏమంత చెప్పుకో తగ్గదిగా కనిపించడంలేదు.

కాని, మరో విచిత్రమైన విషయం బయటపడింది. గుండెజబ్బున్న వాళ్లలో 'ఆన్జయినా పెక్టోరిస్' గుణాలు కనిపించిన వారికి ఎట్రోమిడ్—ఎస్ వల్ల బహుళ ప్రయోజనాలు కనిపించాయి. గుండెపోటు పూర్తిగా నయమైపోయింది.

ఏ రోగికయినా 'ఆన్జయినా' వున్నట్లయితే అతనికి ఎట్రోమిడ్—ఎస్ బాగా పని చేస్తుంది.

ఎట్రోమిడ్—ఎస్ ప్రభావంవల్ల రక్తంలో కలెస్టరల్ పదార్థం తగ్గిపోయినా, ఆన్జయినా వున్న వాళ్ళకిమాత్రం ఈ మందు సత్ఫలితాన్నిస్తుందని తెలిసింది.

ఈ ఫలితాలు అంత నిశితంగా లేవు. ఎట్రోమిడ్—ఎస్‌లో గుండెజబ్బు నివారించగల లక్షణాలున్నాయని తెలిసిందేగాని దాని మీద ఇంకా పరిశోధన జరగవలసి వుంది. ప్రయోగాలు చెయ్యవలసివుంది. అప్పుడే, దానికి గుండెజబ్బు భయపడుతుంది. అందుచేత ఈ మందు గురించిన పరిశోధన ఇప్పుడే ఆరంభమయింది అనుకోవాలి.

— జాన్ రావన్ విల్సన్

(ఫో. వ. ఫీ.)

సినిమా

డబ్బుకు లోకం దాసోహం

'నిండుమనసులు' నిర్మించిన ఎస్. వి. ఎస్ పిక్చర్స్ మార్చిలో 'డబ్బుకు లోకం దాసోహం' అనేడి చిత్రంయొక్క షూటింగును ప్రారంభించే ప్రయత్నాల్లో వున్నారు. మోదుకూరి జాన్సన్ కథ, మాటలను సమకూర్చే యీ సాంఘికానికి డి. యోగానంద్ దర్శకుడు.

'నేటి సమాజంలో డబ్బుయొక్క పాత్రయెంత, అది మనిషిని ఎంత నీచానికి దిగజారుస్తుంది,' అనేడి అంశాన్ని మూలసూత్రంగా గొన్న యీ కథలో నాయక పాత్రను ఎన్టీరామారావు పోషిస్తారు. ఎం. జగన్నాథరావు నిర్మిస్తున్న యీ ప్రబోధాత్మక చిత్రానికి కె. వి. మహదేవన్ సంగీత దర్శకుడు. 'విచిత్ర కుటుంబం' ఫేమ్ ఆర్. సంపత్ ఛాయాగ్రాహకుడు. ప్రధాన పాత్రలకు ప్రముఖ నటీనటులను ఎన్నుకుని, మార్చినుండి షెడ్యూలు పెట్టుకుందామని నిర్మాత అభిప్రాయపడుతున్నారు.

నందినీ ఫిలింస్ మూడవ చిత్రం!

నందినీ ఫిలింస్ 'ఇల్లు — ఇల్లాలు' షూటింగు పూర్తి అవడమే తరువాయి, మూడవ చిత్రాన్ని ప్రారంభిస్తారట. ఈ చిత్రంలో కూడా వాణిశ్రీ నాయికగా నటించడానికి అంగీకరించిందట.

అన్నపూర్ణా కంబైన్స్ ప్రొడక్షన్ నెం. 2

అన్నపూర్ణా కంబైన్స్‌వారి (తల్లి కూతుళ్ళు) 'ప్రొడక్షన్ నెం. 2'కి పేరు నిర్ణయం జరుగుతూంది. బొల్లిముంత రచన సాగిస్తున్నారు స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలను కె. విశ్వనాథ్‌కి అప్పగించారు శోభన్‌బాబు కథానాయకుడు. ఏప్రిల్ మాసంలో షూటింగు ప్రారంభమవుతుంది.

అభ్యుదయ భావాలు, వున్నత ఆశయాలు వున్న కొద్దిమందిలో అన్నపూర్ణా కంబైన్స్ అధినేతలను చేర్చవచ్చు. టి. కాంతికుమార్, పి. రాఘవరావులు నిర్మించే యీ సాంఘికానికి చక్రవర్తి సంగీతానికి, జి. కె. రాము ఛాయాగ్రహణానికి దర్శకులు.

కొత్తవాళ్లకు అవకాశం

మూడు మంచి చిత్రాలను నిర్మించి, ప్రజాభిరుచికి తగ్గ కదల నిచ్చేవాళ్ళుగా పేరందిన రామవిజేతా సోదరులు తమ నాలగవచిత్రం యొక్క షూటింగును మార్చిలో ప్రారంభించాలనుకుంటున్నారు.

ప్రోల్లాప్రగడ వ్రాసిన 'దీపశిఖ'కు భమిడిపాటి మాటలను సమకూరుస్తున్నారు. ముఖ్యనటుడు జగ్గయ్య. ప్రధానపాత్రల పోషణకు కొత్తవాళ్ళను ఎన్నుకోనున్నట్లు నిర్మాత ప్రభాకర్, దర్శకుడు బాబురావు చెప్పారు. ఈ సంస్థకు ఘంటసాల, బుల్ బుల్ పర్మినెంటు సభ్యులు.

నాలుగవచిత్రం విడుదలయ్యే శుభదినాన, 'శైలామజ్ఞ' కలర్ చిత్రం షూటింగును మొదలెట్టాలని ఈ అపూర్వసోదరులు ఆలోచిస్తున్నారు.



నటి : జమున (ఫొటో : అర్జునరావు)



'సంపూర్ణరామాయణం'లో చంద్రమోహన్, శ్యా ల.

ము ప్రసిద్ధ దర్శక నిర్మాత శ్రీ ఆదుర్తి సుబ్బారావు చక్రవర్తి ఆర్ట్ థియేటర్‌కు ప్రారంభోత్సవం చేసినప్పటి ఫోటో. సంస్థ అధ్యక్షులు శ్రీ కె. కె. రావు, ప్రధాన కార్యదర్శి శ్రీ ఎం. రమణలను కూడా కింది చిత్రంలో చూడొచ్చు.



సినిమా

మానవుడు–దానవుడు

ఉషశ్రీసంస్థ నిర్మించే 'మానవుడు–దానవుడు' షూటింగు ఫిబ్రవరి 10తో పూర్తయింది. పి. చిన్నపరెడ్డి వ్రాసిన స్వయంకథకు, మోదుకూరి జాన్సన్ కలం సంభాషణలను సమకూర్చింది.

శోభన్ నటజీవితపు స్థాయిని పెంచే మరొక చిత్రం యిది. అలాగే కృష్ణకుమారికి కూడా పాత పేరును యీ చిత్రం తెచ్చిపెడుతుంది. నాయికగా శారద (భర్త అనురాగాన్ని అందుకునే గృహిణిగా) చక్కగా నటించింది. సత్యనారాయణ నటించిన మరొక వెరైటీపాత్ర యిందులో కనిపిస్తుంది.

మామూలు కథలకు భిన్నంగా సాగే యీ చిత్రానికి ప్రజాదరణ లభిస్తే, మన తెలుగు పరిశ్రమకు కొత్త ఆశ యేర్పడుతుంది. ఈ చిత్రానికి పి. చంద్రశేఖరరెడ్డి దర్శకుడు. అనిల్ ప్రభాస్ విడుదల.

మోసగాడిని మోసగించిన మగువ!

పద్మలక్ష్మీ పిక్చర్స్ నిర్మిస్తున్న 'భలే మోసగాడు' చిత్రం దాదాపు పూర్తయింది.

కయిమ్‌లో వెరైటీ కనిపించే కథ యిందులో వున్నదట. జేమ్స్‌బాండ్ అంటే కృష్ణ అన్న పేరు 'భలే మోసగాడు'తో మరింతగా ప్రకాశిస్తుందట. భలే మోసగాడిని కూడా మోసగించి, తన విధి నిర్వహణలో విజయం పొందిన నాయికగా విజయనిర్మల వైవిధ్యమయిన భూమికను నిర్వహించింది. సెక్స్ డాన్సెస్‌గా పేరందిన జ్యోతిలక్ష్మి, జయకుమారి నృత్యాలు యీ చిత్రంలో ప్రత్యేక ఆకర్షణలట.

క్రయిమ్ చిత్రంలో తుపాకులకు, పోరాటాలకు కొరత వుంటుందా చెప్పండి? అన్ని హంగులు, ఆకర్షణలు నింపుకున్న 'భలే మోసగాడు' మార్చిలో పర్యటించాలని ప్రయత్నిస్తున్నాడట.

'భలే మోసగాడు' కథ, మాటలను విశ్వ



'రంగన్న శపథం'లో
పద్మిని, శివాజీగణేశన్



'అన్నాయిగారు అమ్మాయిగారు'లో వాణిశ్రీ.

ప్రసాద్, సంగీతాన్ని సత్యం; ఛాయను వి ఎస్ ఆర్ స్వామి, కళను రామలింగం, కూర్పును గోపాలరావు, ప్రొడక్షన్ను శ్రీనివాసరావు, సహకార దర్శకత్వాన్ని శ్రీనివాస రెడ్డి నిర్వహిస్తున్నారు. పి వి. కె దుర్గా ప్రసాదరావు సమర్పించే, యీ చిత్రానికి గబ్బిట వెంకటరావు నిర్మాత, పి. సాంబ శివరావు దర్శకుడు ముఖ్యపాత్రలను కృష్ణ, విజయనిర్మల, కృష్ణంరాజు, త్యాగరాజు, కె వి చలం, సి. హెచ్ నారాయణరావు, పెమ్మసాని రామకృష్ణ, అర్జా జనార్దన రావు, రామచంద్రరావు, జ్యోతిలక్ష్మి, జయకుమారి, లీలారాణి, సి. వరలక్ష్మి పోషిస్తున్నారు.

పోటాపోటీగా నటించిన నాయికా నాయకులు

రవీంద్రా ఆర్ట్ పిక్చర్స్ కలర్‌లో నిర్మి యుగళగీతాన్ని ఎస్. పి. బాలసుబ్రమణ్యం సుశీలచే చలపతిరావు పాడింపజేస్తూ అపాటను

స్తున్న 'దత్తపుత్రుడు' చిత్రం 11 రీళ్ళు తయారైంది పల్లెటూరి రైతు యువకుడిగా నాగేశ్వరరావు, అతగాడ్ని వుడికించి, ప్రేమించే యువతిగా వాణిశ్రీ పోటాపోటీగా నటిస్తున్నారట ఈచిత్రంలో చలపతిరావు తన సత్తాను శక్తివంచన లేకుండా చూపించారట. ఇటీవల ఒక యువదర్శకుడు లెనిన్ బాబు రామకృష్ణ, వెన్నిరఆడై నిర్మలపై మనోరంజకంగా చిత్రీకరించారు

ఆద్యంతం ఆసక్తిని, అనురక్తిని కలిగించే బలమైన కథగాన్న 'దత్తపుత్రుడు'కి పినిశెట్టి మాటలను, చలపతిరావు సంగీతాన్ని, ఎప్. వెంకటరత్నం ఛాయను, సంజీవి కూర్పును, జి. వి. సుబ్బారావు కళను నిర్వహిస్తున్నారు.

నిర్మాత తమ్మారెడ్డి కృష్ణమూర్తికి 'దత్తపుత్రుడు' ధనప్రాప్తిని యిచ్చే



'బీదలపాట్లు'లో నాగేశ్వరరావు.



'వంశోద్ధారకుడు'లో కాంచన.

విధంగా నిర్మితమవుతున్నట్టు తెలుస్తోంది. గత చిత్రాలన్నీ విజయవంత మవడంవల్ల, యీ చిత్రంపట్ల మరింత ఆశలను ప్రేక్షకులు పెంచుకుని వున్నట్టు తెలుస్తోంది ఈ చిత్రం ఒక మంచి దర్శకుడ్ని వెండితెరకి పరిచయం చేస్తుంది ఈ చిత్రంలోని ముఖ్యపాత్రలను నాగభూషణం, రామకృష్ణ, పద్మనాభం, అల్లు రామలింగయ్య, మిక్కిలినేని, బాలకృష్ణ, జగ్గారావు, వల్లం, రమాప్రభ, శాంతకుమారి, సూర్యకాంతం ధరిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక మహాసభలు ప్రథమ కళోత్సవ పోటీలు ఏప్రిల్ 6 నుండి 9 వరకు విజయవాడ శ్రీ హనుమంతరాయ గ్రంధాలయం ఆడిటోరియంలో జరుగుతాయి ఈ పోటీలో నాటకాలు, నాటికలు, ఏకపాత్ర, వ్యాసరచన, గేయరచన, స్వీయగేయ రచనాపరవం, లలిత సంగీతం వుంటాయి.

'కళ కళకోసంకాదు; కళ ప్రజల ప్రయోజనకరమైన సంతతాభ్యుదయం కొరకు; కళ మానవునిలోవున్న మాలిన్యాన్ని క్షాళనచేసి మంచిని వెదికి వెలికి తీసే వాడిగల అత్యుత్తమ సాధనంగా వుండాలి, కళ యీనాటి సంఘాన్ని వేధిస్తున్న వివిధ సమస్యల పరిష్కారానికి వుపకరించేదిగా వుండాలి.' అనేది ఆశయా లను గొన్న సంస్థయిది.

పోటీలలో పాల్గొనే సమాజాలు, కళాకారులు ఫిబ్రవరి నెలాఖరు వరకు (ఎంట్రీలు) ప్రవేశరుసుం కట్టవచ్చును ప్రాథమిక పరిశీలన మార్చి 19 నుండి 26 వరకు వుంటుంది.

సినిమా

గంగాధరరావు హిందీ చిత్రం

నవశక్తి అధినేత గంగాధరరావుకు హిందీరంగం ఘనస్వాగతం పలికింది ఆయన నిర్మించిన 'ఏక్‌నారీ ఏక్ బ్రహ్మచారీ' చిత్రం బహుళ ప్రజాదరణ పొందింది. ప్రజలు, పత్రికలు ప్రశంసాగాత్మని కొనియాడాయి.

జితేంద్ర—జయబాధురి

మొదటిచిత్ర విజయాన్ని పురస్కరించుకుని. తన రెండవ హిందీచిత్రాన్ని



శ్రీవహానపుడు—దానవుడు'లో శారద.

యిటీవలే గంగాధరరావు ప్రారంభించారు. 'విందు సంసారం' కథను హిందీలో నిర్మిస్తున్నారు కె పి ఆత్మా దర్శకుడు.

శోభన్ తీసుకున్న నిర్ణయాలు


తనకు మార్కెట్టు వచ్చిందిగదా అని విగిరెగిరి పడకుండా, కడు జాగత్త వహించి, మంచి నిర్మాణసంస్థలు, (చక్కటి పాత్రలున్న కథలు) నిర్మించనున్న చిత్రాలనే అంగీకరించడానికి నిర్ణయించారు.

'తాసిల్దారుగారి అమ్మాయి' చిత్రంలో తన నటన ఏమాత్రం దెబ్బతిన్నా, తన కెరీర్‌కే భంగం వాటిల్లివుండేదని, ఆ చిత్రంలో తన విజయానికి ఎక్కువ శ్రమించింది దర్శకుడు ప్రకాశరావు గారేనని శోభన్ చెప్పారు. (గుంటూరు సిటీ క్రిటిక్‌వారు ఉత్తమ నటుడిగా ఎన్నుకున్నారు)

ఆదివారం విశ్రాంతి రోజూ సరిగ

సినిమా డైరీ

- డి. బి. ఎస్ 'అబ్బాయిగారు—అమ్మాయిగారు' చిత్రం 13 రీళ్లు తయారైంది. వి. రామచంద్రరావు దర్శకుడు
- శ్రీలక్ష్మి ప్రొడక్షన్స్ 'పావం పసివాడు' కలర్‌చిత్రం 6 రీళ్లు తయారైంది వి రామచంద్రరావు దర్శకుడు.
- పద్మశ్రీ పిక్చర్స్‌వారి కలర్‌చిత్రం 8 రీళ్లు పూర్తయింది పి పుల్లయ్య దర్శకుడు
- రవీంద్రా ఆర్ట్ పిక్చర్స్ 'దత్తపుత్రుడు' కలర్‌చిత్రం 12 రీళ్లు తయారైంది టి. లెనిన్‌బాబు దర్శకుడు
- రాజమండ్రి నవభారత్ గురుకులంలో 'తాసిల్దారుగారి అమ్మాయి' శతదినోత్సవం కోలాహలంగా జరిగింది అక్కినేని అధ్యక్షత వహించారు.
- జెమినీ పిక్చర్స్‌వారి 'కలెక్టర్ జానకి' మార్చి 10న అనిల్ ప్రతాప్ ద్వారా విడుదలవుతుంది. ఎస్ ఎస్ బాలన్ దర్శకుడు
- అన్నపూర్ణా కంబైన్స్‌వారి ద్వితీయ చిత్రంలో శోభన్ నాయకుడు కె విశ్వనాథ్ దర్శకుడు
- ఎస్. వి. ఎస్ పిక్చర్స్ నిర్మించనున్న చిత్రానికి 'డబ్బుకు లోకం దాసోహం' అని పేరు పెట్టారు డి. యోగానంద్ దర్శకుడు
- చక్రవర్తి ఆర్ట్ థియేటర్ (రిజిష్టర్డు) అవతరణోత్సవం హైద్రాబాదు రవీంద్ర భారతిలో 23—1—72 న బాక్సాఫీసు దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు చేతుల మీదుగా జరిగింది సభాధ్యక్షులు కె వి గోపాలస్వామి అవతరణోత్సవ సంచికను ఆవిష్కరించారు.


ఒక ఖైదీ కొడుకు-గొప్పింటి అల్లుడు
ఎలా అయాడు?
సరికొత్త తరహా చిత్రం!
విజయలక్ష్మీ మూవీస్ వారి
అమ్మమాట
నిర్మాత-జి.వి.యస్.రాజు దర్శకత్వం-వి.రామచంద్రరావు
సంగీతం-రమేష్ నాయుడు * ఛాయ కన్నప్ప * మాటలు-భమిడిపాటి
VEEKAY

లించడంవల్ల, తన స్వంత విషయాలను తలోచించడానికి, తన వాళ్లతో మనసు విప్పి మాట్లాడడానికి అనువుగా వుందని చెపుతూ, ముమ్ముందు శనివారంను షిని షింగ్ పిక్చర్స్‌కి కేటాయించ దలచినట్లు శోభన్ వెల్లడించారు.

'సంవత్సరానికి 8 చిత్రాలంటే చాలు ఎక్కువ చిత్రాలు అంగీకరిస్తే, మానసిక క్లేశ, శరీర శ్రమ కొని తెచ్చుకున్నట్లు అవుతుంది. నాకిప్పుడు వున్న నిర్మాతలందరూ చాలా మంచివాళ్ళు. చేస్తు వున్నవాళ్ళు అందువల్ల భవిష్యత్తులో

సినిమా

నా చిత్రాల్లో వెరైటీ కనిపిస్తుంది' అన్నారు శోభన్ ఒకచిత్రం విడుదలయిన మరో (నా చిత్రాలకు) నాలుగు వారాల గ్యాప్‌తోనే మరో చిత్రాన్ని విడుదల చెయ్యవలసినదిగా, నా నిర్మాతలను కోరాను కూడా' అన్నారు హీరో శోభన్.

భరతం అభ్యసించిన అమెరికన్ అమ్మాయి!

మద్రాసు కళాక్షేత్రంలో అయిదేళ్ల నుంచి ఒక అమెరికన్ అమ్మాయి భరతం నేర్చుకుంటూంది, ఆమె పేరు కెరెన్ కార్డెల్

'బాలే నృత్యంకంటే భరత నాట్యంలో మరింత శారీరక శ్రమ, మానసిక ఏకాగ్రత అవసరం' అనేది సత్యాన్ని కార్డెల్ అంగీకరించింది 'ఈ నృత్యంలో సంక్లిష్టమైన పదవిన్యాసం, ప్రగాఢ ఆధ్యాత్మిక లక్షణాలు' అని ఆమె అంటుంది

బాలసరస్వతి శిష్యురాలా!

భారతీయ నర్తకీమణి బాలసరస్వతి



కెరెన్ కార్డెల్.

నృత్యకళా కౌశలం, సోయగం చూచి ముగ్ధురాలయిందట, కార్డెల్ ఆ క్షణంలో—తనుకూడా భరతం అభ్యసించాలని నిర్ణయించిందట

అమెరికన్ విమానయాన సంస్థలో మంచిజీతం లభించే వుద్యోగాన్ని మానేసి, భరతనాట్యం నేర్చుకొనటానికి కార్డెల్ 1967 లో మద్రాసుకు వచ్చింది వచ్చిన కొత్తలో ఆహార, ఆహార్యాలు కొంత యిబ్బంది కలిగించినా, క్రమేణా మన వాతావరణం ఆమెకు నచ్చింది భరతంతో బాటు సంస్కృతం, కర్నాటక సంగీతంలో కూడా యీ లాస్ ఏంజలిస్ బాలికకు ప్రవేశంవుంది.

అమెరికాలో ప్రచారం

ఏప్రిల్‌లో అరంగేట్రం జరిపి, తర్వాత అమెరికా వెళ్ళి, భరత నాట్యకళను గురించి అక్కడ ప్రచారం చెయ్యాలనే వుత్సాహం కార్డెల్‌కి వుంది 'జీవితాలను, జీవిత ధోరణినే మార్చివేయగల శక్తి భరతానికి వుంది' అంటుంది మిస్ కార్డెల్.

—శ్రీనివాస్ ●

మీకు తెలుసా?

నటి భారతికి యిటీవల తలమీద దెబ్బ తగిలిందట

సంగీత దర్శకుడు చక్రవర్తి బాత్‌రూమ్‌లో జారిపడి. స్వల్ప గాయాలతో బయట పడ్డాడట.

'కులగౌరవం' చిత్రంలో ఎన్టీఆర్ మూడు భూమికలను నిర్వహిస్తున్నారు

రామ విజేతావారి నాలగవ చిత్రంలో కొత్తవాళ్ళు ప్రధాన పాత్రలను పోషిస్తారట.

మన సినిమావాళ్ల యిండ్లపై యిన్‌కమ్‌టాక్స్ వాళ్ళు దాడి చేసారట. (గత వారం)

జైహింద్ సత్యం జాతీయ రక్షణ నిధికి రు. 505 లు యిచ్చారట

విద్యావంతులు పెరిగినప్పుడే ఉత్తమచిత్రాలువస్తాయి-నాగేశ్వరరావు

'దేశంలో అక్షరాస్యుల సంఖ్య చాలా స్వల్పం వీరిలో సినిమాలు చూచేవారి సంఖ్య బహుస్వల్పం. నిర్మాతలు ఎన్నో వ్యయప్రయాసలు పడి ఎంతో మొత్తం వెచ్చించి చిత్రం నిర్మించినా థియేటర్ల నుండి తిరిగి వచ్చేడబ్బు చాలా స్వల్పం. సినిమా ప్రదర్శనలపై వచ్చే ఆదాయంలో 15 శాతం దుబరా అవుతున్నది. దీనిని అరికట్టాలి. పురపాలకసంఘాల ఆదాయంలో 33 శాతం సినిమాలద్వారానే లభిస్తున్నది.'

'విద్యావంతులు దేశంలో 26 శాతం వున్నారు. వీరిశాతం బాగా పెరిగినప్పుడే ఉత్తమశ్రేణికి చెందిన చలనచిత్రాలు వచ్చేందుకు అవకాశంవుంటుంది. అప్పటి వరకు ఇప్పుడు వచ్చేస్థాయి చిత్రాలకన్నా, ఉత్తమస్థాయి చిత్రాలు రావటం అసంభవం, ఏమైనప్పటికి మనం మారుతున్న దశలో వున్నందున భవిష్యత్‌లో ఉత్తమ చిత్రాలు రాగలవని ఆశిస్తాను.'

సినిమాలలో సెక్సు, నగ్ననృత్యాలు ప్రదర్శించటం తప్పేనని అంగీకరిస్తాము. అయితే ఈలాంటి చిత్రాలను పెద్దలుగా విద్యావేత్తలుగా, మేధావంతులుగా చెలామణీ అవుతున్నవారే ఎక్కువగా చూచి ఆదరించటం జరుగుతూవుంది. ఈ పెద్ద మనుషులే సినిమాలో సెక్సును విమర్శించటం కూడా జరుగుతుంది. అందుచేత ఈ తరహా వ్యక్తులు ఒక పర్యాయం ఆత్మ పరిశీలన చేసుకోవటం అవసరం అంటాను.

'సినిమారంగం అంటే అదేదో భూతల స్వర్గం అని, నటీనటులు అమరసుఖాలనుభవిస్తారని సామాన్యంగా ఊహిస్తారు. యిది సరికాదు వట్టి ఊహమాత్రమే. ఈ రంగంలో ఎన్నో సాధకబాధకాలు ఎదుర్కోనటం, కష్ట, నష్టాలకు లోను కావటం జరుగుతూ వుంటుంది.'

'నా 28 ఏండ్ల నటజీవితానుభవంలో విశ్రాంతి అనేది లేకుండా క్రమశిక్షణతో నడుచుకుంటూ, ఆహార, విహారాల్లో కొన్ని కట్టుబాట్లు ఏర్పరుచుకుని శరీరాన్ని కాపాడుకుంటూ వస్తున్నాను.'

'నాకంటే సమర్థుడైన నటుడు రావాలనే నేను కోరుకుంటాను—అలా కోరుకొననపుడు అతడు ఎంతటివాడైనా పతనంకాక తప్పదు. అదేవిధంగా థియేటర్ల వారు కూడా తమకంటే మంచివి, ఆధునికం, అందమైన థియేటర్లు యింకా రావాలని కోరకోవాలేగాని స్వార్థ చింతనతో వాటివల్ల తమ వ్యాపారానికి పోటీ తగులుతుందనుకోవటం శుద్ధపొరపాటు. పోటీ అంటూ వున్నప్పుడే ఏరంగం అయినా అభివృద్ధి చెందుతుంది.'

చలనచిత్రాల సంఖ్యకు అనుగుణంగా థియేటర్ల సంఖ్య రాష్ట్రం అంతటా పెరగాలి.

'విజయవాడవంటి నగరంలో నిత్యం వచ్చి పోయే ప్రజలకు యింకా ఎన్నోథియేటర్ల అవసరం ఎంతోవుంది. ఈ పట్టణంలోని సంపన్నులు ఆధునిక పద్ధతుల్లో థియేటర్లు నిర్మించి ఆలోపం తీర్చుతారని' ఆశిస్తాను అని 'నటసామ్రాట్' 'పద్మశ్రీ' అక్కినేని నాగేశ్వరరావు అన్నారు.

(విజయవాడలో ఫిబ్రవరి 16 న 'అప్సర' థియేటరుకు ప్రారంభోత్సవం చేస్తూ ఎ. ఎన్. ఆర్. చేసిన ప్రసంగంలోని ప్రధాన భాగాలు).

సినిమా రంగంలో గెజిటెడ్ నాన్‌గెజిటెడ్ తారలు

'ప్రభుత్వంవారి వివిధశాఖల్లోవున్న గెజిటెడ్— నాన్‌గెజిటెడ్ అధికారుల మాదిరిగానే ఫిలింపరిశ్రమలో కూడా అగ్రశ్రేణితారలు గెజిటెడ్‌గాను— మిగిలిన వారు నాన్‌గెజిటెడుగా వ్యవస్థ ఏర్పడి వుంది. ఫిలిం పరిశ్రమలో కూడా చిన్న తారలు పలు యిక్కట్లకు లోనుకావటం తరుచు జరుగుతూనే వుంటుంది. ప్రభుత్వశాఖలలోనూ ఫిలిం పరిశ్రమలోని మా వృత్తికీ చాలా దగ్గర పోలికలు— సన్నిహిత సంబంధాలు వున్నాయి.' మైల్సు శీఘ్రగతిని కదిలేలాగు చూచుకొని ప్రజా సానుభూతిని సంపాదించాల్సిందిగా ఎన్.జి.జి.వో. లకు సలహా యిచ్చారు ప్రసిద్ధ సినీనటీమణి కుమారి కాంచన.

ఎన్.జి.జి.వో.ల సంఘం బందరు పట్టణ వార్షికోత్సవం ముగింపు సమావేశం ఫిబ్రవరి 1 న ఆంధ్ర జాతీయ కళాశాల ఆడిటోరియంలో కృష్ణా జిల్లా కలెక్టరు శ్రీ చావలి శ్రీనివాసశాస్త్రి అధ్యక్ష

క్రమ జరిగింది. జిల్లా పోలీసు అధికారి శ్రీ కె. విజయ రామారావు కళాభిమానిగా సాంస్కృతిక కార్యక్రమాలకు హాజరైనారు.

కలెక్టరు సతీమణి శ్రీమతి మణి శాస్త్రి, ఎన్. జి. జి. ఒ. సంఘం తరపున, కుమారి కాంచనకు నూతన వస్త్రాలు, ఫలపుష్పాదులు సమర్పించి సన్మానించారు.

తమకు బందరుపురం ఆడపడుచుగా ఘన సత్కారం జరిపినందుకు కుమారి కాంచన కృతజ్ఞత తెలిపారు.

శ్రీ జి. వి. జి. వి. కృష్ణంరాజు స్వాగతంచెప్పారు. శ్రీ పిచ్చయ్యశాస్త్రి వందన సమర్పణ చేసారు.

మొదటి రోజు సమావేశానికి అధ్యక్షత వహించిన ఆంధ్రప్రదేశ్ అమ్యూచూరు స్టేజి ఆర్టిస్టు ఫెడరేషను కార్యదర్శి శ్రీ విడియాల చంద్రశేఖర రావు బందరులో సాంస్కృతిక సంఘాల అభివృద్ధికి ఆరు బయలు థియేటరు అవుసరాన్ని వివరించారు. —పిడుగు రామలింగయ్య

అవీ...ఇవీ

తిరుపతిలో కథక సమ్మేళనం

రిపబ్లిక్ దినోత్సవం నాడు తిరుపతి రోటరీ క్లబ్బువారు శ్రీ వేంకటేశ్వర ఉన్నత పాఠశాల ఆవరణలో శ్రీ ఎస్. వి. రామకృష్ణ అధ్యక్షతన కథక సమ్మేళనం ఏర్పాటు చేశారు. డాక్టర్ విశ్వనాథ అరుణాచలం మారుతున్న సమాజంలో కథకుల బాధ్యతని గురించి వివరిస్తూ ఈ సమ్మేళనానికి నాందీ వాచకం పలికారు. 'మాగజైన్ వీక్' సందర్భంగా కథకుల సమ్మేళనం ఏర్పాటు చేయడం ఎంతో ఉచితంగా ఉందని శ్రీ చయనులు తమ ప్రసంగంలో పేర్కొన్నారు. ఆధునిక సాహిత్యంలో కథానికకి ఉన్న స్థానాన్ని గురించి శ్రీ కె. రామిరెడ్డి ప్రసంగించారు.

అనంతరం శ్రీయుతులు కొలకలూరి ఇనాక్' టి. రామారావు, కలువ కొలను సదానంద, పులికంటి కృష్ణారెడ్డి, మధురాంతకం రాజారామ్, కె. రామిరెడ్డి ఆచంట జానకిరాం, శ్రీమతులు కె. మీరాబాయి, భాస్కర స్వర్ణాంబ, కుమారి నిడదవోలు మాలతి గార్లు తమ తమ కథలని చదివారు.

కథకులని చందన పుష్ప తాంబూలాదులతో, దుశ్శాలువలతో శ్రీ వెంకటాచలం సత్కరించారు.

రోటరీ క్లబ్బు కార్యదర్శి శ్రీ పి. సుదర్శనం వందన సమర్పణ చేశారు. (ఒ. వి.)

పునర్జన్మ నాటక ప్రదర్శనం

హైదరాబాదులోని శ్రీ శ్రీనివాస సాంస్కృతిక సంఘంవారు శ్రీ బెల్లంకొండ రామదాసు రచించిన 'పునర్జన్మ' నాటకాన్ని యిటీవల రవీంద్రభారతిలో శ్రీ పి. వెంకటేశ్వరరావు దర్శకత్వంలో విజయవంతంగా ప్రదర్శించారు. —(ఒ. వి.) ●

పుస్తకాలు

'బహుకుటుంబి'

రచయిత్రి: మునుపల్లె సరోజినీదేవి, ప్రకాశకులు: ఛాయా పబ్లికేషన్స్, విజయవాడ, వెల రూ. 4/—

బహుకుటుంబి అనే యీ నవల ఇళ్ళు కలవాళ్ళు, అద్దెకున్న వాళ్ళ మధ్యనొచ్చే చిన్న పెద్ద మాట్లాటల, పోట్లాటల సముదాయం. ఈ తగవుల్లో చిన్నవీ పెద్దవీ, అసహ్యకరమైనవీ కూడా వున్నాయి. కథలో ఇతివృత్తం అనేది లేదు. వున్నదే యితివృత్తం అనుకోవాలి. ఏ పాత్ర ఎక్కడ ఆరంభమవుతున్నదో అదెక్కడ ఎందుకు అంతమవుతున్నదో తెలుసుకోవాలని ప్రయత్నించ కూడదు. మురళి అనే యువకుడు పేద సంసారంలో గంపెడు పిల్లల మధ్య పుట్టినా, సంపాదన విషయాలు, తండ్రి ఆదాయవ్యయాలు తెలిసినా, ప్రతిరోజు అన్నం దగ్గర తల్లినీ, తన అప్పచెల్లెళ్ళనూ నానామాటలూ అంటూంటాడు. అసలు మురళి పాత్ర ప్రవేశ పెట్టడానికి కారణం ఏమిటో చదువరికి కొరుకు పడదు. ఇలా నడిచిన యీ నవలలో చెప్పుకో దగ్గ సంఘటన మచ్చుకి ఒకటైనా లేదు. అంతే గాక వెల కూడా కాస్త ఎక్కువే. —భూపతి

స్పాన్ చయనిక 1970

విశిష్ట వ్యాసాల సంకలనం

ప్రచురణ : అమెరికా సమాచార కార్యాలయం, బహావల్‌పూర్ హౌస్, సికంద్ర రోడ్, న్యూఢిల్లీ. పబ్లిషర్ : డేనియల్ పి. ఎలెక్సి. తెలుగు ఎడిటర్: బి. ఎస్. ఆర్. క్రిష్ణ.

96 పుటలున్నయ్ యీ సంకలనంలో. డాక్ మొరేస్ వ్యాసం ఉత్తరాదిన బంగారం, ఆకలి— అభివృద్ధి సమస్య, నగరాలలో సంకటం, మనం ఇరవై ఒకటవ శతాబ్దానికి సిద్ధంగా ఉన్నామా? టాగోర్‌ను అమెరికా గౌరవించిన తీరు, లింకన్ గడ్డం పెంచిన కథ, గాంధి, అమెరికా, ఆన్సెల్ ఆడమ్స్: ప్రకృతి సౌందర్య ప్రకటన కర్త, గత దశాబ్దపు గుణపాఠాలు, ఈ దశాబ్దపు సవాళ్ళు, చక్రభ్రమణం కోసం నా వేసవి సెలవులు, సాగర గర్భంలో రెండు వారాలు, బొమ్మలాటతో కుటుంబ నియంత్రణ ప్రచారం, పీటర్ సిద్ధాంతం, చంద్రుని మీదికి వంతెన, కొత్త విమాన యుగంలోకి, సత్యజిత్‌రాయ్ ప్రపంచం, భాషాశాస్త్రవేత్తతో పరిచయం, స్వర్ణోత్సవం, స్టోల్ప్ కుటుంబం, దేశానికి జీవనాడి అనే వ్యాసాలున్నాయ్. అన్నీ చదవతగిన వ్యాసాలే. అందంగా అచ్చు వేశారు. రంగు రంగుల బొమ్మలున్నయ్. 33వ పుటలో టాగోర్ బొమ్మ, 41 వ పుటలో గాంధి బొమ్మా ఉన్నాయ్. ఇవి ఆకర్షణలు.

ఈ సంకలనం పేరు ఆంగ్లంలో స్పాన్‌ధాలజీ 1971 అని ఉన్నది అట్టమీద. తెలుగులో సరి స్పాన్ చయనిక 1970 అని ఉన్నది. స్పాన్ పత్రికలో వెలువడిన ఉత్తమ వ్యాసాలకి తెలుగు అనువాదాలు.

ఈ అనువాదాలలో ఒక శైలి కనిపించుతుంది. ఉదాహరణలు : '... జనాలు వదలిపోయిన గుడిసెల గ్రామాలు పడి ఉన్నాయి (3వ పుట) గ్రామాలు పడి ఉండడమంటే యేమిటో? 'మార్గమంతటా కాస్త నోరు తడుపుకోనడానికి (3వ పుట) 'నోరు కాస్త తడుపుకొనడానికి' అని వ్రాసి ఉంటే, బాగుండేదేమో! ఒదేవిధంగా 4వ పుటలో ఆ ఎడారిని 'అర్ధం చెయ్యడం'అని ఉన్నది. 'అర్ధం చెయ్యడం' అనే మాటకు బదులు తడపడం అనే మాటను ఉపయోగించితే ఎక్కువ హాయిగా ఉండదా? 34 వ పుటలోని '...అమెరికాలో నడిచిన గాంధి శతజయంతి ఉత్సవాలను ..' అనే వాక్యంలో నడిచిన అనే మాటకు బదులు జరిగిన అనే మాటను ఉపయోగించితే అర్థం చెడిపోతుందా?

44 వ పుటలో మరొకవారు 'గాంధి అపరాని, మార్పు వీలులేని నిధి సమీకరణ కర్త' అనే వాక్యం బాగున్నదా? సంకలనంలోని వ్యాసాంలో ఉపయోగించిన శైలికి ఈ వాక్యాలు కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఈ వ్యాసాల ప్రయోజనానికి ఈ శైలి వల్ల చెరుపేమీ జరగలేదు. ఇంత చక్కగా ముద్రించిన యీ సంకలనం లక్ష్యం యేమిటో మరి? విజ్ఞానమా? విజ్ఞాన ప్రచారానికి ఉపయోగపడే వ్యాసాలలో ఒకటి పీటర్ సిద్ధాంతం (63వ పుట)

> 'ప్రతి ఉద్యోగి తను సమర్థంగా
> నిర్వహించగల ఉద్యోగం నుంచి తన
> అసమర్థత రుజువయ్యే ఉద్యోగానికి
> ప్రమోషన్ పొందుతాడు...'
> 'ఏ ఉద్యోగి అయినా పైపైకి వస్తూంటే
> ఏదో ఒక పదవికి వచ్చేసరికి
> అసమర్థు డవుతాడు.'
> ఈ హయరార్కియాలజీ అతి కొత్త
> శాస్త్రమైనప్పటికీ, ప్రభుత్వ ప్రైవేటు
> రంగాలలో నిర్వహణ పరిశీలించడానికి
> ఎంతగానో ఉపయోగపడుతూంది (65వ
> పుట) ఈ శాస్త్రం నిజంగా శాస్త్రమేనా?,

అయితే అది ఒక్క అమెరికాకు మాత్రమే ఉపయోగపడే శాస్త్రమా? ప్రజాస్వామ్య వ్యవస్థ ఉన్న దేశాలన్నింటికీ ఉపయోగపడుతుందా? —వి. ఎస్. అవధాని

వ్యాసకదంబము

రచన : శ్రీ బులుసు వెంకటరమణయ్య, క్రౌన్ సైజు 108 పేజీలు, వెల. రు. 2—50 పై. ప్రతులకి : శ్రీ బులుసు వెంకటరమణయ్య, 34, పురుషోత్తమనగర్, క్రోమ్‌పేట, మదరాసు—41.

పలువిధములైన పుష్పములు వేర్చి కూర్చి దండగా గుచ్చినది కదంబ మనబడుతుంది. భారతి, గృహ

లక్ష్మీ మాసపత్రికలలో, వివిధ విజ్ఞాన సాహిత్య విషయాలను గూర్చి శ్రీ బులుసు వెంకటరమణయ్య గారు రచించిన సాహితీ వ్యాసము లన్నింటినీ యేర్చి కూర్చి ప్రకటింపబడిన యీ గ్రంథమునకు, 'వ్యాసకదంబము' అను నామకరణము సమంజసమైనది.

'గ్రంథకర్త ఆంధ్ర వాఙ్మయ లోకమునకు చిరపరిచితులే. వ్యాకరణ వ్యాఖ్యలు వ్రాసిన మహా పండితులై తెలుగు సాహితీరంగంలోని చర్చనీయ శాస్త్ర విషయాలను, లలిత పల్లవ కుమార కవితా చమత్కృతులను సరళ భావ విశేషాలను హృదయంగమంగా వివరించి సాహిత్య పిపాసులకు మార్గదర్శకులైనారు. గ్రంథ రచనలో ప్రధానాంగమైన 'కావ్యాత్మ'నుగూర్చి భరతముని మొదలు మమ్మటుని వరకు గల ఆలంకారికుల వాదములను వివరించి, చివరకు 'వాక్యం రసాత్మకం కావ్యం'అని రసప్రాధాన్యమును సహేతుకంగా గ్రంథకర్త నిరూపించారు.

'శ్రీనాథుని కర్ణాట భాష' 'పాగడదండ' 'శ్రీనాథుని విశిష్ట ప్రయోగములు' అను వ్యాసాలలో కవి సార్వభౌముని కర్ణాట భాషా పాండిత్యమును, అతని ప్రయోగముల విశిష్టతను సోదాహరణంగా, చక్కగా వివరింపబడినవి. 'నా కవిత్వమ్ము నిజము కర్ణాట భాష' అన్న శ్రీనాథుని వాక్యంలోని ఔచిత్యమును సమంజసంగా వివరింపబడినది. 'పురవీధి నెదురెండ బొగడదండ'లోని పాగడదండ, ఒక పూలదండ కాదనీ పూర్వకాలపు శిక్షా సాధనమైన 'బొగడదండ' మాత్రమే అని అర్థ వివరణము చక్కగా చేయబడినది. ప్రసిద్ధమైన కొన్ని కవి సమయములను వివరిస్తూ, కొన్ని ప్రకృతి విరుద్ధ కవి సమయముల పుట్టుపూర్వోత్తరములను పరిశోధించి, వివరించి గ్రంథకర్త సహృదయతను వెల్లడించారు. 'అవంతీ సుందరి' 'వైదికయుగమున వనితల స్థానము'లలో ఆకాలపు స్త్రీల ఔన్నత్యమును, పతివ్రతాధర్మం లోనే కాక పాండిత్య ప్రకర్షలో కూడా స్త్రీలగ్రస్థానం వహించినట్లు, వారిని పండితు లెక్కువ గౌరవించినట్లు విశదీకరింపబడినది. 'లక్షణ దీపిక' 'లక్షణములు'లోని లక్షణ వివరణలు, పూర్వకవుల లక్షణములను నిరసించే ఆధునిక కవులకు కనువిప్పుగా వుండగలవు. ప్రాచీనుల లక్షణాలను అనుసరించలేక, నాటిని విమర్శించుట కంటే నేటి యభిరుచులకు, భావాలకు తగినట్లు లక్షణములను మార్చుకొనుట యుక్తము, అన్న గ్రంథకర్తగారి అభిప్రాయ మెంతయు సమంజసమైనది.

ఈ వ్యాస కదంబములోని పన్నెండు వ్యాసపుష్పములు కూడ సుగంధ నిలయాలైన ఉత్తమ జాతి పుష్పములు. వాటి సౌరభమును, సౌందర్యమును విస్తరించుట కిచ్చట వీలుపడదు. ఈ వ్యాసములు తెలుగు సాహిత్య జిజ్ఞాసులందరకు కొంత వరకు సందేహ నివృత్తిని కలిగించుటకు, సాహితీ పిపాసులలో అధిక పరిశోధనాసక్తిని, ఉత్సుకతను వర్ధిల్లచేసి మరికొన్ని ఉన్నత వ్యాసకదంబములతో ఆంధ్ర భారతి కంఠసీమ నలంకరింప చేయుగలవని ఆశిస్తున్నాను.

—ఆకొండి గౌరీదేవి

రెండు నవలలు!

1. స్నేహం 184 పేజీలు రూ. 4.

2. నగటు మనిషి 224 పేజీలు రూ. 5.

రచన : శ్రీ ఆదివిష్ణు. ప్రచురణ : నవజ్యోతి పబ్లికేషన్స్, ఏలూరురోడ్డు, విజయవాడ—2.

నాకు అమ్మానాన్నా లేరు. అన్నదమ్ములేరు. ఎవరో పెంచారు. వాళ్ళ మీద నాకు మొదటి నించీ గౌరవం లేదు. నేను స్వతంత్ర జీవిని. నా కెవరూ లేకపోయినా ప్రాణం పెట్టే మంచి స్నేహితులు కొందరున్నారు. ఈ జీవితం సాగుతూ నాకు మంచి స్నేహితులే దొరుకుతున్నారు— ఇది నరసరాజు కథ.

నట్టుమేమిటీ సినిమాలేమిటి. నీకీ పాడు ఆలోచన వద్దు. వద్దన్నా వద్దు —అని తల్లి చెబితే వినకుండా వెళ్ళిపోయింది రత్నం. తల్లిలాగా చెడిపోయినా, ఆమె లాగా రాణి కాకుండానే మధ్యలో ఓడిపోయి దేశాలట్టుకు తిరుగుతూంది రత్నం. ఆ రత్నమే నీలవేణి— ఇది నీలవేణి కథ.

రాధ గొప్పఇంటి పిల్ల. ఆ పిల్ల భవిష్యత్తు కాలేజీ అల్లరి వల్ల దెబ్బతిన్నది. కనుక వచ్చిన సంబంధాలు వచ్చినట్టే తిరిగి వెళ్ళిపోయాయి. అయితే నరసరాజే



1972లో జరిగే అమెరికా అధ్యక్షుని ఎన్నికకి డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి శ్రీమతి షెర్లీ చిషోమ్

వాళ్ల ఆగా పెట్టుబట్టి కూచుందా అమ్మాయి. అలా, జరక్కపోతే ఆఘాయిత్యం చేస్తానంటోంది —ఇది రాధ గాథ.

పంచనతో నరసరాజు స్నేహం సంపాదించింది నీలవేణి. నయాన అయినా అతని దరి చేరలేక పోయింది రాధ. అయితే, రాధనీ నరసరాజునీ ఒకటిగా చేసే అవకాశం గౌరీపతికీ సోమయాజులుకీ కలిగింది. వాళ్ళ పరిచయం విరోధంతో ప్రారంభమయింది కాలేజీలో. అయినా, స్నేహం స్నేహంగానే ముగిసింది.

రాజారావూ శ్రీనివాసరావూ నరసరాజుకి జీవితంలో మరిదరు మంచి నేస్తాలు. మంచి స్నేహితుల మధ్యని పొరపొచ్చాలు వచ్చినా అవి మధ్యలోనే పోతాయి. చివరి దాకా చెక్కుచెదరక నిలిచే స్నేహమే మంచి స్నేహం.

ఆ స్నేహం అలా ఉండగా— కథానాయకుడు శ్రీనివాసరావు జీవితంలో ఆడుకుని, సగటు మనిషిని సగటు మనిషి గానే వదిలి అతన్ని ఆదర్శజీవిగా చేసినవాళ్ళా స్నేహితులే.

నాటకంలో ఆఫీసరుగా నటించినా శ్రీనివాసరావు నిత్యజీవితంలో మామూలు గుమాస్తాయే. అతని సీటు పేరే అతని పేరు కాగా, వెరసి అతనొక సగటు మనిషి. ఆ సగటు మనిషికి ఆత్మాభిమానముంది, మనో నిబ్బరమూ ఉన్నది. ఎవరికీ తలవంచడు, చెయి చాచడు. ఆర్థికంగా ఆదుకునేందుకు భార్య ఉద్యోగం చేస్తానంటే ససేమిరా సహించడు.

భార్యా, ముగ్గురు బిడ్డలూ, సుస్తీతో ఉన్న తల్లీ, చాలీచాలని జీతం, అందని కోరికలూ— ఇవీ అతని ఆస్తి, కావాలంటే ఆ కోరికలూ తీరే మార్గాలు సుఖపడే సంతూ లేకపోలేదు. కానీ, వన్నె దీరిన అతని వ్యక్తిత్వం ముందు నీటికి చోటులేదు.

సమస్యకి తగిన కథవస్తువు, సన్నివేశాలూ పాత్రచిత్రణా, సంభాషణలూ ఈ నవలను తీర్చిదిద్దాయి.

అయితే శ్రీనివాసరావు కథ ఈ నవలతో ఆగిపోలేదు— ఆదివిష్ణుగారి ఈ మాటలు మరొక చక్కటి నవల కోసం ఎదురు చూడమనే సూచనగా మనం తీసుకుందాం. **—శివకుమారి**

రెండు గద్యగేయ రచనలు

1. **రతీప్రద్యుమ్నము:** వచనకావ్యము. కర్త: శ్రీ రావికంటి—వసునందన్, డెమ్మీ 16+106 పేజీలు. వెల: 3 రూ. ప్రకాశకులు—జగ్గమాంబ ప్రచురణలు. దొరకుచోటు— గ్రంథకర్త—డిపార్ట్‌మెంట్ ఆఫ్ బాటని, పి.జి.సెంటర్, వరంగల్—1.

రతీప్రద్యుమ్నుల చరిత్రను ప్రత్యేక గ్రంథంగా వ్రాసినవారు తక్కువ.నా చిన్నతనంలో రతీప్రద్యుమ్న విజయం అనే నాటకాన్ని చదివాను, పరుచితులు వ్రాసి అచ్చువేయించిరి. అది చాలా ప్రౌఢశైలిలోది. ఈ గద్యకృతి కూడా చాలా ప్రౌఢశైలిలో వచన మాదిరిగా కూర్చబడింది. వ్యావహారికంలోనే వచన రచన ఉండాలని ప్రజాస్వామ్యం కోరుతున్న యీ రోజుల్లో గ్రాంథికంగా ప్రౌఢశైలిలో కూర్చబడిన పురాణకథ కొంతవరకూ పరిమిత ప్రయోజనం కలది గానే కనబడుతుంది. భాషా వాఙ్మయ పరిజ్ఞానం క్షీణిస్తున్న యీ కాలంలో ఇరవై యేళ్ళు మాత్రం దాటిన యువకుడు ఇట్టి ప్రౌఢ రచన చెయ్యడం మెచ్చుకోదగింది. శివతపోభంగ ప్రయత్నం కారణంగా మన్మథుడు భస్మం కావడం, రతివిలాపం, మన్మథుడు ప్రద్యుమ్నుడుగా రుక్మిణీదేవికి పుత్రుడై పుట్టడం, అతన్ని శంబరుడు అపహరించడం, శంబరాసురవధ, రతీప్రద్యుమ్నుల సమాగమం— మధ్యమధ్య కొన్ని కల్పనలతో చక్కగా కూర్చబడివి. పుస్తకం చక్కగా ముద్రించబడింది. సంధుల్లో తప్పులు దొరలినవి. అవి లెక్కలోకి రాకపోవచ్చు. రచయిత గురువు శ్రీ అచ్యుతరాజు, శ్రీ వానమామలై వరాచార్యులు, శ్రీకోవెల—సుప్రసన్నాచార్యులు మున్నగు ప్రసిద్ధ విద్వత్కవుల ప్రశంసలను అందుకొన్న యీ గద్య రచన వాఙ్మయాభిమానులు చదవదగినది.

2. **వేణుగానము.** గేయకృతి. రచయిత: శ్రీ భువనగిరి—సత్యనారాయణాచారి, పోలవరం (ప. గో. జిల్లా) క్రౌను 32 పుటలు. వెల: తెలియదు.

పోతనామాత్యుడు భాగవతంలో వేణుగానాన్ని మనోహరంగ పద్యాలలో వర్ణించాడు. దీన్ని ప్రత్యేకంగా వర్ణించినవారు ఆధునికుల్లో చాలామంది ఉన్నారు. దాన్ని గేయాల్లో వర్ణిస్తే రసవంతంగా ఉంటుందని ఈ రచయిత గేయరచనకు పూనుకున్నారు. ఈ రచన గ్రాంథికంలో నడక చక్కగా సాగింది. అతివ్యవకవివిమర్శకుల ముద్రపడితేనే తన రచన కృతార్థత పొందుతుందని కాబోలు శ్రీ కుందుర్తి అభిప్రాయం దీనికి జతకూర్చబడింది. ప్రాచీనచ్ఛందో వాసన, వెంకటే పోలికలు కిట్టని శ్రీ కుందుర్తి కొన్ని పంక్తులు ఉటంకించి విమర్శించారు. 'ఉహూర్నుటదభంగమ్మదంగనిస్వనము' వంటివి, పాడుతున్నప్పుడు అపశ్రుతులు పలికిస్తాయేమో అని అనుమానపడుతున్నారు. వినేవాళ్ళూ, చదివేవాళ్ళూ నిర్ణయించవలసిన విషయం అది!

రచయిత పెద్దవగారి 'అటచనికాంచె' పద్యంలోని భాగాన్ని అర్థంచేసుకోకుండా 'ముహూర్ను టదభంగ— అనేదాన్ని 'ఉహూర్ను టదభంగ' అని తప్పుగా గ్రహించి వాడారు. శ్రీ కుందుర్తి రచయిత మాదిరిగానే తప్పుగా గ్రహించారు. దేనినైనా విమర్శించినప్పుడు పద, పదార్థాల తత్త్వం తెలుసుకొని బాగోగులను నిర్ణయించడం సహృదయుల లక్షణం. అంతేకాని దాన్ని తెలుసుకోకుండా దుయ్యబట్టడం ఉచితంకాదని తోస్తుంది.

ఇందులో కొన్ని చోట్ల నడక కుంటుపడినట్లు తోచినా, పాడేవారు ఆ లోపాన్ని సర్దుకోవచ్చు. భాగవత వర్ణనల అడుగుజాడల్లో నడిచిన వర్ణనలు కొందరికయినా బాగున్నాయని తోచవచ్చు. **—ఆంగీరస**

కి ని మా

శ్రీ ఎస్. వి. జి. రావు సంపాదకత్వంలో వెలువడిన 'కినిమా' అధుక సినిమా పక్షపత్రిక ప్రారంభ సంచిక మా కార్యాలయం చేరింది. సమర్పణ: శ్రీ కె. హేమాంబరధరరావు, 16 పేజీలు, వెల: 50 పైసలు. వివరాలకి: కినిమా, 46, 3 వ మెయిన్‌రోడ్, సి. ఐ. టి. నగర్, మదరాసు—35.

Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press: 6 & 7, Thambu Chetty Street, Madras-1, and at Andhra Patrika Press, Mallikarjuna Rao Street, Gandhinagar, Vijayawada 3. Chief Editor: S. Sambhu Prasad.


నీడలూ
నిజాలూ
FILE



అతనూ బలంగా ఉండగలడు...
తండ్రికి తగ్గ కొడుకు!
"పిల్లలను బలంగా ఆరోగ్యంగా ఉంచుటకు మరియు వారి సరియైన పాలన, పోషణకు తల్లికి తెలివి తేటలు అవసరం" అన్న విజ్ఞతగల వాక్కులు గుర్తుంచుకోండి.
మరియొక గుర్తుంచుకోవలసిన విషయం—మీ పిల్లల ఆరోగ్యానికి గ్లాక్సో మిల్క్ ఫుడ్ ఎంత ప్రయోజనకారియో! దానిలో బలం కోసం విటమిన్‌లు, రక్తం కోసం ఇనుము, ఎముకల పుష్టికి కేల్షియం, మరియు దేహాభివృద్ధికి ప్రొటీన్లు మొదలైన అన్ని పుష్టికర పదార్థాలు సమకూర్చబడ్డాయి.
ఏం, మీపాప కూడా గ్లాక్సో పాప యేనా?
గ్లాక్సో మిల్క్ ఫుడ్ పిల్లలకు బలం మరియు ఆరోగ్యం కలిగిస్తుంది
SUNSHINE
Glaxo
BONNIE BABIES
FOR INFANT FEEDING
ENRICHED WITH VITA